ఆదివారం
గత వారం పత్రికల్లో వచ్చిన
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప fb.com/vaartha

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


28-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 27 పేజీలు: 10+4 వెల: 6.50

అక్రమ వలసదారులంతా క్రిమినల్సే: కేంద్రమంత్రి ఖట్టర్ 5లో

ఆప్ ఎమ్మెల్యేలను అడ్డుకొన్న పోలీసులు

# నేడే బడ్జెట్

## సంక్షేమం, అభివృద్ధికి సమతౌల్యం



## స్వర్ణాంధ్ర లక్ష్యంగా కేటాయింపులు

### రూ. 3.20 లక్షల కోట్లు ఉండొచ్చని అంచనా

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ఈనెల 28న ప్రవేశపెట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకోసం ఈసారి బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించే మార్గాలతో పాటు మూల ధనవ్యయం పెంచే విధంగా బడ్జెట్‌నూ రూపొందించినట్టు తెలుస్తోంది. ప్రత్యేకించి స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించారని సమాచారం. శుక్రవారం ఉదయం 10 గంటలకు మంత్రి పయ్యావుల అసెంబ్లీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూ.3.20 లక్షల కోట్ల మేర ఉండొచ్చని తెలుస్తోంది.

వ్యవసాయ బడ్జెట్ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. ఇక ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 202526 వార్షిక బడ్జెట్ ఆమోదం కోసం ఉదయం 9 గంటలకే అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ >>2

# పేదల సాధికారతే లక్ష్యం

## ఉగాదినుంచి నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా పి-4 అమలు

## అట్టడుగు ప్రజలకు సంపన్నుల తోడ్పాటు

## రూ. 16 లక్షల కోట్లకు విస్తరించిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ: సమీక్షలో సిఎం చంద్రబాబు



గురువారం పి4 అధికారులతో సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పీ4 కార్యక్రమానికి ఉగాది నుంచి ప్రారంభిస్తున్నామని సిఎం చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 విధానాన్ని ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాలకు అందిస్తున్న పథకాలకు అదనంగా ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న వారికి మరింత చేయూతను ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. దీనికి సంబంధించి పి4, ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో శాఖపరమైన సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిరం తరం పేదరికం నిర్మూలనే కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. 1995లోనే స్వయం సహాయక బృందాలను రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాల్లో కీలక భాగంగా చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి యావత్ దేశానికి >>2

# వైద్య రంగంలో వినూత్న సంస్కరణలు

## - మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యరంగంలో వినూత్న సంస్కరణలు చేపడుతున్నామని మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ క్రమంలోనే ప్రజలకు వైద్యసేవలను అత్యంత చేరువలోకి తీసుకుని వస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి ఆస్పత్రిలో సైతం ఆధునీక వైద్యసేవలు అందుబాటులో ఉంటామన్నారు. చినకాకాని వద్ద నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి దేశానికి రోల్ మోడల్ కావాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఆసుపత్రి భవన నమూనాపై తన నివాసంలో అధికారులతో లోకేశ్ సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా భవన నమునాను అధికారులు వివరించారు. అత్యాధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. వంద పడకల విభాగంలో దేశానికి రోల్ మోడల్‌గా ఆసుపత్రి నిలవాలన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు.


# ముగిసిన వల్లభనేని కస్టడీ విచారణ

**విజయవాడ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పోలీసు కస్టడీ ముగిసింది. మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించడంతో కృష్ణలంక పిఎస్‌లో పటపట పోలీసులు ఆయన్ను విచారించిన సంగతి తెలిసిందే. చివరిరోజు విచారణ ముగిసిన అనంతరం వంశీని విజయవాడ జిజిహెచ్‌కు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. కస్టడీలో వంశీతో పాటు మరో ఇద్దరు నిందితులు లక్ష్మీపతి, శివరామకృష్ణను పోలీసులు విచారించారు.

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రమేయం ఉన్నవారిపై ఆరా తీశారు. వంశీ బెదిరితేనే సత్యవర్ధన్‌ను తీసుకెళ్లినట్లు మిగతా నిందితులు చెప్పినట్లు సమాచారం. తనకేమీ తెలియదని పోలీసుల విచారణలో వంశీ పదేపదే చెప్పినట్లు తెలిసింది. దీంతో మరోసారి ఆయన్ను కస్టడీకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు.

# మోజన్లు, ఇమామ్‌లకు అందిన గౌరవ వేతనం

**అమరావతి ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇమాములు, మోజాన్లకు 6నెలల గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ ప్రభుత్వం పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5000 మంది ఇమాములు, 5000 మోజాన్లకు గౌరవ వేతనాలను చెల్లించేందుకు ఈనెల 18వ తేదీన ప్రభుత్వం రూ. 45 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 6 నెలలకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ పూర్తయినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అమరావతిలో గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని ఇమాములు, మోజన్లకు చెల్లించడంతో రంజాన్ మాసంకు ముందుగా చంద్రన్నకానుక అందిందన్న ఆనందంలో వారున్నారని అన్నారు. సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు.



# 'మహాకుంభ్'తో భారత్‌కు కొత్త శక్తి

## ప్రజల ఐక్యతకు అది నిదర్శనం

## మేళాలో లోపాలు జరిగితే క్షమించాలని ప్రజలను కోరిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకగా జరిగిన ప్రయాగరాజ్ మహాకుంభ్‌మేళాతో దేశ విదేశాల్లోని హిందువులందరినీ ఒకేవేదికపైకి తెచ్చిందని ప్రధానిమోడీ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంతటి భారీ ఎత్తున మహాకుంభమేళా నిర్వహించడం అంత సులువు కాదని ఏర్పాట్లపరంగా భక్తులెవరైనా అసౌకర్యానికి గురైతే కనుక అందుకు క్షమించాలనికోరారు. ఐక్యతకోసం జరిగిన మహాజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని తన బ్లాగ్‌లో రాసారు. అంచనాలకు మించి వివిధ ప్రాంతాలనుంచి కోట్లాదిమంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారని భారత్ కొత్తశక్తితో ముందుకు సాగుతోందని నవభారత్‌ను నిర్మించే కొత్తశకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనమనిమోడీ అన్నారు. ఇంతటి భారీ వేడుకను మరిదేనితోనూ పోల్చలేమని, త్రివేణి సంగమం నదీతీరానికి అన్నికోట్లమంది ఎలా వచ్చారన్నది ప్రపంచమే ఆశ్చర్యపోతున్నదని మోడీ అన్నారు. ఈభక్తులెవరికీ అధికారిక ఆహ్వానాలు పంపలేదు. అయినా పవిత్ర సంగమంలో పుణ్యస్నానాలకోసం వారంతా తరలివచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం సంతృప్తి తానెప్పటికీ మరిచిపోలేనని చిన్నపిల్లలనుంచి వృద్ధులవరకూ చాలామంది వ్యయప్రయాసలకోర్చి కుంభమేళాకు రావడం ఆనందంగా ఉందని మోడీ అన్నారు. మహాకుంభమేళాను విజయవంతంచేసిన యుపి ప్రభుత్వం సహకరించిన ప్రయాగరాజ్ ప్రజలు, భక్తులకు మోడీ ధన్యవాదాలు తెలిపారు. భారీ స్థాయి వేడుకను నిర్విఘ్నంగా కొనసాగించడం అనేది అంత సులువు కాదని తెలుసు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా యమునా సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నాని మోడీ తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. భగవంతుని స్వరూపాలుగా భావించేభక్తులకు సేవలు చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని ప్రార్థిస్తున్నట్లు మోడీ తన బ్లాగ్‌లో ప్రత్యేకించిమహాకుంభ్‌మేళాను ప్రస్తావించారు. >>2

# రైతు సంక్షేమానికి రూ. 100 కోట్ల నిధి!

## ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులు ఆర్థికంగా స్థిరపడేందుకు ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. వారి ప్రయోజనాల కోసమే ప్రకృతి సేద్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రైతుల్లో ఉత్సాహం నింపే దిశలో తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు,. 'ఎక్స్' వేదికగా ఆయన రైతులకు వారు సాగుచేసిన ప్రతిపంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, మార్కెటింగ్ సదుపాయాలు పెంచుతామన్నారు. రైతుకు అన్ని విధాలుగా తమ ప్రభుత్వం భరోసా నిలుస్తోందన్నారు. జాతీయ అంతర్జాతీయ పరిణామాలు ఎగుమతులు అనుగుణంగానే ధర లభిస్తుంది. లేదంటే రాత్రింబవళ్లూ కష్టపడినా ప్రయోజనం ఉండదు. రెండు మూడేళ్లు నష్టపోతే రైతుల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. తమ ప్రభుత్వం రైతు ఆ పరిస్థితి రానివ్వదన్నారు. ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటే భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు నిరాధారంగా మిగిలిపోతున్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆదుకోవడం కాదు. వారు అలాంటి ఒత్తిడిలోకి వెళ్లకుండా చేయడమే ముఖ్యం. వారి ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు మానసిక స్థైర్యం నింపేలా ఉపశమన చర్యలు చేపడితే రైతు ఆత్మహత్యలను నివారించవచ్చు. బ్యాంకర్ల సహకారంతో ఫండ్ ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. ఇందుకు రూ.100 కోట్లే కాదు. అవసరమైతే ఎంతైనా ఖర్చు చేసి రైతుకు ఆత్మహత్య అనే ఆలోచన రాకుండా చేయాలి.

గతంతో పోలిస్తే వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగాయి. తెగుళ్లు ఇతర ప్రతికూల పరిస్థితులు ధరల తగ్గుదలతో కొన్నిసార్లు పూర్తిగా నష్టపోయే పరిస్థితి. వరి రైతులకు నగదు జమ విషయంలో ప్రభుత్వ స్పందన భాగున్నా మిరప రైతుల విషయంలో ఊరటనిచ్చే నిర్ణయాలు లేవు. ప్రతికూల పరిస్థితుల్లో పంట పోతే అప్పులవాళ్లు వెంట పడతారు. కొత్తగా పంటవేయాలన్నా ఎక్కడా అప్పుపుట్టదు. కుటుంబం గడవదు. చివరకు రైతు నిస్సహాయ స్థితికి చేరుతున్నాడు అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

## పశ్చిమ గోదావరి: 63.28%

## కృష్ణా, గుంటూరు: 65.58%

## విజయనగరం, విశాఖ: 91.82%

## 3న ఓట్ల లెక్కింపు



ఓటు వేసినట్లు వేలు చూపిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయంగా కాక పుట్టించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాయి. తూర్పు-పశ్చిమ గోదావరి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ నియోజకవర్గంలో 63.28శాతం, కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్స్ 65.58శాతం, శ్రీకాకుళం-విజయనగరం- విశాఖ పట్టణం ఉపాధ్యాయుల నియోజకవర్గంలో 91.82శాతం పోలింగ్ జరిగింది. ఏపీలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఒక స్థానానికి.. కృష్ణా గుంటూరు జిల్లాల్లో ఒక గ్రాడ్యుయేట్ స్థానానికి, శ్రీకాకుళంవిజయనగరంవిశాఖపట్నంలో టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ నిర్వహించారు అధికారులు.

కృష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో హోరాహోరీ ఫైట్ నడిచింది. తెలుగుదేశం నుంచి ఆలపాటి రాజా బరిలో నిలవగా.. పిడిఎఫ్ నుంచి కేఎస్ లక్ష్మణరావు పోటీ చేశారు. ఇక.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 10మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అయితే.. ఇక్కడ కేవలం టీచర్స్ యూనియన్స్ మధ్యే ప్రధానంగా పోటీ ఉంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. వచ్చే సోమవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉండవల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తెనాలిలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల వేర్వేరుగా వచ్చి ఓటేశారు. గుంటూరులోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పల్నాడుజిల్లా నరసరావుపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, చిలకలూరి పేట ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఓటేశారు. విజయవాడలోని కోనేరు బసవపున్నయ్య చౌదరి హైస్కూల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో మాజీ మంత్రి దేవినేని ఉమా ఓటేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం హిందూ కళాశాలలోఓటేశారు. గన్నవరంలో స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు, గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఓటేశారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బంటుమిల్లి జూనియర్ కాలేజీలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దంపతులు ఓటేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, అయన కుటుంబ సభ్యులు పామర్రు జడ్పీ హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కైకలూరులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఓటు వేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడు ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధం: సిఎం 2లో

# లడ్డూ నెయ్యిలో కల్తీ నిజమే!

## విచారణలో ఇద్దరు ప్రధాన పాత్రధారుల వాంగ్మూలం

## ఇద్దరు నిందితులను మళ్లీ కస్టడీకి అడిగిన సిబిఐ




**తిరుపతి,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానానికి లడ్డూల తయారీకి టెండర్లు దక్కించుకుని సరఫరా చేసిన నెయ్యిలో కల్తీజరిగింది వాస్తవమేనని నిందితుల్లో ఇద్దరు ప్రధాన పాత్రధారులు వాంగ్మూలం ఇవ్వడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఈ కేసులో సిబిఐ సిట్ అధికారులు అరెస్టుచేసి తిరుపతి జైల్లో ఉన్న నిందితుల్లో ఏ5 అపూర్వచావ్డా, ఏ3 విపిన్‌జైన్‌ను మరోసారి కస్టడీ కోరుతూ సిబిఐ న్యాయవాదులు తిరుపతి రెండో అదనపు మున్సిఫ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏపిపి గురువారం వాదనలు వినిపించడంతో వారిద్దరినీ కస్టడీకి అప్పగించే విషయంపై ఆదేశాలు వెలువడనుంది. కాగా ఈ కేసులో ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు అనేక కీలక ఆధారాలు సేకరించారు. దీనిపై తిరుమలేశుని లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాలో ప్రధాన పాత్రధారులైన ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్, ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కీ బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలు రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే. వీరిపై నమోదైన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని వారి తరపున న్యాయవాదులు రెండుసార్లు న్యాయస్థానంలో బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. అయితే న్యాయమూర్తి బెయిల్ పిటిషన్ తిరస్కరించారు. పుణ్యక్షేత్రం టిటిడికి తిరుమలలో లడ్డూల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేస్తామని టెండర్ల విధానంలో మూడేళ్ళ క్రిందట ఒప్పందం కుదుర్చుకున్నారు. టెండర్లు దక్కించుకున్న డైరీలు, కాంట్రాక్టర్‌లు కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీనెయ్యి పంపారు. కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించి పక్కా ఆధారాలు, రికార్డులు సేకరించిన సిబిఐ సిట్ అధికారులు వేగంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

**నెయ్యిలో రసాయనాలు కలిసింది వాస్తవం:**

టిటిడికి సరఫరా చేసిన నెయ్యిలో పలు రసాయనాలు కలిపింది వాస్తవమేనని కీలక పాత్రధారి అయిన అపూర్వ వినయ్‌కాంత్ ఛావ్డా సిట్ విచారణలో తెలిపినట్లు సమాచారం. కెమెకిల్ ఇంజనీరింగ్ చదవిన అతను నెయ్యిలో రసాయనాలు కలిపానని సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. ఆ రసాయనాలు ఎలాంటివి, ఎక్కడనుండి తెప్పించారు, ఎలా ఎంత >>2

# 9 గంటలపాటు పోసాని విచారణ

## ఓబులవారిపల్లె పిఎస్‌లో ప్రశ్నించిన పోలీసులు

## రైల్వే కోడూరులో మరో కేసు నమోదు



**రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 27ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై గతంలో వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు రెచ్చగొట్టే విధంగా, కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా, కుటుంబ సభ్యులను అసభ్యంగా మాట్లాడిన కేసులో నిందితుడైన సినీ నటుడు పోసాని మురళీకృష్ణను 9 గంటల పాటు పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. రైల్వే కోడూరు జూనియర్ సివిల్ జడ్జి పీజే తేజ సాయి ఎదుట రాత్రి సుమారు 9 గంటల సమయంలో హాజరు పరిచారు. హైదరాబాదులోని పోసాని మురళీకృష్ణ నివాసంలో బుధవారం రాత్రి సంబేపల్లి ఎస్సై భక్త వత్సలం అదుపులోకి తీసుకొని నేరుగా గురువారం ఉదయం ఓబులవారి పల్లె పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. వెంటనే వైద్యులు గురు మహేష్ పరీక్షలు నిర్వహించారు. >>2



గురువారం గుజరాత్‌లోని కేవడియాలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్రపతి ముర్ము



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన హర్యానా సిఎం నాయబ్ సైని

# నేడే బడ్జెట్

>> కానుంది. అనంతరం 10గంటలకు శాసనసభలో మంత్రి పయ్యావుల బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శాసన మండలిలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక బడ్జెట్ అనంతరం ప్రత్యేకంగా వ్యవసాయబడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు శాసనసభ ముందుంచనున్నారు.

శాసన మండలిలో మంత్రి నారాయణ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. 2025 ఏప్రిల్ 1 తేదీ నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.3.20 లక్షల కోట్ల మేర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 202526 ఆర్థిక సంవత్సరంలో తల్లికి వందనం పథకంతో పాటు రైతులకు ఆర్థిక సాయంగా అన్నదాత సుఖీభవ, అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను అమలు చేయాల్సి ఉంది. అలాగే అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం పెద్ద మొత్తంలో మూలధన వ్యయాన్ని పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదివరకు 2024 స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యతలను ఇచ్చినట్టు సమాచారం. పేదలతో పాటు మధ్యతరగతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో కేటాయింపులు ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మధ్యతరగతిపై పన్నులు, కరెంటు ఛార్జీల భారం లేకుండా చూసేలా ప్రభుత్వం కసరత్తు చేసినట్టు సమాచారం. వీటితో పాటు ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్‌ను ఇచ్చే అంశంతో పాటు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేలా సీఎఫ్ఎంఎస్ ఖాతాలు నుంచి స్థానిక సంస్థల పీడీ ఖాతాలను డీలింక్ చేసే అంశంపై కూడా బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.ఉపాధి అవకాశాలను పెంచేలా వివిధ పీపీపీ ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను కూడా ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారివారి నియోజకవర్గాల అభివృద్ధి కోసం కోటి రూపాయల చొప్పున కేటాయించేందుకూ ఆస్కారం ఉన్నట్టు సమాచారం. అలు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా ప్రతి జిల్లా కలెక్టర్ ఆధీనంలోనూ కోటి రూపాయల చొప్పున ఎమర్జెన్సీ ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసే అంశాన్ని ఆర్థిక మంత్రి తన బడ్జెట్‌లో పేర్కొనే అవకాశం ఉంది. మహిళలు, రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేలా వారికి వడ్డీలేని రుణాల అంశాన్ని కూడా బడ్జెట్‌లో పేర్కొనే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ వైద్య సేవ కింద హైబ్రీడ్ బీమా యోజనను కూడా ప్రభుత్వం ప్రకటించనుంది.సంపద సృష్టితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు అడుగుల వేస్తున్నామంటున్న ఈ బడ్జెట్ ఏయే రంగానికి ఎటువంటి కేటాయింపులు చేస్తుందో అనే ఆసక్తి సర్వత్రా నెలకుంది.

# ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధం: సిఎం

**విజయవాడ, ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాస్వామ్య దేశంలో ఓటే అతిపెద్ద ఆయుధం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అభిప్రాయాన్ని తెలపడానికి, ప్రజాస్వామ్యాన్ని చైతన్య పరచడానికి ఓటు ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉండవల్లిలోని గాదె రామయ్య - సీతారావమ్మ ఎంపీయూపీ స్కూల్ బూత్‌లో మంత్రి నారా లోకేష్‌తో కలిసి వెళ్లి ఓటు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఆయన మీడియాతో ఓటు వేయడం అందరి బాధ్యతఅని, దాన్ని హక్కుగా వినియోగించుకోవాలని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, దేశ ప్రతిష్టకు ఓటు బలంగా పని చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో గత అయిదేళ్ళ పాటు అరాచక పాలన సాగిందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం,నాటి ముఖ్యమంత్రి అహంకార పూరిత విధానాల వలన ప్రజలకు అనువ్యాంగా ఇబ్బందులు ఎదురు కావడంతో పాటు,ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిందన్నారు.పేద ప్రజల తీరని వ్యధలకు గురయ్యారన్నారు. వాళ్లంతా ఓపిక పట్టి సార్వత్రిక ఎన్నికల్లో గత ప్రభుత్వాన్ని గద్దె దింపారన్నారు. ఓటు అరాచక శక్తులకు తగిన రీతిలో గుణపాఠం చెబుతుందన్నారు.ప్రజలు ఓటు వేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఆలోచించాలన్నారు. ప్రజలు ఎంతోనమ్మకంతో తమకు అధికారం ఇచ్చారన్నారు. ఈ 9నెలల కాలంలో తమప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ఒకపక్క పెట్టుబడులను ఆకర్షిస్తూ,సంపద సృష్టి మార్గం వేస్తూ, రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు.సమిష్టి దార్శనికత, ఆలోచనలు, అంకితభావంతో కూడిన కార్యక్రమాలు స్థూల స్థాయిలో ప్రణాళికలు రచించి, సూక్ష్మస్థాయిలో అమలు చేయడంద్వారా ప్రతి పౌరుడికి సుసంపన్నమైన, స్వావలంబన, గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్ధారిస్తూ పేదరికంలేని సమాజం దిశగా ఆంధ్రప్రదేశ్ ను నడిపిస్తున్నామని అన్నారు.

# ఆస్కార్ విజేత హాలీవుడ్ నటుడు, భార్య అనుమానాస్పద మృతి

**మెక్సికో, ఫిబ్రవరి 27:** రెండుసార్లు ఆస్కార్ విజేతగా నిలిచిన హాలీవుడ్ నటుడు జెనెహ్యాక్‌మెన్ ఆతనిభార్య అరకావాలు తమ ఇంట్లోని విగతజీవులుగా పడి ఉన్న వైనాన్ని పోలీసులు గుర్తించారు. న్యూమెక్సికోలోని వారి సొంత ఇల్లు శాంతాఫేలోనే 95 ఏళ్ల హ్యాక్‌మాన్, 63 ఏళ్ల భార్య బెట్సీలు చనిపోయి ఉన్నట్లు తేలింది. శాంతాఫే కౌంటీ షెరీఫ్ అదన్ మెన్‌డోజా వీరిద్దరి మరణాలను ధృవీకరించారు. ప్రస్తుతం విచారణజరుగుతున్నదని అన్నారు. సూర్యాస్తమయం సమయంలోనే వీరు చనిపోయినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుత దర్యాప్తును ముమ్మరం చేసామని ఈ అనుమానాస్పద మృతికి గలకారణాలు ముందు వెలికి తీయాల్సి ఉందన్నారు. సెర్చ్‌వారంట్‌కు అనుమతి లభించిన తర్వాత వీరి మృతిలో కొంత క్లూ లభించవచ్చిని తెలుస్తోంది. 1930లో జన్మించిన హ్యాక్‌మాన్ సుమారు 100కుపైగా కీలకపాత్రలు పోషించారు. ఆయనకు ఉత్తమనటునిగా జిమ్మి పోపెయెడోయిల్‌గా, ఫ్రెంచ్ కనెక్షన్ చిత్రానికి, ఉత్తమ సహచర నటుడిగా లిటిల్‌బిల్ డాగ్గెట్‌గా అన్ ఫర్గివెన్‌లో నటించినందుకుగాను లభించాయి.

# అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలక శాఖ కీలక మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలక శాఖ గురువారం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలతో మార్గదర్శకాలు జారీ చేసినట్లు ప్రకటించారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలని సూచనలు చేశారు. భవన నిర్మాణ ప్రణాళిక మంజూరు సమయంలోనే అండర్ టేకింగ్ తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలని సూచించారు. ప్లాన్ మేరకు నిర్మాణం లేకపోతే నివాసయోగ్య ధ్రువపత్రం జారీ చేయకూడదని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ స్పష్టపరిచారు. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని చెప్పారు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు ఉంటాయని అన్నారు. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు జారీ చేయొద్దని ఆదేశాలు జారీ చేశారు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ సూచించారు.

# పోసాని విచారణ

>> పోలీసు విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యుడు సర్టిఫికెట్ జారీ చేశారు. అనంతరం పోలీసులు విచారణ ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటలకు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ వచ్చారు. పోలీసులు 9గంటల పాటు పోసానిని సుదీర్ఘంగా విచారించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ను దూషించేందుకు గల కారణాలను ప్రశ్నించినట్లు తెలిసింది. ఎక్కువసేపు పోసాని మౌనంగా ఉన్నట్టు తెలిసింది. పోలీసులకు ఏమాత్రం సహకరించలేదని సమాచారం. ఉదయం ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వెంటనే రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, హైకోర్టు న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, కడప న్యాయవాది నాగిరెడ్డి, పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు తరలి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే, న్యాయవాదులు పోసానిని కలిసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ సందర్భంగా స్వల్ప వాగ్వాదం జరిగింది. విచారణకు సహకరించాలని, విధి నిర్వహణకు అడ్డు తగిలితే సహించేది లేదని స్పష్టం చేశారు. దీంతో వారు వెనుతిరిగారు. పోసానికి పోలీసులు జారీ చేసిన నోటీసులో సెక్షన్ 196, 353,111 ఆర్ /డబ్ల్యూ 3(5) కింద కేసు నమోదు చేశారు. తాజాగా రైల్వే కోడూరులో పోసానిపై మరొక కేసు నమోదు అయినట్లు సమాచారం. రాత్రి సుమారు 9 గంటల సమయంలో రైల్వే కోడూరు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ప్రభుత్వ న్యాయవాది మోబీన, పోసాని మురళి కృష్ణ తరుపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్ రెడ్డి నాగిరెడ్డి లు తమ వాదనలు వినిపించారు. రాత్రి 11 గంటల వరకు న్యాయమూర్తి ఎదుట ఇరవర్గాల వాదనలు జరిగాయి.

# పేదల సాధికారతే లక్ష్యం

>> ఆదర్శంగా నిలిచారు. స్వయం సహాయక బృందాలు లక్షలాది మంది మహిళలు, వారి కుటుంబాల జీవితాలను మారుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల బ్యాంకు లింకేజీ వృద్ధి అమోఘం. గ్రామీణ ప్రాంతాల్లో ఏటా సుమారు రూ.35,000 కోట్ల బ్యాంకు లింకేజీ పంపిణీతో 30 జాతీయ వాటాతో మరియు స్వయం సహాయక బృందాల బ్యాంకు లింకేజీ కార్యక్రమం కింద 99.66 రికవరీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఐటిపై రాష్ట్రం ముందుగానే దృష్టి పెట్టడం వల్ల ప్రవాస తెలుగువారు ఈ పరివర్తనను ప్రత్యక్షంగా చూశారు, ప్రవాస తెలుగువారి తలసరి ఆదాయం అమెరికాలో అత్యధికంగా ఉంది. ఇప్పుడు, ఆంధ్రప్రదేశ్ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోంది. ఐటి నుండి కృత్రిమ మేధవరకు పరిపాలన, పరిశ్రమలు మరియు ఆర్థిక వృద్ధి యొక్క భవిష్యత్తును రూపొందించడానికి కృత్రిమ మేధస్సు యొక్క శక్తిని ఉపయోగిస్తున్నది.మనం ఇప్పటికే స్వర్ణాంధ్ర 2047 సుభిక్ష భవిష్యత్తు కోసం మన దార్శనికతను నిర్వచించే పది మార్గదర్శక సూత్రాలను రూపొందించామన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.2,488 కోట్ల ఆర్థిక సంఘం గ్రాంట్లను విడుదల చేయడం ద్వారా స్థానిక పాలనను బలోపేతం చేశాం. విశాఖ ఉక్కు కర్మాగారం పునరుద్ధరణ, కొత్త రైల్వే జోన్ ఏర్పాటు హామీలను నెరవేర్చాలనే మా నిబద్ధతకు ఇది నిదర్శనం. సుస్థిర వృద్ధి, శ్రేయస్సుకు దోహదపడే 22 కొత్త విధానాలను ప్రారంభించడం ద్వారా బలమైన పునాది వేశాం. భారీ పెట్టుబడుల కోసం గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ, టాటా పవర్, గ్రీన్ కో గ్రూప్, బిపిసిఎల్, టిసిఎస్ వంటి అనేక అంతర్జాతీయ దిగ్గజాలను ఆకర్షిస్తున్నాం. ఇప్పటి వరకు ఇన్వెస్టర్లు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు మరియు 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడినది. 2024-25 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత సంవత్సరం రూ.14.22 లక్షల కోట్ల నుండి రూ.16 లక్షల కోట్లకు విస్తరించింది. ఇది 12.94 నామమాత్రపు వృద్ధి రేటు. మన తలసరి ఆదాయం కూడా గత సంవత్సరంలోని రూ.2.37 లక్షల నుంచి రూ.2.68 లక్షలకు పెరిగింది. వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.86 , పరిశ్రమలు 6.71 , సేవల రంగం 11.70 చొప్పున వృద్ధి చెందాయి. ఈ ప్రగతి అన్ని కీలక రంగాలలో గణనీయమైన పనితీరు వల్ల సాధ్యమయిందన్నారు.

**పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం**

సంపదలో పైవరుసలో ఉన్న కుటుంబాలు సమజంలో అట్టడుగునఉన్న కుటుంబాలకు, మద్దతుగా నిలబడటమే పీ4 విధానం యొక్క ముఖ్య ఉద్దేశం కావాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకు నిర్మాణాత్మక, స్థిరమైన విధానం ఉండాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పి4 విధానం ఈ ఉగాదినాటికికార్యరూపం దాల్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొదటగా రాష్ట్రంలోని 4 గ్రామాల్లో పీ4 విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు రూపొందించారు. ఈ పైలెట్‌ప్రాజెక్టుతో5,869 కుటుంబాలకు లబ్ధి పొందుతాయి.

**కుటుంబాల ధృవీకరణ**

ఉగాది నాటికి అమల్లోకి పీ4 విధానం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను జీఎస్‌డబ్లుఎస్ డేటాబేస్, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభ ధృవీకరణ ద్వారా గుర్తించడం జరుగుతోందన్నారు. 2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాలు మెట్ట భూమి ఉన్న భూ యజమానులను, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారిని, ఫోర్‌వీలర్ వెహికల్ ఉన్న వారిని, 200 యూనిట్లు కన్నా ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వారిని, మున్సిపల్ ఏరియాలో సొంతఆస్తి ఉన్న వారిని, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న కుటుంబాల వారిని ఈ కార్యక్రమం నుంచి మినహాయించారు.దీంతో రాష్ట్రంలోని 40 లక్షల కుటుంబాలు పీ4కు అర్హులుగా నిర్ధారించారు.

# ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఉత్తరకొరియా అదనపు బలగాలు

**సియోల్, ఫిబ్రవరి 27:** ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం కూడా పాల్గొంటున్నది. ఈక్రమంలో వందలమంది కిమ్‌సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అయినా కూడా తాజాగా మరిన్ని బలగాలను కిమ్ రష్యాకు పంపించినట్లు దక్షిణకొరియా నిఘా విభాగం నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ వెల్లడించింది. ఈసారి ఎంతమందిని పంపించిందనే అంశం తెలుసుకునేప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రకటించింది. రష్యాకు భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి పంపిస్తున్న ఉత్తరకొరియా కొంతకాలం క్రితం 10 నుంచి 12 వేలమంది సైనికులను పంపించిందని అమెరికా దక్షిణకొరియాతోపాటు ఉక్రెయిన్ నిఘా విభాగాలు వెల్లడించాయి. గడచిన రెండునెలల్లో కుర్స్క్ ప్రాంతంలో వెయ్యినుంచి మూడువేలమంది కిమ్‌సైన్యాన్ని మొహరించినట్లు తెలుస్తోంది. ఉత్తరకొరియా సైనికులు చాలా క్రమశిక్షణతోపాటు మంచి శిక్షణకూడా పొందినట్లు కనిపిస్తున్నారని తెలుస్తోంది. అయితే యుద్ధక్షేత్రంలో అనుభవలేమి, అక్కడిబూభాగంపై అవగాహన లేకపోవడంతో డ్రోన్ దాడులకు లక్ష్యంగా మారుతున్నట్లు సమాచారం. జనవరిలోనే 300 మంది కిమ్‌సైనికులు చనిపోగా 2700 మంది గాయపడినట్లు అంచనా. అయితే మొత్తంగా 4వేల మంది ఉత్తరకొరియా సైనికులు చనిపోవడమో లేదా గాయపడటమో జరిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు.



అయితే అమెరికా మాత్రం ఈసంఖ్యను 1200గా చెపుతోంది. సైనిక ఆయుధ సాయం అందిస్తున్న ఉత్తరకొరియాకు బహుమతిగా రష్యా అత్యాధునిక ఆయుధాలు, సాంకేతిక వ్యవస్థలను అందిస్తోందని దక్షిణకొరియా భావిస్తోంది. దీనివల్ల ఉత్తరకొరియా తన అణ్వాయుధ వ్యవస్థను మరింత బలోపేతంచేయవచ్చని అంచనా. ఉక్రెయిన్ రష్యా యుద్ధం ముగింపుకోసం సౌదీ అరేబియా వేదికగాచర్చలుజరుగుతున్నవేళ ఉత్తరకొరియా అదనపు బలగాలను పంపించడం వివాదాన్ని రేకెత్తిస్తోంది.

# లడ్డూ నెయ్యిలో కల్తీ నిజమే!

>> మోతాదులో కలిపారు,ఇంకా ఎవరెవరిపాత్ర ఉందనే విషయాలు తేలాల్సి ఉంది. ఇందుకోసం అపూర్వచావ్డాను, విపిన్‌జైన్‌ను మరోసారి కస్టడీకి ఇవ్వాలని సిబిఐ న్యాయవాదులు కోరారు. సిట్ తరపున తిరుపతి ఏపిపి, విజయవాడ సిబిఐ కోర్టు ఏపిపి వాదనలు వినిపించారు. ఇదిలా ఉండగా బోలేబాబా ఆర్గానిక్ డైరీ డైరెక్టర్లుగా చలామణి అవుతున్న విపిన్‌జైన్, షామిల్‌జైన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను వారి తరపు న్యాయవాదులు ఉపసంహరించుకోవడం పెద్దట్విస్ట్. కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉండటంతో బెయిల్ విజ్ఞప్తిని వెనక్కుతీసుకున్నట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ కేసులో ఆ ఇద్దరినీ మరోసారి కస్టడీకి తీసుకుని విచారణ చేస్తే అసలు నెయ్యి టెండర్లు వీరికి ఎలా కట్టబెట్టారు? కల్తీనెయ్యి సరఫరా చేసినా టిటిడిలో సంబంధిత మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్ విభాగం అధికారులు, విజిలెన్స్, పోటు విభాగం అధికారులు నోరుమెదపకపోవడం కారణాలు కూడా వెలుగుచూడనున్నాయి. దీనివెనుక ఉన్న అసలు సూత్రధారుల పేర్లు వెల్లడైతేగానీ కల్తీనెయ్యి బాగోతం దొంగలు ఎవరనేది తేలనుంది. ఎక్కడో ఉత్తరాఖండ్‌లో ఉన్న డైరీ నుండి నెయ్యిసరఫరా చేయడానికి మూడేళ్ళక్రిందట ఎలా అనుమతులిచ్చారు?దీనివెనుక ఎవరున్నారనేది తేల్చాల్సి ఉంది.

# బిజెపి చీఫ్ సమక్షంలోనే నాయకుల బాహాబాహీ

**జైపూర్, ఫిబ్రవరి 27:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలోనే ఇరువురు బిజెపి నాయకులు చొక్కాలు పట్టుకున్న వైనం బయటికి రావడంతో బిజెపి తీవ్రంగా పరిగణించింది. రాజస్థాన్ బిజెపి కార్యాలయంలో జరిగిన సమావేశంలోనే ఈసంఘటన చోటుచేసుంది. ఇద్దరునేతలు ఒకరి కాలర్ ఒకరు పట్టుకుని తోసుకోవడం, ఆపై ఒకరినొకరు కొట్టుకోవడం వంటివి వైరల్ అయ్యాయి. ఒకరితలపై ఒకరు పిడిగుద్దులతో దాడిచేసుకుంటున్న విడియోలు వైరల్ కావడంతో బిజెపి హైకమాండ్ రాష్ట్రయూనిట్‌కు చురకలువేసింది. ఈసంఘటనతో వెంటనే ఇతర బిజెపి నాయకులు జోక్యంచేసుకుని ఇరవురినీ పక్కకు తీసుకుపోయారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోర్‌కు సన్మాన కార్యక్రమంలోనే ఈ సంఘటన జరిగిందని తేలింది. బిజెపి కార్యవర్గంలోని మైనార్టీమోర్చా నాయకుడు ప్రస్తుత ఆఫీస్ బేరర్‌పై దాడికి దిగినట్లు తేలింది. ఇందుకు ప్రతిగా ఆఫీస్‌బేరర్ కూడా దాడిచేసాడు. మాజీ మైనార్టీ నాయకుడు జాకీ రాష్ట్ర అధ్యక్షుడిని వేదికవరకూ ఎస్కార్టుగా తీసుకొచ్చారు. వేదికపైకి ఎక్కుతున్న సమయంలోనే మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జావేద్ ఖురేషి ఆతడిని అడ్డగించాడు. దీనితోనే ఘర్షణకు దారితీసి జావేద్‌ను జాకీ చెంపదెబ్బలు కొట్టడం కనిపించింది.

# భారత్‌కు కొత్త శక్తి

>> **66 కోట్లమంది పుణ్యస్నానాలు**

ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వం అధికారిక గణాంకాలను విడుదలచేసింది. మొత్తం మహాకుంభ్‌మేళా 45రోజుల్లోను దేశవిదేశాలనుంచి యాత్రీకులు భక్తులు వచ్చారని 66 కోట్లమంది త్రివేణిసంగమంలో పవిత్రస్నానం ఆచరించారని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సర్కారు ప్రకటించింది. మహాశివరాత్రి చివరిరోజు ఒక్కరోజే 2 కోట్లమందికిపైగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలుచేసినట్లు తెలిపారు. కుంభమేళా మొత్తం సజావుగా సాగిందని, తొలినాళ్లలో మౌని అమావాస్యరోజు మినహా మిగిలిన రోజులన్నీ భక్తులకు పూర్తిస్థాయిలో సేవలందించగలిగామన్నారు. మహాకుంభమేళాలో విస్తృతస్థాయి వసతులు ఏర్పాటు చేసినందున రెండులక్షలకోట్ల వ్యాపారం జరుగుతుందని యుపి సర్కారు అంచనావేసింది.

# రాజధానిలో వేలాదిగా సిసి కెమెరాలు!

## ఆంక్షల పర్యవేక్షణకే తాలిబన్ల కార్యాచరణ



**కాబూల్, ఫిబ్రవరి 27:** ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ల పాలనలో అనేక ఆంక్షలు అమలు అవుతున్నాయి. ఈక్రమంలోనే రాజధాని కాబూల్‌లో వేలాదిగా సిసి కెమేరాలు ఏర్పాటుచేసారు. నేరాల నిరోధానికే ఈచర్యలు తీసుకుంటున్నట్లు తాలిబన్లు చెపుతున్నా పౌరులపై కఠిన ఆంక్షల అమలు పర్యవేక్షణకోసమే వీటిని ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాబూల్‌జనాభా సుమారు 50 లక్షలు. తాలిబన్ల పాలన ఆరంభం అయిన తర్వాత మహిళలు ఉద్యోగాలుచేయడం, వస్త్రధారణ, వినోదం సహా చిన్నారుల విద్యపైనా ఆంక్షలు విధించారు. ఇదే సమయంలో కీలకనగరాల్లో సిసికెమేరాలు భారీ సంఖ్యలో ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.రాజధాని కాబూల్‌లోనే ఇప్పటివరకూ సుమారు 90 వేల కెమేరాలు పెట్టినట్లు అంచనా. వీటన్నింటినీ సెంట్రల్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానించారు. సున్నిత ప్రాంతాలు రద్దీకూడళ్లు, చౌరస్తాలు, కీలక కూడళ్లలో నిఘా నేత్రాలను ఏర్పాటుచేసినట్లు తాలిబన్ పాలకులు చెప్పారు. అయితే ఇంత భారీ సంఖ్యలో కెమేరాలు ఎక్కడినుంచి వచ్చాయి. వీటి ఏర్పాటు నిర్వహణకు ఎవరు సాయం చేస్తున్నారనే విషయమై తాలిబన్లు అధికారికంగాప్రకటించడంలేదు.

చైనాకు చెందిన ఒకసంస్థ వీటిని ఏర్పాటుచేసిందన ఇసమాచారం. ఆర్థికసంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్ఘన్‌లో నేరాలుకూడా పెరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఇస్లామిక్‌స్టేట్ వంటిసంస్థలు తాలిబన్‌తోపాటు మైనార్టీవర్గాలపై దాడులకు దిగుతున్నాయి. అందుకే నిఘా కెమేరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తాలిబన్‌పాలకులు చెపుతున్నారు. వీటి ఏర్పాటు తర్వాత చోరీలు, దోపిడీలు హత్యలు కిడ్నాప్‌కేసులు గణనీయంగా తగ్గాయని రానున్న రోజుల్లో దేశం మొత్తం విస్తరిస్తామని తాలిబన్ అంతర్గత వ్యవహారాలశాఖ వెల్లడించింది. అయితే తాలిబన్ చర్యలపై అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి మానవహక్కుల సంఘాలనుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

# గోరంట్ల మాధవ్‌కు పోలీసుల నోటీసులు

**అనంతపురం, ఫిబ్రవరి 27, ప్రభాత వార్త బ్యూరో:** వైఎస్సార్సీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు విజయవాడ పోలీసులు బుధవారం నోటీసులు ఇచ్చారు. విజయవాడ పోలీసులు స్వయంగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓ పోక్సో కేసులో బాధితురాలి పేరును ఆయన బయటకు చెప్పారని వాసిరెడ్డి పద్మ 2024 నవంబర్లో ఫిర్యాదు చేశారు. దీంతో మాధవ్‌పై 72, 79 బిఎన్‌ఎస్ కింద కేసు నమోదుచేశారు. వచ్చే నెల 5న సైబర్ క్రైమ్‌పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 28-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
అమావాస్య ఉ.6.15
శతభిష మ.1.40
వర్జ్యం రా.7.27 - 8.54
దు.ఉ.8.57-9.44
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఖర్చులు పెరుగుతాయి.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. రుణబంధాలు తప్పవు.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

**కర్కాటకం :** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** కుటుంబ సమస్యలు పరిష్కరించుకొంటారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి.క్రయవిక్రయాలు.

**కన్య :** సన్నిహితులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది. ఖర్చులు పెరిగి ఆందోళనకు కారణం అవుతుంది.

**వృశ్చికం:** విలువైన వస్తువులు, ఆభరణాలు జాగ్రత్త అవసరం. చోర భయం. కాంట్రాక్టులు లభిస్తాయి.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మకరం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మీనం:** మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## పోసాని కృష్ణమురళి అరెస్ట్‌ను ఖండించిన మాజీ సిఎం జగన్

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్ ను వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఖండించారు. అరెస్ట్ నేపథ్యంలో హైదరాబాద్ లోని ఆయన భార్య పోసాని కుసుమలతను గురువారం ఫోన్ లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వ పాలన నిరంకుశంగా సాగుతోందని, ఈ అరెస్ట్ విషయంలో పోసాని కృష్ణమురళికి వైయస్ఆర్సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు, దేవుడు చూస్తున్నారని, కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ తరుఫున న్యాయ పరంగా సహాయం అందిస్తామని, ఇప్పటికే పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులకు ఈ వ్యవహారాన్ని అప్ప గించామని తెలిపారు.

## రాష్ట్రంలో చురుకుగా రైలు మార్గం పనులు

### తెలుగు రాష్ట్రాల్లో తిరిగే సింహాద్రి, ఉదయ్, జన్మభూమి రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న రైలు మార్గం కారణంగా తెలుగు రాష్ట్రాలలో రాకపోకలు సాగించే సింహాద్రి, ఉదయ్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. విజయవాడ రైల్వే డివిజన్‌లోని కడియం–ద్వారపుడి–అనపర్తిల మధ్య ఆటో మెటిక్ సెక్షన్‌కు సంబంధించిన నాన్–ఇంటర్ లాకింగ్ సాంకేతిక పనుల కారణంగా గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే నెంబర్ 17239 సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 1,2వ తేదీల్లో, విశాఖపట్నం నుంచి గుంటూరు వెళ్లే నెంబర్ 17240సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2,3వ తేదీల్లోను,విశాఖపట్నం– గుంటూరు– విశాఖ పట్నం మధ్య తిరిగే నెంబర్ 22701 /02,ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2న, విశాఖ పట్నం–లింగంపల్లి–విశాఖపట్నంల మధ్య తిరిగే నెంబర్ 12805/06 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను మార్చి 3న రద్దు చేశారు.



కెరీర్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** వైజాగ్‌లోని గీతం వర్సిటీ వేదికగా వచ్చే నెలలో నిర్వహించే అతిపెద్ద కెరీర్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. నాస్కామ్ ఫ్రైమ్ కెరీర్ ఫెయిర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ ఫెయిర్‌లో 49 టాప్ ఐటీ.. ఐటీ ఆధారిత కంపెనీలు.. ఉద్యోగుల కోసం రానున్నట్లు తెలిపారు. ఇందులో 10 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలను ఏపీ యువతకు కల్పించడమే లక్ష్యంగా ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు నారా లోకేష్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ కెరీర్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం సాయంత్రం మంత్రి లోకేష్ విడుదల చేశారు. ఈ కెరీర్ ఫెయిర్‌ను ఏపీ ఉన్నత విద్యామండలి, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ నిర్వహిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఈ కెరీర్ ఫెయిర్‌ను మార్చి 5, 6వ తేదీల్లో విశాఖలోని గీతం విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2024, 2025 పాస్‌అవుట్ అయిన వివిధ రకాల కోర్సులు చేసిన యువత ఈ కెరీర్ ఫెయిర్ ఉపయోగపడుతుందని వివరించారు. టెక్, ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ అండ్ డిప్లమా కోర్సులు చేసిన విద్యార్థులు ఈ కెరీర్ ఫెయిర్‌కు అర్హులని చెప్పారు. ముందుగా రిజిస్ట్రేషన్లు చేసుకుని ముందుగా వచ్చిన వారినే తొలి ప్రాధాన్యంగా తీసుకుని.. ఈ కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తారని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇక ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనాలి అనుకునే నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 3వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం ఈ లింక్‌ను ఓపెన్ చేసి వివరాలు నింపాలని పేర్కొన్నారు. ఇక భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దే ఈ సదవకాశాన్ని ఏపీ యువత వదులుకోవద్దని ఈ సందర్భంగా నారా లోకేష్ హితవు పలికారు. ఏపీ యువతకు ఉద్యోగ అవకాశాలు అందించడం కోసం ఈ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# పురవీధుల్లో కదలిన గౌరీ శంకరుల రథాలు



**(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)** 'కైలాస వాసీ భగవాన్ శ్రీకాళహస్తీశ్వరవః కరోతు నిత్యకళ్యాణం కరుణా వరుణాలయః', హర హర మహాదేవ శంభోశంకర,'జై కాళి, జై జై భద్రకాళి' అంటూ గౌరీ శంకరుల రథాలు పురవీధుల్లో ఊరేగాయి.గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగుమాడా వీధుల్లో సుమారు మూడు లక్షల మంది వరకు కైలాసనాధుని రథోత్సవంలో పాల్గొన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం రథోత్సవానికి వచ్చిన జనం రాత్రి తెప్పోత్సవం వరకు నిరీక్షించటం కనబడింది. మహాశివరాత్రి జనజాగరణ రథోత్సవంకు జనం తండోపతండాలుగా కదలి వచ్చారు. ఉత్సవాల్లో యువత అధికంగా కనబడ్డారు. మహాశివరాత్రి జన జాగరణకు వచ్చిన పల్లెల్లోని జనం రథోత్సవం వరకు స్వామి అమ్మవార్ల సేవలో గడిపారు.మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి సంబంధించి హాలాహలాన్ని సేవించిన గరళకంఠుడు పునర్జన్మ ఎత్తినట్లు తమ ఆరాధ్యదైవాన్ని ఊరేగిస్తూ నిర్వహించే ఉత్సవాన్ని రథోత్సవం అని అంటారని చెబుతారు. ఈ ఉత్సవానికి ఏ ఏడాదికా ఏడాది భక్తుల సంఖ్య పెరుగుతోంది, మహాశివరాత్రి జన జాగరణలో కనురెప్పపాటు కునుకు తీసిన శ్మశానాధీశుడు మేల్కొన్న సందర్భంగా దేవదానవులు జరుపుకునే ఉత్సవాన్ని నంది సేవ అంటారు. ప్రజలుజరుపుకునే ఉత్సవాన్ని రథోత్సవం అంటారు. ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో జనం తండోపతండాలుగా వచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లను 11 గంటలకు ముందే ఆలయం నుంచి బయటికి తెచ్చారు. ఆలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు నాటి రాజులు బహూకరించిన ఏడువారాల నగలు ప్రత్యేకాకర్షణగా మారింది. అలంకార గురుకుల్స్ రాజేష్‌గురుకుల్, సూరి గురుకుల్స్ ముస్తాబు చేసారు. ఉభయదారులు గాజుల సత్యనారాయణ,సరస్వతి దేవిలు వెంటరాగా రథోత్సవానికి స్వామి అమ్మవార్లను సాగనంపారు. ఇక పూల ముస్తాబు సరేసరి. ఇక్కడి ఆలయంలో సోమాస్కందమూర్తిగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుడు 38 అడుగు పెద్ద రథంలో, జ్ఞానప్రసూనాంబగా వెలసిన దేవేరి 36అడుగుల చిన్నరథంలో ప్రతిష్టించారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత నందిసేవలో పాల్గొన్న స్వామి అమ్మవార్లను ఉదయం లింగోద్భవ అభిషేకం అనంతరం ప్రకటించిన వేళ ప్రకారం ఉదయం పదిగంటలకే ముస్తాబు చేసారు.దేవాలయంలో ప్రదక్షిణలు జరిపిన తరువాత శాస్త్రోక్తంగా పాతాళవినాయక ఆలయం ఎదురుగా ఉన్న శివయ్యగోపురం గుండా రాజగోపురం నుంచి నిప్పాళ, మురారి వారి మండపం వద్దకు తీసుకొచ్చారు. మేళ తాళాలు, మంగళవాయిద్యాలు,వివిధ నాట్యాలు చేసే బృందాలు, భారీ ఎత్తున భక్తులకు కనువిందుచేసే అంశాలతో ముందుకు సాగారు.మండపాల వద్ద వేదపండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయప్రధా ర్చకులు డాక్టర్ ఎస్ఎంకె స్వామి నాథన్ గురుకుల్ హోమం పెట్టి పూజలు జరిపి సంకల్పం చేసారు.ఈ కార్యక్రమాల్లో ఉభయ దారులు గాజుల సత్యనారాయణ దంపతులు కుటుంబసభ్యులు సంకల్పం చేయగా అలాగే అదిధులు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, కోలా ఆనంద్‌కుమార్, సేవా కమిటి కి చెందిన రంగినేని చెంచయ్యనాయుడు సభ్యులుతో సంకల్పం చేసి పూజలుజరిపారు.ఈ కార్యక్ర మాల్లో దేశం నాయకులు హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించబడ

# విద్యుత్ సామర్థ్యం మెరుగుపరచే కృషి

### జెన్కో ఎండి కెవిఎన్ చక్రధర్‌బాబు

**విజయవాడ, ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి: :** శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్డీఎస్టీపీఎస్) లోని యూనిట్3 (800 మెగావాట్లు) కమర్షియల్ ఆపరేషన్ డేట్ (సిఓడీ ) ప్రారంభించిన నాటి నుంచి నిరంతరాయంగా 100 రోజుల పాటు విద్యుత్ ఉత్పత్తిని చేసి రికార్డు ను నమోదు చేసిందని ఏ పీ జెన్కో ఎం డీ కె వీ ఎన్ చక్రధర్ బాబు తెలిపారు. ఈ ఎస్డీఎస్టీపీఎస్ ప్రాజెక్ట్ ఏ పీ జెన్కో నిర్వహణ సామర్థం, సాంకేతిక నైపుణ్యం, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచిందని , ఇందుకు ప్రధాన కారణం అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు, సిబ్బందిదే కీలక భూమిక అని ఆయన పేర్కొన్నారు.2024 నవంబర్ 18 నుంచి ఎస్డీఎస్టీపీఎస్ మూడవ యూనిట్ 100 రోజుల పాటు సుదీర్ఘంగా విద్యుత్ ఉత్పత్తి చేసిన సందర్భంగా ఏ పీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ కెవీఎన్ చక్రధర్ బాబు సిబ్బందిని , ఇంజినీర్లను గురు



వారం అభినం దించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు గాను నిరంతర విద్యుత్ సరఫరా అందిం చేందుకు ఏ పీ జెన్కో కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గార్ల సహాయ సహకారాలు , దిశానిర్దేశాలతో ఏ పీ జెన్కో విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు నెలకొల్పుతుందని ఆయన తెలిపారు. వారి ప్రోత్సాహం , సహాయ సహకారాల వలనే ఇవి సాధ్యమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నూరు రోజుల నిరంతర విద్యుత్ ఉత్పత్తిలో , యూనిట్3 మొత్తం 1596.30 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయగా, 83 ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీ ఎల్ ఎఫ్ ) తో అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిందని ఆయన పేర్కొన్నారు. ఎస్డీఎస్టీపీఎస్ రోజుకు 45 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తూ,

ఏపీజెన్కో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో 40 వాటా కలిగి ఉందని ఆయన తెలిపారు. ఈ యూనిట్ స్థిరంగా కొనసాగించేందుకు ఏపీజెన్కో అధునాతన నిర్వహణ విధానాలు, సాంకేతిక ఆధునికత విధానాలను అమలు చేస్తోందని, ఈ విధంగా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా రాష్ట్ర విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చడంలో ఎస్డీఎస్టీపీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని చక్రధర్ బాబు పేర్కొన్నారు.

# సంస్కరణలు సఫలం

### - లింగోద్భవ దర్శనం సక్సెస్

**(శ్రీకాళహస్తి-ప్రభాతవార్త)** ప్రతి ఏడాది విమర్శలు వివాదాలు,ఆరోపణలకు గురై రసాభాసగా మారే మహాశివరాత్రిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన లింగోద్భవ దర్శనం ఈ ఏడాది శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి,ఇఓ బాపిరెడ్డి పర్యవేక్షణలో ప్రణాళికా బద్ధంగా వ్యవహారించి విజయవంతం చేశారు. ఆది నుంచి మంత్రులతో సమావేశాలు, జిల్లాఎస్పి, కలెక్టర్‌తో సమావేశాలు సూచనలతో,అధికారుల సంస్కరణలు, మార్పులు,చేర్పులతో విజయవంతం అయ్యింది. లింగోద్భవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటు చేసుకోకుకండా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, జిల్లా ఎస్పి హార్షవర్ధన్‌రాజు రెండు రోజుల పాటు ఇక్కడే తిష్టవేసారు. ముఖ్యంగా నందిసేవ తరువాత నిర్వహించే ఉత్సవాన్ని సామాన్యభక్తులకు సైతం దర్శన భాగ్యం కల్పించారు. ప్రతి ఏడాది లింగోద్భవ దర్శనం అంటే అమ్మో అనుకునే విఐపిలు, సామాన్య భక్తులు ఈ సారి ఎంతో చక్కగా దర్శనం చేసుకోగల్గినారు.ఈ అభిషేకానికి సంబంధించి పలుమార్లు ఆలయ కార్యనిర్వహణాధికారితో జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌బాబు చర్చించారు. అలాగే డిఐయస్‌పి, సిఐ, ఇంజనీరింగ్ అధికారులు వారి సిబ్బందితో, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్‌తో చర్చించారు.దాంతో చివరిగా లింగోద్భవ అభిషేకానికి సంబంధించి ముందు అమ్మవారికి జరిపేటప్పుడు ఉభయదారులతో పాటు అందరు భక్తుల్ని అనుమతించుటకు నిర్ణయించారు. గతంలో లింగోద్భవ అభిషేకమంటే కేవలం స్వామి గర్భగుడి వద్ద మాత్రమే విఐపిలను అనుమతించే వారు. దాంతో అమ్మవారికి అభిషేకం జరిపినా అక్కడకు ఎవరూ వెళ్ళే వారు కాదు.దాంతో గందరగోళంగా మారేది. అయితే ఈ ఏడాది పలుమార్లు అర్చకులతో చర్చిం చిన మీదట అమ్మవారి ఆలయంలో ప్రారంభించే



లింగోద్భవ దర్శనానికి పర్యవేక్షిస్తున్న ఎస్‌పి

అభిషేకాన్ని రెండు గంటల ముందు నిర్వహించుటకు అంగీకరించి ఆదివారం వేకువ జాము 2.45 గంటలకే ప్రారంభించారు. సమయపాలన విజయానికి తొలిమెట్టుగా మారింది. విఐపిలు, వివిఐపిలను మొదట అనుమతించటంతో దాంతో స్వామి గర్భగుడివద్ద కొంత రద్దీ తగ్గింది. అయితే ప్రకటించిన సమయం ప్రకారం స్వామి గర్భగుడిలో కూడా మూడున్నర గంటలకుఅభిషేకం ప్రారంభించారు.దాంతో ప్రతి భక్తునికి దర్శనం భాగ్యం కల్గింది.గతంలో ప్రతి ఏడాది వివాదాలుగా మారిన 'లింగోద్భవ అభిషేక దర్శనం' ఈ ఏడాది సమీక్షలు,సంస్కరణలతో విజయవంతంగా నిర్వహించారు. ఈ ఏడాది లింగోద్భవ అభిషేకం అందరికి అవకాశం కల్పించారు. ఈ ఏడాది శివరాత్రి పర్వదినాన చోటు చేసుకున్న సంఘటనలతో లింగోద్భవ అభిషేకానికి పోలీసు అధికారులు ఎంతో స మయ స్ఫూర్తితో వ్యవహారించి సుఖాంతం చేశారు. ఉభయ దారులకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పెద్ద పీట వేశారు. తమిళనాడుకు చెందిన నాటుకోట చెట్టియార్ల కుటుంబానికి చెందిన మాజీబోర్డు సభ్యుడు రామనాథం శెట్టియార్‌కు అవకాశం కల్పించారు. దాంతో ప్రతి ఒక్క భక్తుడు ఎంతో సంతృప్తిగా గత పాతికేళ్ళుగా తాము ఇలా దరి ్శంచుకోలేదంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. నంది సేవ నుంచి స్వామి అమ్మవార్లను రాత్రి 3గంటలకే ఆలయంలోకి చేర్చారు.ఉత్సవం ఆలస్యం అయ్యింది. తరువాత శుద్ధి చేసి భక్తుల్ని అమ్మవారి ఆలయం వద్దకు అనుమతించి అభిషేకం ప్రారంభించారు. . అమ్మవారి అలయంలో దర్శనం చేసుకున్న విఐపిలు స్వామి గర్భగుడి వద్దకు వచ్చి దర్శనానికి నిలబడ్డారు.

## ఉగాది పురస్కారాలకు ప్రభుత్వఆహ్వానం

**విజయవాడ ఫిబ్రవరి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి మార్చి 30 న విశ్వవసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ఉగాది రోజున వివిధ రంగాలలో నిష్ణాతులైన కళాకారులు కవులకు ఉగాది పురస్కారాలు కళారత్న పురస్కారాలు ప్రధానం చేయటం జరుగుతుంది. సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్మన్ తేజస్విని పోడపాటి ఈ విషయాన్ని గురువారం వెల్లడించారు. కళారత్న పురస్కారాలు, .సాహిత్యం, .సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, . నాటకం, .జానపదం, మిమిక్రీ, .అవధానం లోను మిమిక్రీ, .అవధానం, వైద్యం, .ఇంద్రజాలం మరియు ముకాభినయం, హరికథ మరియు బుర్రకథ,.జర్నలిజం, .సామాజిక సేవల్లోను, కమిటీ సిఫార్సు చేసిన ఇతర సేవా రంగాలకు ఇవ్వబడును ఉగాది పురస్కారాలు గతంలో పద్మ అవార్డులు, సంగీత నాటక మరియు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు లేదా కేంద్ర ప్రభుత్వం అవార్డులు, ఉగాది పురస్కారాలు కళారత్న పురస్కారాలు పొందిన వారి దరఖాస్తులు పరిశీలించబడవు. వారి వివరాలతో కూడిన బయోడేటాను 15.03.2025 లోపు ముఖ్య కార్యనిర్వ హణాధికారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి 2వ అంతస్థు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, దుర్గాపురం, విజయవాడ 520003 వారికి పంపగలరు మరియు ఎపికల్చర్.ఉగాది ఎట్‌దిరేట్‌ఆఫ్‌జిమెయిల్.కమ్ మెయిల్ కూడా పంపవచ్చును.

# పోసాని అరెస్టు దారుణం

### - వైఎస్సార్సీ కేంద్ర కార్యాలయ ఇన్ చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

**విజయవాడ,ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** పోసాని అరెస్టు అత్యంత దారుణమని వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయ ఇన్ చార్జి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మండిపడ్డారు. పోసాని రాజకీయాలనుంచి తప్పుకున్నామని ప్రకటించినా చంద్రబాబు వెంటాడ్డ అన్యాయమన్నారు. చంద్రబాబు కక్ష రాజకీయాలతో రాష్ట్రం రగిలిపోతోందన్నారు.నాగరిక సమాజం నుంచి మళ్లీ ఆటవిక సమాజంలోకి చంద్రబాబు తీసుకెళ్తున్నారన్నారు.చట్టాలను, న్యాయ వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నారని ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు పొడుతూ అసెంబ్లీలో అసలు ప్రధాన ప్రతిపక్ష గుర్తింపునే ఇవ్వకుండా, ప్రశ్నించే గొంతు వినిపించకుండా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎతాడేపల్లి వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అంటే ఏదో రాజకీయపరమైన హోదాగా కూటమి పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు అనేది ఒక బాధ్యత, దీనివల్ల అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు ఉండే అవకాశం వైయస్ఆర్ సీపీకి దక్కుతుందన్నారు. దీనిని కూడా వక్రీకరించడం దుర్మార్గమన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...ఏపీ అసెంబ్లీలో నాలుగు పార్టీలు ఉంటే, దానిలో మూడు పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాయి. మిగిలిన వైయస్ఆర్ సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాల్సి ఉంది. పార్లమెంట్ చట్టం 1977 ప్రకారం సభలో సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రధాన ప్రతిపక్షంను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం దీనిని ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్ష గుర్తింపును వైయస్ఆర్ సీపీ కోరుతుంటే దీనిని రాజకీయం చేయడం దుర్మార్గం. దీనిపై కూటమి పార్టీలు చేస్తున్న ఈ విమర్శలను చూసి ప్రజాస్వామికవాదులే ఆశ్చర్యపోతున్నారు.

# భక్తి శ్రద్ధలతో జన జాగరణ

### - సిద్ధించిన భక్తుల మనోరథం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)** మహాశివరాత్రి పర్వదినాన శివయ్య సన్నిధిలో నిద్ర చేస్తే మంచిదనే నమ్మకం నేటికి ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,లు వారి సిబ్బంది కలసి ఎలాగైనా భక్తులకు సదుపాయాలు కల్పించుటకు వారి మనోభీష్టానికి అనుకూలంగా డార్మెంటరీలను ఏర్పాటు చేశారు.స్థపద మండపం సమీపంలోనూ, అలాగే సన్నిధివీధి, శివయ్య గోపురంపక్కన కొత్తగా షెడ్లులను నిర్మించి నిద్రించుటకు అవకాశం కల్పించారు. కాలకృత్యాల్లి తీర్చుకోవటానికి మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అంతేకాక ఈ ఏడాది మాస్టర్‌ప్లాన్‌లో ఖాళీ చేయించిన స్థలాల్లో చక్కగా పార్కింగ్‌లు ఏర్పాటు చేశారు.దాంతో భక్తులు రాత్రి జాగరణకు నిద్రించటానికి ఎంతో అనుకూలంగా మారింది. దక్షిణ కైలాసానికి భక్త జనులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు.బుధవారం ఉదయం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలో భక్తుల సందడి అంతంత మాత్రంగా ఉండగా మధ్యాహ్నం నుంచి పల్లె జనం తరలి వచ్చారు.దాంతో ఆలయంలో దర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది. రాత్రి పదకొండు గంటల వరకు కూడా భక్తులు దర్శనానికి నిరీక్షిస్తూ కనబడ్డారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సుదర్శనం చేసుకున్నారు. ఉత్సవంలో గతంలో ఎన్నడూలేని విధంగా కొత్తదనం చోటు చేసుకుంది. పట్టణంలోని నాలుగుమాడా వీధులు కిక్కిరిసి కనబడ్డారు.నందిసేవలో సాంస్కృతిక బృందాల విన్యాసాలు కనువిందు చేశాయి. ఎటు చూసినా యువకుల కేరింతలు,ఆనందోత్సాహాలతో నాట్యాలు చేయటం ఎంతో కనువిందుగా మారింది. ముందు ఒంగోలు నుంచి వచ్చిన నందులు నందీశ్వరుని సేవకు వచ్చాయా అన్నట్లు అలంకరించి వెళుతుంటే సాంప్రదాయాన్ని మరిపించే విధంగా కోలాటాల బృందాలు అడుతూ పాడుతూ ఆకట్టుకున్నాయి.వెంటనే బుట్టబొమ్మలు, పక్కనే గెరిగాటం నృత్యాలు, విచిత్ర వేష ధారణ ఎంతో ఆకట్టుకున్నాయి. ఇక కేరళ పంచవాయిద్యాల మోత హైదరాబాదు బ్యాండుమేళాలు,

స్థానికంగా డోలు సన్నాయి నాదాలు, స్వామి అమ్మవార్లు వెనుక వేదపండితుల వేదఘోష భక్తుల్ని భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఉదయం నుంచి లేనిజనాభా ఇంత వచ్చింది. ఇది శివమహిమా? లేక నేల తల్లి ఈనిందా? అన్నట్లు భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు.

# దువ్వాడ నోరు అదుపులో పెట్టుకోవాలి

### - వైఎస్సార్సీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు సామినేని స్ట్రాంగ్ వార్నింగ్



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నాయకులు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను నోరు అదుపులో పెట్టుకోవాలని, నిరాధారమైన అనుచిత ఆరోపణలుచేస్తే జన సైనికులు, వీర మహిళలు నిన్ను శ్రీకాకుళం సముద్రంలో కలిపేస్తారని ఎన్‌టిఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని తన నివాసంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉదయభాను మాట్లాడుతూ దువ్వాడ శ్రీనివాస్ అనుచితంగా పవన్‌కళ్యాణ్, కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆరోపణలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయా నీది అంటూ నిప్పులు చెరిగారు. నెలకు రూ.50 వేల కోట్ల ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై దమ్ముంటే నిరూపించు అంటూ సవాల్‌చేశారు. పవన్‌కళ్యాణ్ మహాభారతంలో అర్జునుడని శ్లాఘించారు. కూటమి ప్రభుత్వమే ప్రజలకు సంక్షేమాన్ని పూర్తిస్థాయిలో అందిస్తుందన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్‌పై ప్రజలకు నమ్మకం ఉండబట్టే 21 స్థానాలకు 21 స్థానాలను ప్రజలు గెలిపించారన్నారు. ఇంకా ప్రభుత్వానికి నాలుగేండ్ల కాలం ఉన్నదని సూపర్‌సిక్స్ పథకాలు అమలు జరుగుతాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే పెంచిన పింఛన్లు, ఏడాదికి మూడు సిలెండర్ల వంతున ప్రజలకు అందిస్తుందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పరిపాలన దక్షత, పవన్‌కళ్యాణ్ సహకారం, బిజెపి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వపాలన కొనసాగుతుందన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపిఐఐసి డైరెక్టర్ మండలి రాజేష్ మాట్లాడుతూ దువ్వాడకు రాజకీయాలెందుకు, యూట్యూబ్‌లో రీల్స్ చేసుకునే నీకు రాజకీయాలు చేతకాదన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా హడావుడి చేస్తున్న దువ్వాడకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన దరిద్రపు ఘనత జనగన్మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. మరోసారి పవన్‌కళ్యాణ్‌పై అనుచింతంగా మాట్లాడితే రోడ్డుమీద కూడా తిరగనియ్యమని హెచ్చరించారు. కాగా సమావేశంలో జనసేన నేతలు కొలగాని రాము, షేక్ సత్తార్, కోసూరి ప్రహ్లాద్, ఈమని కిషోర్, సామినేని రాము, చారుగుండ్ల కొండ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల్లో వీకెండ్స్ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త** వీకెండ్స్ సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తెలుగు రాష్ట్రాల్లో వీకెండ్స్ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07031ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28,మార్చి 7,13,21,28వ తేదీల్లో ప్రతి శుక్రవారాల్లో సాయంత్రం 7-20గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 4-30గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07032ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి 2,9,16,23,31వ తేదీల్లో ప్రతి ఆదివారం సాయంత్రం 6-55గంటలకు కాకినాడ టౌన్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 6-50గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు,తాడేపల్లి గూడెం,రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో నిలుస్తాయి. చర్లపల్లి–నర్సాపూర్ ప్రత్యేక రైళ్లు : చర్లపల్లి నుంచి నర్సాపూర్ వెళ్లే నెంబర్ 07233ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28న, మార్చి 7,13,21,28వ తేదీల్లో ప్రతి శుక్రవారాల్లో రాత్రి 8-15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం తెల్లవారుజామున 5-50గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నర్సాపూర్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07234 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ మార్చి 2,9,16,23,31వ తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8-00గంటలకు నర్సాపూర్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 6-00గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి,పిడుగురాళ్ల, సత్తెనపల్లి,గుంటూరు,విజయవాడ,గుడివాడ,కైకలూరు,ఆకివీడు,భీమవరం టౌన్,వీరవాసరం,పాలకొల్లు స్టేషన్లలో నిలుస్తాయి.

వార్త

మానసికంగా కానీ, నైతికంగా కానీ ఆధ్యాత్మికంగా కానీ ఏ విధంగా కూడా బలహీనత పనికిరాదు.

-సోక్రటీస్

# తమిళనాడు తకరారు


జాతీయ విద్యావిధానంలో త్రిభాషా సూత్రం కింద హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోమని కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులను తమిళనాడు ప్రభుత్వం ససేమిరా అంటోంది. దాంతో కేంద్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వాలమధ్య ఉప్పునిప్పుగా పరిస్థితి ఉంది. తాము ద్విభాషా సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నామని హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె స్పష్టంచేస్తోంది. నిజానికి ఈ వాదం ఈనాటిది కాదు. తమిళ భాషా పరిరక్షణ కోసం ఎంతగానైనా పోరాడగల డిఎంకె హిందీ భాషా బోధనను తప్పనిసరి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. భారతీయ భాషల మధ్య ఎన్నడూ శతృత్వంలేదని, ప్రతిభాష ఒక దానికొకటి సుసంపన్నం చేసిందని అఖిల భార మరాఠీ సాహిత్య సమ్మేళన్‌లో ప్రధాని మోడీ భాషా సంపన్నత, సొగసు గురించి అభివర్ణించారు. అన్ని భాషలను స్వీకరించి దురభిప్రాయాల నుంచి మనల్ని మనం దూరం చేసుకోవడం సామాజిక బాధ్యతయని ప్రధాని హితవు చెప్పారు. ఇవన్నీ తమిళనాడు వెర్సస్ కేంద్రప్రభుత్వం మధ్య ఏర్పడిన అగాధాన్ని పూడ్చటానికి వీలౌతుందన్న యోచనలో ఆయన ప్రసంగం సాగింది. 1960ల్లో తమిళనాడులో పెద్దఎత్తున భాషా ఉద్యమం జరిగింది. ఆనాటి నుంచి హిందీ భాషపై వ్యతిరేకత పెరిగింది. త్రిభాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ తప్పనిసరిగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఏనాడో హుకుం జారీ చేసింది. అయినా ఇటు డిఎంకె, అటు కేంద్ర ప్రభుత్వం ఎవరి పట్టు వారువిడవకుండా ఉన్నారు. ఒకరి వాదనను ఒకరు వినే పరిస్థితిలో లేరు. కొంత కర్ణాటకలోనూకన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నేతృత్వంలో కన్నడ భాషాభిమానులు ఉద్యమించారు. కానీ ఎందుకో చల్లారిపోయింది. తెలుగు ప్రజలు తమ భాషాభిమానాన్ని మరో రూపంలో చాటుకుని మూలాల్లోకి తమ వాదనను తీసుకెళ్లి నెగ్గించుకున్నారు. తెలుగు వెలుగును దశదిశలా చాటాలనుకునే రీతిలో తెలుగును ప్రాచీన భాషగా గుర్తించాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేసింది. ప్రాచీన భాషాహోదా సాధించుకుంది. దాంతో తెలుగు భాషాభిమానుల ఆకాంక్ష తీరినట్లే కనపడుతోంది. త్రిభాషా సూత్రం పట్ల తాము సానుకూలంగా లేమనే సాకుతో కేంద్రం తమకు ఇవ్వదగిన నిధులలో కోత పెట్టిందని తమిళనాడు ముఖ్యమంత్రి చెప్పకనే చెబుతు న్నారు. కాగా 2014 నుంచే ఇంతవరకు తమిళనాడుకు నిధుల కేటాయింపులో ఎలాంటి వివక్ష చూపలేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరిస్తున్నారు. అయినప్పటికీ వచ్చే యేడాది తమిళనాడులో ఎన్నికలురానున్న దృష్ట్యా ఒకరిపై ఒకరు ఆరోపణలు ఇలాగే ఉంటాయని సరిపెట్టు కోవచ్చు. కానీ హిందీ భాష అమలు విషయంలో తమిళనాడు, కేంద్రాల మధ్య చిచ్చుమాత్రంఈనాటిది కాదు. హిందీ భాషను ఒత్తిడి చేసి తమ మీద రుద్దరాదన్న ఆందోళనల విషయంలో తమిళనాడు ప్రజలుకూడా సమ్మతించే స్పష్టమైన విధానం ఉన్నందున డిఎంకె ఇప్పటికీ ఆ విధానాన్ని విడనాడలేదు. ఈ వివాదంపై కేంద్రం ప్రస్తావన తెచ్చినప్పుడల్లా రాష్ట్రాలు మెళకువలోకి వస్తున్నాయి. ప్రస్తుతం కన్నడ, తెలుగు రాష్ట్రాలకు హిందీ భాష ఒత్తిడి లేనందువల్ల ఈ వివాదంలో ఆయా రాష్ట్రాలు జోక్యం చేసుకునే పరిస్థితి లేదు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవలనే విమర్శలు గుప్పించారు. తమిళనాడులో జాతీయ విద్యావిధానం2020ని పూర్తిగా అమలు చేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయలేమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఖరాఖండిగా చెప్పడంతో పాత వివాదం మళ్లీ చెలరేగిందని చెప్పాలి. 2024-25సంవత్సరానికి తమిళనాడుకు అందాల్సిన రూ.2152 కోట్లను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ రాసిన లేఖ తదనంతర పరిణామాలివి. సమగ్ర శిక్షా పథకం నిధులు విడుదల చేయకుంటే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయని స్టాలిన్ ప్రధానికి రాసిన లేఖ అనంతరం మంత్రి స్పందించారు. 'వడ్లగింజలో బియ్యపు గింజ'న్నట్లు తమిళనాడు, కేంద్రం మధ్య వివాదంలో 'త్రిభాషా' వ్యవహారానికి సంబంధించి, నిధుల విడుదల నిలిపి వేతకు తోడుగా త్వరలో జరుగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో తమ రాష్ట్రంలో నియోజకవర్గాలు తగ్గిపోతాయని ముఖ్యమంత్రి స్టాలిన్ తాజా ఆవేదనకూడా చోటుచేసుకుంది. దీనిని జవాబుగా దామాషా విధానంలో చేపట్టే పునర్వ్యవస్థీకరణ వల్ల తమిళనాడులో లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య తగ్గే అవకాశమే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. తమిళనాడుకే ఇదిలా ఉండగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పల్లవి అందుకోవడంతో దానికి కూడా అమిత్‌షా సమాధానం ఇచ్చినట్లయింది. దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగబోదంటూ ప్రధాని మోడీ పార్లమెంట్‌లోనే ప్రకటించినా దక్షిణాదిన ఎన్డీయేతర పార్టీలకు పలుసందేహాలున్నాయి. జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజనవల్ల లోక్‌సభ స్థానాలు తగ్గుతాయనే అంశంలో ఇతర దక్షిణాది రాష్ట్రాలకూ ఆందోళన ఉంది. డీలిమిటేషన్ వల్ల తమిళనాడు లోక్‌సభ సీట్లసంఖ్య 39నుంచి 31కి తగ్గిపోతుం దని స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'దక్షిణాదికి అన్యాయం' అనే నినాదంతో తమిళనాడు ప్రభుత్వం మార్చి 5న ఆల్‌పార్టీ సమావేశం ఏర్పాటు చేయనున్నందున కేంద్రం నష్టనివారణ చర్యలకు సంకల్పించింది.

నౌకకు అండగా నిల్చే నీళ్లే ఒక్కోసారి నౌకను తల్లకిందులు కూడా చేయగలవు.



తిరుక్కురళ్

పని చేయడానికి లంచం అడగడమే అవినీతి కాదు. జీతం తీసుకొని సక్రమంగా పనిచేయకపోవడం కూడా అవినీతే.



హెన్రీఫోర్డ్


# యువత విజ్ఞాన శిఖరాలను అధిరోహించాలి

సైన్స్ ప్రపంచ గమనాన్ని మార్చేసింది. మూఢ నమ్మకాల వలన అభివృద్ధి అడుగంటుతుందని, శాస్త్ర విజ్ఞానం సమాజాన్ని పురోగతిలో నడిపిస్తుందని నిరూపిత మైనది. ఎంతో మంది తమ ప్రాణాలను బలిపెట్టి, సైన్స్ కు పట్టిన గ్రహణాన్ని తొలగించారు. తమ పరిశోధనా ఫలితాలతో జన జీవనాన్ని సమూలంగా మార్చేశారు. సైన్స్ కారణంగా ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. సౌకర్యవంతమైన జీవన విధానం అలవడింది. భారత దేశంలో సైన్స్ సాధించిన ప్రగతి, ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు భారతీయ శాస్త్రవేత్తలు సాగించిన కృషి, పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమైనది.



సుంకవల్లి సత్తిరాజు

మన చుట్టూ ఎంతో విజ్ఞానం నిగూఢమై ఉంది. ఆసక్తి వలన మాత్రమే విజ్ఞానం వెలికి తీయబడుతుంది. అన్ని విషయాలను కూలంకషంగా పరిశీలించి, పరిశోధించి, మస్తిష్కంలో జనించే ప్రశ్నలకు అర్థవంతమైన సమాధానాలు రాబట్టి, పరిశోధనా ఫలితాలను అర్థవంతంగా అన్వయించి, పలు ఆవిష్కరణలతో మానవ జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చే ప్రక్రియను'సైన్స్' లేదా 'విజ్ఞాన శాస్త్రం'గా నిర్వచించవచ్చు. అనుభవాల ద్వారా, అధ్యయనం ద్వారా, వాస్తవాల ద్వారా అజ్ఞానాన్ని ఛేధించి, జ్ఞానాన్ని వెలికితీసే ఒక ప్రయోగాత్మక పద్ధతి సైన్స్. వంటచేయడం, గృహాలు నిర్మించుకోవడం, ఆయుధాలను తయారు చేయడం... ఇలా ఒకటేమిటి ప్రతీ ఆలోచన అర్థవంతమైన ఫలితాలకు దారితీసిన క్రమంలో సైన్స్ కీలక భూమిక పోషించింది. సైన్స్ అంటే నిజం. మన కళ్లెదుట కనిపించే ప్రత్యక్ష సాక్ష్యం సైన్స్. వర్తమాన ప్రపంచంలో మనం అనుభవిస్తున్న సౌకర్యవంతమైన జీవితానికి మూలం సైన్స్. నింగి, నేల, నిప్పు, నీరు, కాంతి అన్నింటా విజ్ఞానమే అగుపిస్తుంది. ప్రతీ విషయాన్ని ఆకళింపు చేసుకుంటే అంతా జ్ఞానమే. పరిశోధిస్తే అంతటా విజ్ఞానమే తాండవమాడుతుంది. వెయ్యి సంవత్సరాల పాటు భూమి ఈ విశ్వానికి కేంద్రమని నమ్మడమే కాకుండా, సూర్యుడితో పాటు గ్రహాలు, నక్షత్రాలుకూడా భూమి చుట్టూ తిరుగుతాయని పేర్కొంటూ ఈజిప్టుకు చెందిన ఖగోళశాస్త్రవేత్త టోలెమీ "జియో సెంట్రిక్ థియరీ" ని ప్రతిపాదించాడు. 16 వ శతాబ్దం వరకు మనం నివసిస్తున్న భూమి ఈ విశ్వాన్ని శాసిస్తున్నదని నమ్మడం జరిగింది. కాలక్రమంలో ఈ ప్రతిపాదన అవాస్తవమని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని నికోలస్ కోపర్నికస్ "హీలియో సెంట్రిక్ థియరీ" ద్వారా నిరూపించాడు. నేడు నిజమనుకునినమ్మిన అంశం కొంతకాలానికి నిజం కాకపోవచ్చు. పరిశోధనలు, ఆధారాలు సత్యాసత్యాలకు కొలమానాలు. ఒకప్పుడు భూమి బల్లపరుపుగా ఉందని భావించేవారు. కాలక్రమంలో భూమి గుండ్రంగా ఉందని నిరూపితమైనది. సూర్యుడు ఒక పెద్ద నక్షత్రమని, నవగ్రహాలు లేవని కేవలం ఎనిమిది గ్రహాలే విశ్వంలో తిరుగుతున్నాయని సైన్స్ నిరూపించింది. ఫ్లూటోను నవ గ్రహాల జాబితాలో నుంచి తొలగించి, అదొక మరుగుజ్జు గ్రహంగా అభివర్ణించారు. ఎన్నో పరిశోధనల ద్వారా కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిరంతర పరిశోధనా ఫలితాలే సైన్స్ మనుగడను సుస్థిరం చేస్తున్నాయి. మనిషికీ, జంతువుకీ మధ్య వ్యత్యాసం లేని రాతి యుగం నాటి మానవ ప్రస్థానం నుండి ఆధునిక మానవ పరివర్తనం వరకు అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. నేడు మనం అనుభవిస్తున్న సైన్స్ ఫలాల వెనుక ఎంతటి చరిత్ర ఉందో గమనించాలి. నాటి మూఢవిశ్వాసాల నుండి దుర్మార్గాల నుండి ప్రజలను కాపాడడానికి ఎంతో మంది శాస్త్రవేత్తలు అహరహం శ్రమించారు. తమ జీవితాలను పణంగా పెట్టి ప్రజల జీవితాల్లో విజ్ఞాన కాంతులను విరబూయించారు. సైన్స్‌కు, మౌఢ్యానికి మధ్య జరిగిన సంఘర్షణలో ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నోశిక్షలకుగురైనారు. ఎంతో మంది నిర్దాక్షిణ్యంగా హతులైనారు. నిజం చెబితే ద్రోహంగా పరిగణించడం, పరిశోధనలు చేస్తే కఠిన శిక్షలు అమలు చేయడం వంటి అత్యంత దారుణమైన పరిస్థితులున్న నాటికాలంలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలేసి, శాస్త్రీయ ఫలితాలతో రాబోయే తరాలకోసం శ్రమించిన, అలనాటి శాస్త్రవేత్తల చరిత్రను పరిశీలించి, శాస్త్రీయ కోణంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. టెలిస్కోప్‌ను కనిపెట్టి, కోపర్నికస్ సూర్య కేంద్ర సిద్ధాంతానికి





మద్దతునిచ్చాడనే అభియోగంతో గెలిలియోకు నాటిసమాజం దైవద్రోహం పేరుతో, యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వాస్తవాలను వివరించిన గెలిలియో శిక్షాకాలం లోనే మరణించాడు. విశ్వం అనంతమైనదని, ఇతర గ్రహాల్లో కూడా జీవం ఉండే అవకాశాలున్నాయని, సూర్యుడు విశ్వానికి కేంద్రమని ఆధునిక విజ్ఞానానికి పునాదులు వేసిన 'బ్రూనో' నాటి మత పెద్దల కోపాగ్నికి గురయ్యాడు. శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యత నిచ్చే కోణంలో ఆలోచించాలని పేర్కొంటూ, సత్యం కోసం పోరాడిన బ్రూనో ఒక గొప్ప తత్వ, గణిత శాస్త్రవేత్త. ఆయన సత్యశోధనకు అప్పటి మతమౌఢ్యం అనేక సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. అయినా సత్య పథాన్ని విడనాడక పోరాడిన బ్రూనోను కర్కశంగా సజీవ దహనం చేసారు. బ్రూనో సజీవ దహనమైనా అతని ఆలోచనలు సజీవంగానే ఉన్నాయి. గ్రీకు తత్వ వేత్త, విజ్ఞానగని సోక్రటీస్‌ను కూడా నిజాలను నిర్భయంగా చెప్పినందుకు విషమిచ్చి చంపారు. ఇలా ఒకరుకాదు, ఎందరో, మరెందరో నాటి మత పెద్దల మూఢనమ్మకాలకు బలైపోయి, ప్రపంచానికి తమ త్యాగాల ద్వారా సైన్స్ వెలుగులను ప్రసాదించారు. శాస్త్రీయ పరిశోధనా ఫలితాలను అనుభవిస్తూ, సైన్సును తప్పుబట్టడం అవివేకం, అజ్ఞానం. భారతీయ ప్రతిభ అణగ ద్రొక్కబడుతున్న కాలంలో తన ఆలోచనా పరిధిని సైన్స్‌కు జతపరచి, ఆధునిక శాస్త్రవిజ్ఞానంలో, భౌతికశాస్త్రంలో అంతుబట్టని విషయాలను తన మేథస్సుతో, అతి తక్కువ ఖర్చుతో పరిశోధనలు చేసి సత్ఫలితాలు సాధించి భారత ఖ్యాతిని ఇనుమడింప చేసిన చంద్రశేఖర్ వెంకటరామన్ చిన్న వయసులోనే భౌతికశాస్త్రంలో బంగారు పతకంసాధించి, భౌతిక శాస్త్రంపట్ల మొక్కవోని మక్కువ ప్రదర్శించాడు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేసిన తన తండ్రిప్రభావం రామన్ పై విశేషంగా చూపించింది. చిన్న వయసులోనే కాంతికి సంబంధించిన వివిధ అంశాలపై, తీవ్రంగా అధ్యయనం చేసి, కాంతి ధర్మాలను విశ్లేషించి "రామన్ ఎఫెక్ట్"కు ఊపిరి పోసాడు. సముద్రాలు నీలిరంగు సంతరించుకోవడానికి కారణం సముద్రపు నీటిపై పడే కాంతి కిరణాల్లో నీలిరంగు అధికంగా పరిక్షేపం చెంది, మన కంటికి చేరడమే. సర్. సి.వి రామన్ పరిశోధనల్లో వెల్లడైన ఈ వాస్తవాన్ని రామన్ ఎఫెక్ట్ లేదా రామన్ స్కాటరింగ్ అంటారు. మొదట్లో రామన్ ఆలోచనలను, సిద్ధాంతాలను హేళన చేసిన శాస్త్ర ప్రపంచం తుదకు ఆయన పరిశోధనలను ధృవీకరించడం జరిగింది. భారతీయ శాస్త్ర ప్రతిభ ప్రపంచ పటంలో సగర్వంగా తలెత్తుకు తిరిగింది. నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయ శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించాడు. ఇంతటి ప్రతిభగల శాస్త్రవేత్తను స్మరించుకోవడం మన కనీసబాధ్యత. ఒకప్పటికీ, ఇప్పటికీ సైన్స్‌ను గుర్తించడంలోను, సైన్స్ ద్వారా చేకూరిన ఫలితాలను అనుభవించడంలోను గణనీయమైన మార్పులొచ్చాయి. సైన్స్ లేనిదే మానవ మనుగడ లేదు. ఇది అక్షర సత్యం. అయితే విజ్ఞాన శాస్త్ర ఫలాలను ఆరగిస్తూ, అందుకు కారణమైన శాస్త్రవేత్తల కృషిని మరవడం క్షంతవ్యం కాదు. సైన్స్ ప్రపంచ గమనాన్ని మార్చేసింది. మూఢనమ్మకాల వలన అభివృద్ధి అడుగంటుతుందని, శాస్త్ర విజ్ఞానం సమాజాన్ని పురోగతిలో నడిపిస్తుందని నిరూపితమైనది. ఎంతో మంది తమ ప్రాణాలను బలిపెట్టి, సైన్స్‌కు పట్టిన గ్రహణాన్ని తొలగించారు. తమ పరిశోధనా ఫలితాలతో జన జీవనాన్ని సమూలంగా మార్చేశారు. సైన్స్ కారణంగా ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. సౌకర్యవంతమైన జీవన విధానం అలవడింది. భారత దేశంలో సైన్స్ సాధించిన ప్రగతి, ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు భారతీయ శాస్త్రవేత్తలు సాగించిన కృషి, పోషిస్తున్నపాత్ర అనిర్వచనీయమైనది. ఎంతో మంది శాస్త్రవేత్తలు భారతీయ ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పి, గుర్తింపు తెచ్చారు. యువతను సైన్స్ దిశగా ప్రోత్సహించడానికి, శాస్త్ర విజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించడానికి రామన్ చేసినస్ఫూర్తి ఎంతగానో దోహదం పడుతుంది. జీవించి, మరణించడం సహజ ప్రక్రియ. మరణించినా చరిత్రలో సజీవంగా మిగలడం కొంతమందికే సాధ్యం. అటువంటి ప్రతిభావంతుల్లో సర్.సి.వి. రామన్ అగ్రగణ్యుడు. భౌతిక శాస్త్రంలో అవిశ్రాంత కృషిసల్పి దేశానికి ఎనలేనికీర్తిప్రతిష్టలు సంపాదించి పెట్టిన సి.వి.రామన్‌స్ఫూర్తి యువవిద్యార్థులకు, వర్తమాన యువ శాస్త్రవేత్తలకు ఆదర్శం కావాలనే ధ్యేయంతో రామన్ పరిశోధనలను ప్రపంచం అధికారికంగాగుర్తించిన ఫిబ్రవరి 28 వ తేదీని భారత ప్రభుత్వం "నేషనల్ సైన్స్ డే" గా నిర్వహిస్తున్నది. దేశం ఆర్థికంగా ఎదగాలంటే యువత విజ్ఞాన శాస్త్ర రంగంలో పురోగతి సాధించాలి. •

# ఢిల్లీ కాలుష్య చెరువులో కమలం వికసించేనా!

పూసాల సత్యనారాయణ

దేశ రాజధానిని కాలుష్య కొండచిలువ చుట్టేసి ఎముకలు పిండి పిండి చేసి ధారపడుతుంటే చావు కేకలు వినిపించడంలేదా! ఈ దృశ్యం భూగోళమంత స్క్రీన్‌పై మనుషులంతా శతాబ్దాలుగా వీక్షించుతున్న మన పాలకులకు మాత్రం పట్టడం లేదు. గతంలో సుప్రీం కోర్టు సీరియస్‌గా తీసుకొని ప్రభుత్వాలకు చురకలంటించినా కదలిక లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం. కాలుష్య రహితవాతావరణంలో జీవించడం ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కు. అందుకు తగిన చర్యలు చేపట్టాల్సినఅవసరం ఎంతేని ఉంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రమాణాలను పాటించింది ఎక్కడా ! కాలుష్య నివారణ చర్యలకు ఖర్చు చేయవలసిన నిధులు దారులు తప్పుతున్నాయని సోషల్‌మీడియా కోడై కూసినా, జనం ఫిర్యాదు చేసినా పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రార్థనా మందిరాలకు మహాకుంభమేళాలకు కోట్లు ఖర్చుపెట్టడానికి నిధులు మాత్రం ఊటలు ఊరుతాయి. మనిషి జీవిత కాలం తగ్గించడం తప్ప పెరిగింది అంత కన్నా లేదు. గుడ్డి మూఢనమ్మకాలను విడనాడి విజ్ఞాన స్పృహ కలిగి ఉంటే నిప్పు లాంటి నిజాలు తెలుస్తాయి. ఆర్థిక క్రమశిక్షణ తుంగలోతొక్కి జనాకర్షణ ఉచిత పథకాలు ప్రవేశపెట్టి ఆదాయానికి మించిన ఖర్చులుచేసి ప్రభుత్వ ఖజానా ఖాళీచేయడమే కాకుండా అప్పులు చేసి మోయలేనంత వివిధరకాల పన్నులు ప్రజలపై రుద్ది అధికారంకొరకు రాజకీయాలు చేస్తున్నారు. అర్జంట్ పనులుపక్కకు పెట్టి అన్‌వాంటెడ్ పనులపై ఎగబడుతున్నారు. శ్వాస ఆడకుండా చేసే కాలుష్యాన్ని ఎందుకు తరిమికొట్టడడంలేదు. అందుకే 'ఇది యదార్థవాది లోకవిరోధి' అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఎందుకు ఉన్నట్లు. సంస్కృతి, సంప్రదాయాల ముసుగులో కులమతాలలో చిచ్చురగిలించి మూఢనమ్మకాలను చిగురింప చేసే ప్రభుత్వ రథసారథులు ఉన్నంతవరకు మానవీయ విలువలు తగ్గడమేకాక దేశంలో ఆకలి చావులు కూడా తప్పడం లేదు. క్రిమినల్ కేసులలో జైల్‌కుపోయి వచ్చినోట్లతో ఓట్లనుకొని చట్టసభలోకి అడుగుపెట్టిన వారికి రాజ్యాంగం గురించి ఏమితెలుసు! ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే వారికి శాస్త్రీయ దృక్పథం ఎక్కడా! పిల్లికి ఎలుకమీద కన్నుఉన్నట్లు నాయకులకు డబ్బు సంపాదనపైనే దృష్టిఅంతే మరి. ప్రజాసంక్షేమం వారికెందుకు? మేడ్ ఇన్ ఇండియా అన్న నినాదంతో ముందుకెళ్లే ప్రధానమంత్రిపరిశోధనసంస్థలకు నిధులెందుకు కేటాయించడం లేదు. యువతను ప్రోత్సహించి కొత్తఆవిష్కరణలకు శ్రీకారం చుడుతున్నారా? భూగోళంపై నివసించే మానవాళినీ కాలుష్యం నుండి రక్షించితే అంతకంటే ఇంకేముంది. సంక్షేమం, పార్ల మెంట్ భవనాలను, రాష్ట్రపతి నిలయాలను, గేట్ వే ఆఫ్ ఇండియాను ఎర్రకోటను కాలుష్యం చుట్టుముట్టి ఊపిరి ఆడకుండా చేస్తున్నా ఇవేమీ పట్టించుకోవడం లేదు. భారతదేశ గొప్పతనాన్ని చాటడానికి ఏముంది? హిందూ భావజాలంతప్ప. సామాన్య మానవుడికి కావల్సింది రోటీ, కపడా, ఔర్‌మఖాన్. అంతేకాని సంస్కృతి సంప్రదాయం లేకుండా బతకలేమా! గుడ్డివానికి కళ్లుకావాలి విలాసాలు వారికెందుకు? స్వచ్ఛమైన దేశంలో స్వచ్ఛమైన గాలిపీల్చుకొంటే కొంతకాలమైన ఊపిరి ఉంటుం దేమో అన్న చిన్నిఆశ ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయాలి. అప్పుడే కమలాలు వికసించి కన్నుల పండుగగా దేశమంతా ఆనంద నాట్యం చేస్తాయి. •

# ప్రజావాక్కు



## ఐక్యత ముఖ్యం

రెండువేల ఇరవై నాలుగు లోక్‌సభ ఇండియా కూటమి పార్టీలు ఐక్యంగాపనిచేసి మంచిఫలితాలను సాధించాయి. అధికారంలోకి రాలేకపోయినా బిజెపిని నిలువరించగలిగాయి. ఆపార్టీకి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితులు లేకుండా చేశాయి. అదే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి ఆ పార్టీ విచ్ఛిన్నమైపోయింది. పరస్పరం విమర్శించుకున్నాయి. ఎవరికి వారు ఒంటరిగా పోటీ చేసి బిజెపికి అవకాశం కల్పించాయి. వీరి తీరుమారకుంటే భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ బిజెపికె అవకాశం కలుగుతుంది. ఇండియా కూటమిలోని పార్టీలకు పుట్టగతులు లేకుండాపోతాయి.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## బస్సులకు అనుమతి ఇవ్వాలి

హన్మకొండ జిల్లా నయీమ్‌నగర్ పెద్ద మోరీపై ఏడు కోట్లతో నిర్మితమైన బ్రిడ్జి పనులు పూర్తయి ఆటోలు, కార్లు, ప్రైవేట్ వాహనాలు నెలరోజులనుండి రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ అధికారులు ఆర్టీసీబస్సులను ఈ బ్రిడ్జి మీద నుండి నడపకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. హనుమకొండ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, సిద్ధిపేట, సిరిసిల్ల, కరీంనగర్ వేములవాడకు వెళ్లే బస్సులు వయా ములుగు రోడ్డు పెద్దమ్మ గడ్డ హనుమాన్ నగర్ నుండి వెళ్లడం వల్ల అదనంగా డబ్బులు చెల్లించడంతోపాటు సమయం అంతా వృధా అవుతుంది. బ్రిడ్జి పనులు పూర్తయి అన్ని వాహనాలు నడుస్తుంటే ఆర్టీసీ బస్సులు ఎందుకు అనుమతించడం లేదో అర్థంకావడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి నయీమ్ నగర్ బ్రిడ్జి మీద నుండి బస్సులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి.

- కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

## చెట్లను పెంచాలి

మనదేశంలో ఏడుగురికి ఒక చెట్టు ఉండాల్సి ఉండగా ఏడువందల మందికి ఒకటి ఉంది. దీన్నిబట్టి పరిస్థితి ఎంత తీవ్రంగా ఎంతదారుణంగా ఉందో అందరూ ఊహించుకోవాలి. ఇకనైనా పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంపొందించడం కోసం అందరూ చెట్లను పెంచాలి. వచ్చేది ఎండాకాలం.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

## తస్మాత్ జాగ్రత్త

అవినీతి మరకలు అంటిన నాయకులను ప్రజలు ఎప్పటికప్పుడు తిరస్కరిస్తున్నారు. ఓటు ఆయుధంతో సమాధానం చెబుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను యేడాది క్రితం కెసిఆర్‌ను నిన్నగాక మొన్న కేజ్రీవాల్‌ను పదవుల నుంచి దింపేసి ఇంటి ముఖం పట్టించారు. ఇప్పుడు పాలన చేస్తున్న కొన్ని ప్రభుత్వాలు వీరిని చూసి బుద్ధి తెచ్చుకోవాలి. తమ హయాంలోఅవినీతి జరక్కుండా జాగ్రత్త పడాలి. అధికారంలో ఉన్నాం కదా అందినంతా దండుకుందాం అనుకుంటే కుదరదు. చేసిన అవినీతి పనులు ఎప్పుడో అప్పుడు బయటపడక తప్పదు. ప్రజలు అన్ని గమనిస్తుంటారనే విషయాన్ని రాజకీయ నాయకులు మరిచిపోకూడదు.

-మిథునం, హైదరాబాద్

## పెరుగుతున్న మధుమేహం

దేశంలోపెరిగిపోతున్న మధుమేహం, గ్యాస్ట్రిక్ వ్యాధుల తగ్గదలకువాడుతున్న స్టెరాయిడ్, అసిడిటీ వగైరా మందులు నాణ్యత పరీక్షలో నిర్ణీత ప్రమాణాలు లేవని సంబంధిత సంస్థ తేల్చి చెప్పింది. దీనితో 84రకాల ఇతర మందులు కూడా ఉన్నవి. జీవిత కాలం వాడాల్సిన మందు కారణం ఏదైనా నాణ్యత లేనిది వాడకం జరిగితే, ఉన్న రోగం తీవ్రత తగ్గక కొత్త రోగం రావొచ్చు. క్లినికల్ ట్రయల్స్ పక్కగా ఉండాలి. తర్వాతే వాటి విడుదల. ధర ఎక్కువైనా మందు పనితీరు బాగుంటే దేవుని వరం పొందినట్లు. కొత్త మార్గదర్శకాలు అన్ని స్థాయిలలో సరిగా ఉంటేనే తప్ప శాస్త్రజ్ఞులు కనుగొన్న మందుకోసం, కృషి, కష్టము, ఖర్చు మనకు సద్వినియోగం అయినట్లు. ఆ రీతిలో ముందు జాగ్రత్తలు అత్యవశ్యకం.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## ప్రజాధనం వృధా

రాజ్యసభ, శాసనమండలి వలన ప్రజాధనం వృధా అని లోక్‌సభ సభ్యులుశశిథరూర్ పేర్కొన్నారు. ఎగువ సభలు రాజకీయ నిరుద్యోగులకు పునరావాసం కేంద్రంగా మారాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో శాసన మండలి వ్యవస్థ లేదు. తెలివైన వారు శాసన మండలి వ్యవస్థను కోరుకోరు అని ప్రొ. సాల్క్ క్రిస్టల్ నాథన్ పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఎగువ సభ వ్యవస్థని రద్దు చేయాలి. ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఎంతో ఉంది. పాలకులే ఇలా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తే ప్రజలను పట్టించుకునేదెవరు?

- పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వ్యవస్థ ఏదైనా ధనవంతులే పాలకులా?

పుల్లెంల గణేష్

నేటి ఆధునిక సమాజంలో ఏ దేశ చరిత్ర చూసిన ధనవంతులే పాలకవర్గంలో ఉంటున్నారు. నిరుపేదలు పాలితులుగానే ఉంటున్నారు. అది పెట్టుబడిదారీ వ్యవస్థతో కూడిన దేశమైనా, ప్రజాస్వామ్య దేశమైనా, కమ్యూనిస్టు భావాలు కలిగిన దేశమైనా ఏ సిద్ధాంత విలువలతో ప్రభుత్వాలు నడిచినా ఆఖరికి పాలకులుగా మాత్రం కోటీశ్వరులే. తమ అధిపత్యాన్ని చూపిస్తున్నారని సమకాలిన రాజకీయ పరిస్థితులను బట్టి నిరూపణ కాబడుతుంది. మొన్నటికి మొన్న ప్రపంచానికి పెద్దన్నగా పేరుగాంచిన అమెరికా దేశ ఎన్నికలను చూస్తే ప్రతి అభ్యర్థి కూడా లక్షల కోట్ల ధనం ఉన్న వ్యక్తులే పోటీచేశారు. అమెరికా నూతన అధ్యక్షుడైన డొనాల్డ్ ట్రంప్ కోట్ల ధనం ఉన్న బడా వ్యాపార వర్గం నుండి వచ్చిన వ్యక్తి కావడం గమనార్హం. ఇక అభివృద్ధిలో రెండో అతి పెద్ద దేశమైన చైనా పాలన వ్యవస్థని పరిశీలిస్తే చైనాలో కమ్యూనిజం సిద్ధాంతంతో పాలన ఉన్నప్పటికీ లక్షల కోట్లు ఉన్న జిన్ పింగ్ అధ్యక్షుడిగా ఉండి, చైనా పాలన వ్యవస్థ కొనసాగుతూ సామాన్యులు పాలితులుగా ఉంటున్నారు. ఇక మరో అతి పెద్ద కమ్యూనిస్టు దేశమైన రష్యాని తీసుకుంటే అక్కడ కూడా లక్షలకోట్లు ఉన్న వ్లాదిమిర్ పుతిన్ దేశ అధ్యక్షుడు ఎన్నో యేండ్లుగా తన ఆధిపత్యాన్ని చూపిస్తున్నాడు. ఇలా ఏ ఆధునిక దేశ రాజకీయాల్ని పరిశీలించిన అతి కటిక పేదరిక దేశమైన పాలకులు మాత్రం కోట్లధనం ఉన్న వ్యక్తులే. ఆయా దేశ పాలనవ్యవస్థలో అధిపత్యాన్ని చూపిస్తున్నారు. ఇక ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశ రాజకీయాల్ని క్షుణ్ణంగా గమనిస్తే మనదేశంలో రెండు వైరుధ్యాలతో కూడిన పాలకులు చలమనవుతున్నారు. భారతీయ సామాజిక కులవ్యవస్థలో జనాభాలో అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణ సమాజం నుండి కోటీశ్వరులుగా ఉన్న వ్యక్తులే పాలకులుగా అవుతున్నారు. తాజాగా జరిగిన ఢిల్లీ ఎన్నికల ప్రక్రియని గమనిస్తే పోటీ చేసినఅభ్యర్థులంతా కోట్ల ధనం ఉన్నవారే కావడం గమనార్హం. అంతే కాకుండా ఢిల్లీమంత్రిమండలిలో మొత్తం కోటీశ్వరులైన వ్యక్తులే ఉన్నారు. కానీ భారతదేశం ఏమో ఉన్నతమైన విలువలతో కూడిన అతిపెద్ద లిఖిత రాజ్యాంగం కలిగిన ప్రజాస్వామ్య గణతంత్ర దేశం. ప్రజాస్వామ్యం అనగా ఏంటి? మాజీ అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ ప్రకారం ప్రజలకొరకు ప్రజల చేత ప్రజలే ఎన్నుకునే వ్యవస్థని ప్రజాస్వామ్య దేశంగా భావిస్తారు. ఇక గణతంత్రదేశం అనగా దేశ సమస్త సంపదలో రాజ్యంలో భూభాగంలో ప్రతి తలకి సమాన వాటా పంపిణీ చేసుకునే విలువలు కలిగిన రాజ్యాన్ని గణతంత్ర రాజ్యాంగా భావిస్తాము. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలో ఏ దేశానికి లేని అత్యున్నతమైన భారత రాజ్యాంగాన్ని రాసి మనకి అందించారు. కానీ దేశంలో తరతరాలుగా సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణాలచేత దోపిడికి గురవుతున్న కటిక పేదలైన సామాన్యులైన 90శాతం పైగా ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీలే రాజ్య సింహాసనం మీద కూర్చోవలని పాలకులుగా నాయకులుగా



కావాలని భారత రాజ్యాంగ ఆత్మ తెలుపుతుంది. అందుకు నిదర్శనమే లక్షల కోట్ల ధనవంతులు అయినప్పటికీ కూడు, గుడ్డ, ఇల్లు లేని నిరుపేదలైనవారికి కూడా సరి సమానంగా ఓటు ఉంటుంది. అంటే కోటీశ్వరుడైన, నిరుపేద వ్యక్తి ఐన ఒక మనిషికి ఒకటే ఓటు, ఒకటే విలువ ఉంటుంది. కాబట్టి ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశంలో సామాన్యులు కూడా సింహాసనం మీద కూర్చోని రాజ్యపాలన చేయొచ్చనని అంబేద్కర్ రాజ్యాంగం తెలుపుతుంటే, అందుకు పూర్తి విరుద్ధంగా దేశాన్నిపాలిస్తున్న ఏపార్టీ వ్యక్తులైన లక్షల కోట్లు ఉన్న భూస్వామ్య పెట్టుబడిదారీ ఆధిపత్య భావజాలాన్ని సమర్థించే వారే నాయకులుగా పాలకులుగా అవుతున్నారు. మరి అంబేద్కర్ భారత రాజ్యాంగం ఏమో సామాన్యులే సింహాసనం మీద కూర్చొని పాలించాలని చెప్తుంటే అందుకు పూర్తి వ్యతిరేకంగా లక్షల కోట్లు ఉన్న భూస్వామ్య పెట్టుబడిదారీ ఆధిపత్య భావజాలం ఉన్న వ్యక్తి పాలకుడు ఐతే నిరుపేదలైన సామాన్యులైన తరతరాలుగా దోపిడీకి గురవుతున్న అత్యధిక శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీల మేలు కోరుతారా.? సామాన్యులకి మౌలిక సదుపాయాలు ఐన విద్య వైద్యం ఉపాధి ఇల్లు భూమి దొరకకుండా నిరుపేదల్ని మరింత పేదరికంలోకి నెట్టివేసేలా ప్రణాళికలు రచిస్తాడు. ఎందుకనగా పెట్టుబడిదారి భూస్వామ్య అధిపత్య భావాలని సమర్థించే అమలు చేసే వ్యక్తి సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తనకి బద్ధ వ్యతిరేకిగా ఉంటాడు కాబట్టి, నిరుపేదల జీవితాలు అభివృద్ధి పరచడంలోనిబద్ధతని మానవత్వాన్ని చూపించలేడు. ఎందుకంటే లక్షలకోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి తాను ఖర్చు చేసిన లక్షల కోట్లు ఏ విధంగా తిరిగి సంపాదించుకొని తన వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడానికి ప్రణాళికలు పథకాలు రచిస్తాడు కానీ నిరుపేదలని సింహాసనం మీద కూర్చోబెట్టడానికి ప్రణాళికలు రచించడు కదా! నిరుపేదలని సింహాసనం మీద కూర్చోబెట్టే వ్యక్తిఐతే భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య, గణతంత్ర భావాలకి వ్యతిరేకంగా ఎన్నికల్లోనే పోటీ చేయడుకదా..! భారత దేశంలో వర్గబేధం కన్న అన్ని తారతమ్యాలని అత్యధికంగా ప్రభావితం చేసేదిమొదటి సామాజిక రుగ్మత మాత్రం కులం అనేది జగమెరిగిన సత్యం. మరి భారతదేశంలో రాజ్యం సంపద భూమి సమస్త రంగాల్లో ఆధిపత్యం ఎవరిది ఉన్నది అనేది క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఎవరు అవునన్నా కాదన్నా లక్షల కోట్లుఉన్న భూస్వామ్య పెట్టుబడిదారి ఆదిపత్య భావజాలం ఉన్న అగ్రవర్ణాలదే అనేది అనేక సర్వేల ప్రకారం నిరుపితమవుతుంది. ఏదో అంబేద్కర్ భారత రాజ్యాంగ పుణ్యమా ఎస్సీఎస్టీలకి రాజకీయ రిజర్వే షన్లు ఉండబట్టి కొందరు నిరుపేదలైన ఎస్సీఎస్టీ వ్యక్తులు ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలువ గలుగుతున్నారు. ఇక సామాన్యులైన నిరుపేదలైన ఒబిసిలు భారతీయ సమాజంలో దా దాపు 60శాతం ఉన్నప్పటికీ రాజకీయ రిజర్వేషన్లు లేకపో వడం మూలంగా వారి జనాభా దామాషా ప్రకారంఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో తగిన వాటాని పొందలేకపోతున్నారు. ఓటుబలం లేని అగ్రవర్ణాలు ధనబలంతో ఓటు బలమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లు కొనుగోలుచేసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అదేఅగ్రవర్ణ నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి వ్యతిరేకంగానే తమ ప్రణాళికలు రచిస్తారు. ఎందుకంటే నిరుపేద లైన బీసీ ఎస్సీ ఎస్టీలు ఎల్లప్పుడు ఓట్లు అమ్ముకుంటేనే కోటీశ్వరులైన దేశంలో సామాజిక రాజకీయఆర్థికసాంస్కృతిక విప్లవం వచ్చేలా అత్యున్నత చట్టాలు రాగలవు తద్వారామాత్రమే సామాజిక పరివర్తన సాధ్యమవుతుంది. అప్పుడే దేశంలో సామాజిక అసమానతలు పోయి భారత రాజ్యాంగ ఆత్మచెప్తున్న విధంగా స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో కూడిన మానవ అభివృద్ధి సూచీలో, అభివృద్ధిలో ముందుండే విధంగా భారతదేశాన్ని చూడగలం. •

# అక్రమవలసదారులంతా క్రిమినల్సే..




## వారిపై సానుభూతి చూపించనక్కర్లేదు: కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్

**ఛండీగర్, ఫిబ్రవరి 27:** అమెరికాలో అక్రమ వలసదారులుగా ముద్రపడి ఆదేశ విమానంలోనే భారత్‌కు వచ్చిన వలసదారులను నేరస్తులని వారంతా క్రిమినల్స్ అని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ చేసిన వ్యాఖ్యలు ఇపుడు సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. వారిపట్ల మనం ఎంతమాత్రం సానుభూతి చూపించ కూడదని కూడా చేసిన వ్యాఖ్యలు వైరల్ కావడంతో ఆయనపై మండిపడుతున్నారు. ఎవరు ఏదేశంలో అక్రమంగా ప్రవేశించినా వారంతా క్రిమినల్సేనని వారిపట్ల మనం సానుభూతి చూపించాల్సిన అవసరం లేదన్నారు. మనం వారిస్తున్న కొందరు ఆదేశానికి ఇలా అక్రమ రూట్లలో వెళుతున్నారని ఇదొక డ్రగ్స్ అలవాటులా మారిందని అలాంటివారిపట్ల మనం ఎందుకు సానుభూతి చూపించాలని మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రశ్నించారు. అమెరికాలో అక్రమవలసాదరులపట్ల అక్కడి పోలీసులు అనుసరించిన వైఖరిపై ప్రశ్నించిన మీడియాకు మంత్రి ఈతరహాలో వ్యాఖ్యలు చేయడం విస్మయం కలిగించింది. తిరిగి వచ్చిన వారికి ఎలా పునరావాసం కల్పించాలన్నది కూడా ఇపుడు చిక్కుసమస్యగానే ఉంటుందన్నారు. ఏ రూటులో వారిని వెనక్కి పంపించినా ఇపుడు వారికి పునరావాసం కల్పించడం మన బాధ్యత అని ఖట్టర్ అన్నారు. అమెరికాలో పత్రాలులేని భారతీయులపట్ల అనుసరిస్తున్న ఆమానవీయ చర్యలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జోక్యంచేసుకోమని చెప్పడంపై నిరసనలు వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే.

ఈక్రమంలోనే మంత్రి ఖట్టర్‌చేసిన వ్యాఖ్యలు ఇపుడు బిజెపిపై వ్యతిరేకతను పెంచుతున్నాయి. మొత్తం ఇప్పటి వరకూ 333 మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించేసింది. వీరిపట్ల అమెరికా మానవహక్కుల ఉల్లంఘనకు పాల్ప డిందని, అయినా కేంద్రంజోక్యం చేసుకో లేదన్న వాదనలు వస్తున్నాయి. హర్యానాలోని కర్నాల్ ప్రాంతం సమీపంలోని డబ్రీ గ్రామం నుంచే 300 మంది యువత ఇలా డంకీ రూటులోనే వెళ్లారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో తాను ఆగ్రామం సంద ర్శించి ఆశ్చర్యానికి లోనయ్యానన్నారు. ఆగ్రామంలో ఒకే ఒక్క వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాడన్నారు.

ఇలా డంకీ రూట్లలో వెళ్లడం అనేది చట్ట విరుద్ధమని, తిరిగి వస్తారన్న గ్యారంటీ కూడా ఉండదన్నారు. వచ్చేనెల 2వ తేదీ మున్సిపల్ ఎన్నికల ఓటింగ్‌ఉన్న క్రమంలో ఖట్టర్ వ్యాఖ్యలు ప్రభావం చూపిస్తాయని బిజెపి భావిస్తోంది. మొత్తం 113 మంది అక్రమంగా వలసలు వెళ్లా రని వారంతా వెనక్కి వచ్చారు. హర్యానాలోని అంబాలా, కురు క్షేత్ర, కర్నాల్, కైథాల్, హిసార్ ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. ఒక్కొక్కరూ 40 లక్షలు, 70 లక్షలుకూడా వెచ్చించారు. ఇద్దరు మైనర్ల కోసం కురుక్షేత్రలోని ఒక కుటుంబం 1.20 కోట్లరూపాయలు వెచ్చించిదంటే అమెరికా పిచ్చి ఏస్థాయిలో ముదిరిపోయిందోనని తెలుస్తోంది.



## తుర్కియేలో రష్యా, అమెరికా దౌత్యవేత్తల భేటీ!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 27:** అమెరికా, రష్యాలు శాంతి చర్చల దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇరు దేశాలకు చెందిన కీలక దౌత్యవేత్తలు నేడుతుర్కియేలో భేటీఅయ్యారు. ఇందుకు అమెరికా రాయబార కార్యాలయం వేదికగా మారింది. రష్యా అధికారుల బృందం అక్కడకు చేరుకుంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకొనేందుకు చేస్తున్న యత్నాల్లో భాగంగా వాషింగ్టన్, మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈ సందర్భంగా చర్చించుకొన్నారు. దౌత్య సిబ్బంది ఇరు దేశాల్లో పనిచేసే వాతావరణంపై చర్చించనున్నారు. దీనిలో ఉక్రెయిన్, ఇతర రాజకీయ, భద్రతా పరమైన అంశాలను చేర్చలేదు. ఈ చర్చలపై అమెరికా విదేశాంగశాఖ మాట్లాడుతూ ఈ చర్చలు చాలా నిర్మాణాత్మకంగా కనిపిస్తున్నాయి. అసలు సమస్యలు పరిష్కారం అవుతాయా? లేదా అన్నది తేలిపోతుంది. దీంతోపాటు రష్యా మంచి ఉద్దేశంతోనే చర్చలకు వచ్చిందా అనే విషయం కూడా తెలుస్తుంది అని పేర్కొంది. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీవ్ లవ్రోవ్ మాట్లాడుతూ తమ దేశ దౌత్యవేత్తలకు మెరుగైన పరిస్థితులను కల్పించేందుకు ఈ చర్చలు జరుగుతున్నాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలో అడుగుపెట్టిన అయిదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత 18వ తేదీన సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. ఈ పరిణామాలతో కీవ్, ఐరోపా సమాఖ్య మిత్రులు అప్రమత్తమయ్యారు. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ట్రంప్ శరవేగంగా తీసుకొంటున్న చర్యలపై పుతిన్ ఈ వారం స్పందించారు. అమెరికా, రష్యాల మధ్య విశ్వాసాన్ని పునరుద్ధరించకపోతే ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇరుదేశాలు దౌత్యస్థాయిలో సమస్యల పరిష్కారానికి తుర్కియేలో భేటీ అయ్యాయి. ఇక రష్యాతోకూడా ట్రంప్ ఖనిజాల డీల్ చేసుకొంటారన్న వార్తలు వెలువడుతుండడంతో ఈ చర్చలకు ప్రాధాన్యం పెరిగింది.

## అయుధాలు స్వచ్ఛందంగా అప్పగిస్తున్న మెయితీ మిలిటెంట్లు!

**ఇంఫాల్, ఫిబ్రవరి 27:** మైయిటీ వర్గం ప్రజలను ఎస్టీజాబితాలో చేర్చాలని మొదలయిన ఆందోళన చివరకు ముఖ్యమంత్రి గద్దెదిగి రాష్ట్రపతి పాలన వరకూ వచ్చిన మణిపూర్‌లో ఇపుడు తాజాగా మిలిటెంట్లు స్వచ్ఛందంగా వచ్చి ఆయుధాలను అప్పగిస్తున్నారు. వారం రోజుల్లోగా మిలిటెంట్లు తమవద్ద ఉన్న దోచుకున్న ఆయుధాలను అప్పగించాలని, అలాచేస్తే వారిపై ఎలాంటిచర్యలు తీసుకోబోమని, లేనిపక్షంలో కఠిన చర్యలకు సిద్ధం కావాల్సిందేనని గవర్నర్ అజయ్ కుమార్ భల్లా హెచ్చరించడంతోమిలిటెంట్లు భారీ ఎత్తున వచ్చి స్వచ్ఛందంగా ఆయుధాలను సరెండర్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆరుజిల్లాల్లో 104 తుపాకులు మందుగుండు సామగ్రిని ప్రభుత్వాని సరెండర్‌చేసారు. ప్రభుత్వదళాలనుంచి అక్రమంగా లూటీచేసిన ఆయుధాలను వారం రోజుల్లోగా సరెండర్‌చేయాలని ఈనెల 20వ తేదీ ఇచ్చిన గవర్నర్ సూచనకు స్పందన భారీ స్థాయిలోనే వచ్చిందని పోలీసులు భద్రతా దళ అదికారులు తెలిపారు. గురువారం అరంబై తెంగోల్ గ్రూపుసభ్యులు ఆయుధాలను అప్పగించారు. తమ షరతులను అంగీకరిస్తే ఆయుధాలు సరెండర్ చేస్తామని మైయిటీ గ్రూప్ వెల్లడించింది. ఆ సంస్థ పిఆర్‌వో రాబిన్ మాన్‌గంగ్ కవైరక్‌పార్, గ్రూపు తరపున గవర్నర్‌ను కలిసారు. ఆయుధాల అప్పగింతకు గడువు వెల్లడించలేదు. గవర్నర్ భల్లాకు అరంబై తెంగోల్ మెమొరాండం అందించింది. మెజార్టీ మైయిటీ వర్గానికి ఎస్టీ హోదా ఇవ్వాలని ఆలేఖలో డిమాండ్ చేసారు.

# ఆప్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు

## ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు

### తీవ్రంగా స్పందించిన మాజీ సిఎం అతిశీ!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ సమావేశాల వేళ బిజెపి సర్కార్‌పై ప్రతిపక్ష ఆమ్ ఆద్మీ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకుంటున్నారని ఆరోపించింది. ఈ మేరకు మాజీ సిఎం, శాసనసభా ప్రతిపక్ష నేత అతిశీ ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై మండిపడ్డారు. బిజెపి నేతలు అధికారంలోకి రాగానే నియంతృత్వంలో అన్ని హద్దులు దాటేశారు. సభలో జై భీమ్ అనే నినాదాలు చేసినందుకు మా పార్టీ ఎమ్మెల్యేలను మూడు రోజులపాటు సస్పెండ్ చేశారు. ఇప్పుడు విధాన సభ ప్రాంగణంలోకి రాకుండా మమ్మల్ని అడ్డుకుంటున్నారు. ఢిల్లీ అసెంబ్లీ చరిత్రలో ఇలాంటి దారుణం ఎన్నడూ చోటుచేసుకోలేదు అని ఆమె దుయ్యబట్టారు. మద్యం కుంభకోణంపై కాగ్ నివేదికను నిరసిస్తూ ఇటీవల ఆప్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో అతిశీ సహా 21 మంది ప్రతిపక్ష సభ్యులను మూడు రోజులపాటు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే అతిశీ సహా పలువురు ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ వద్దకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. స్పీకర్ ఉత్తర్వుల నేపథ్యంలో లోనికి వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. దీంతో మాజీ సిఎం వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఎక్స్ వేదికగా బిజెపి సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. మద్యం కుంభకోణంపై గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ నివేదికలను బిజెపి సర్కార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం హయాంలో 2021, 22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. నిపుణుల అభిప్రాయాలు తీసుకోకపోవడం, ఫిర్యాదులు వచ్చినా బిడ్డింగును అనుమతించడం, ఉల్లంఘనలకు జరిమానా వేయకపోవడం, విధానాల రూపకల్పనలో పారదర్శకత లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయని తెలిపింది. ఈ నివేదికను ఆప్ ఖండిస్తోంది.

# వైట్‌హౌస్ ప్రవేశంపై మీడియాకు ఆంక్షలు

## ట్రంప్ తొలి కేబినెట్ సమావేశం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 27:** అమెరికా అధ్యక్ష బాధ్యతలుచేపట్టిన తర్వాత డొనాల్డ్‌ట్రంప్ మొదటిసారిగా కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీని కవర్‌చేసేందుకు కొన్ని మీడియా సంస్థలపై వైట్‌హౌస్ ఆంక్షలు పెట్టింది. వారిలో రాయిటర్స్, అసోసియేటెడ్‌ప్రెస్, హఫ్‌పోస్ట్ వంటి పలు సంస్థల రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్లను ఓవల్ ఆఫీస్‌లోనికి వెళ్లనీయలేదు. కొత్త విధానాలకు లోబడే వారిని అనుమతించలేదని శ్వేతసౌధం వెల్లడించింది. ఓవల్ ఆఫీస్ వంటి చిన్న చిన్న ప్రదేశాల్లో ఏఏ మీడియా సంస్థలు కవర్‌చేయాలన్న దానిపై వైట్‌హౌస్ నిర్ణయం తీసుకుంటుందని ట్రంప్‌యంత్రాంగం ప్రకటించింది. ఎబిసి, న్యూస్‌మ్యాక్స్, బ్లూంబర్గ్, ది బ్లేజ్, యాక్సియోస్, ఎన్‌పిఆర్‌సంస్థ ప్రతినిధులను మాత్రమే అనుమతించారు. వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ మాట్లాడుతూ ట్రంప్ రోజువారి మీడియా మీట్ కవర్‌చేసేందుకు సాంప్రదాయ సంస్థలన్నింటినీ అనుమతిస్తున్నామని, కానీ స్థలాభావం కారణంగా కొన్ని ఆఫీసుల్లోకి మాత్రం అందరినీ పంపించడం లేదన్నారు. వీటిపై మీడియా సంస్థలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసాయి.

# మాకు ఉపన్యాసాలిచ్చే స్థాయిలో పాకిస్థాన్ లేదు




## ఐరాసలో దాయాది దేశం ఆరోపణలకు భారత్ ఘాటు స్పందన

**జెనీవా, ఫిబ్రవరి 27:** అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంది. తాజాగా జమ్మూకాశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చేస్థాయిలో ఆ దేశంలేదని స్పష్టంచేసింది. జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకాశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి ధీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకాశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు.ఆ దేశ వాక్చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తోంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టి సారిస్తుంది. ఆ దేశంచ మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టి పెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# ట్రంప్‌ను కెనడాలోకి రానీయొద్దు



## ఎన్‌డిపి నేత జగ్మీత్‌సింగ్ పిలుపు

**ఒట్టావా, ఫిబ్రవరి 27:** కెనడా ప్రతిపక్ష ఎన్‌డిపి (నేషనల్ డెమోక్రటిక్ పార్టీ) నేత, ఖలిస్థానీ సానుభూతిపరుడు జగ్మీత్‌సింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను నేరస్థుడిగా అభివర్ణించారు. ఆయనను జి-7 సదస్సు కోసం కెనడా భూభాగంపై అడుగుపెట్టనీయకుండా బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌పై గతంలో నేర నిర్ధారణ జరిగిన అంశం, ప్రపంచ దేశాలకు ఆయన బెదరింపులను ఇందుకు ఓ కారణంగా పేర్కొన్నారు. బుధవారం జగ్మీత్‌సింగ్ మాట్రియాల్ కౌన్సిల్ ఆఫ్ ఫారెన్ రిలేషన్స్ సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ట్రంప్‌ను జి-7 సమావేశాల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని నేను నమ్ముతున్నాను. ఆయనను ఇక్కడికి పిలవకూడదు. నేరనిర్ధారణ జరిగిన వ్యక్తిని మన దేశంలోకి ఎందుకు రానివ్వాలి. మన ప్రజాస్వామ్యానికి, సార్వభౌమత్వానికి ముప్పుగా మారి, మన ఆర్థిక వ్యవస్థను, మన మిత్రులను, ప్రపంచాన్ని బెదరించిన వ్యక్తిని ఎందుకు అనుమతించాలి. డొనాల్డ్ ట్రంప్‌ను ఎలా అడ్డుకోవాలి అన్న దానిపైనే నేటి సమావేశం' అని వ్యాఖ్యానించారు. ట్రంప్‌ను ఆపేందుకు జి-7 వేదికను వాడుకోవాలని కెనడా ప్రభుత్వాన్ని, మిత్రదేశాలను ఆయన అభ్యర్థించారు. ఆయనను ఎదుర్కోడానికి మెక్సికో, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి భావ సారూప్యత ఉన్న దేశాలతో జట్టు కట్టాలన్నారు. అత్యాధునిక ఆయుధాలతో కెనడా సైన్యాన్ని బలోపేతం చేయడానికి ఎన్‌డిపి మద్దతు ఇస్తుందన్నారు.

సింగ్ ప్రకటనపై ఇప్పటివరకు కెనడా ప్రభుత్వం స్పందించలేదు. ప్రధాని కార్యాలయ ప్రతినిధి సైమన్ లాఫార్ఛ్యూ స్పందిస్తూ దీనిపై తాము ఎటువంటి వ్యాఖ్యలు చేయబోమని వెల్లడించారు. ఇక ఇంధనశాఖ మంత్రి జోనాథన్ విల్కిన్సన్ మాట్లాడుతూ జగ్మీత్ ప్రతిపాదనలో అంతగా విషయం లేదన్నారు. అంతేకాదు.. ఆలోచించి సలహాలు చెప్పేవారిని తాము కొత్త అడ్వైజర్లుగా నియమించుకోమని హితవు పలికారు. అంతేకాదు.. ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో చాలావరకు తనకు కోపం తెప్పించాయన్నారు. అదే సమయంలో కలిసి పనిచేసే మార్గాలను వెతకాలని సూచించారు. 'మనం తెగదెంపులు చేసుకొని సముద్రంలో మరోచోటుకు వెళ్లిపోలేము కదా. వారు మన పొరుగువారు. కలిసే ముందుకెళ్లాలి' అని ఆయన పేర్కొన్నారు. జూన్ 15 నుంచి 17 వరకు అల్బర్టాలో జి-7 సమావేశాలు జరగనున్నాయి.



# చంద్రునిపైకి డ్రోన్!

## ఓ ప్రైవేటు కంపెనీ అరుదైన ప్రయోగం

**కేప్ కెనవెరాల్, ఫిబ్రవరి 27:** అంతరిక్ష రేసులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు అమెరికా కీలక చర్యలు చేపడుతోంది. మరోసారి మానవసహిత జాబిల్లి యాత్ర చేపట్టేందుకు సిద్ధమైన నాసా.. అంతకంటే ముందు చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు వరుసగా ప్రయోగాలు చేస్తోంది. తాజాగా చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగేలా ఓ ప్రైవేట్ కంపెనీ అభివృద్ధి చేసిన లూనార్ ల్యాండర్‌ను ప్రయోగించింది. దీని ద్వారా జాబిల్లిపై సూర్య కిరణాలు ఎన్నడూ పడని ఓ బిలంపైకి డ్రోన్‌ను పంపించేందుకు ప్రణాళిక చేసింది.

ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థ అభివృద్ధి చేసిన అథీనా ల్యాండర్‌ను స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌లో పంపించింది. నాసా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి దూసుకెళ్లిన ఈ రాకెట్.. మార్చి 6న చంద్రుడి ఉపరితలంపై దిగేలా రూపొందించారు. 15 అడుగుల ఎత్తయిన ఈ అథీనా ల్యాండర్.. దక్షిణధ్రువానికి 100మైళ్ల దూరంలో ల్యాండ్ అయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రాంతం జెట్ బ్లాక్ బిలానికి కేవలం 400 మీటర్ల దూరంలోనే ఉంటుంది.

చంద్రుడిపై సూర్యకిరణాలు ఎన్నడూ పడని ప్రాంతంగా జెట్ బ్లాక్ బిలాన్ని అభివర్ణిస్తారు. ఈ బిలంపైకి 'గ్రేస్' అనే డ్రోన్‌ను పంపించడమే అథీనా ల్యాండర్ మిషన్ లక్ష్యం. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ దిగ్గజం గ్రేస్ హోపర్ గుర్తుగా ఈ డ్రోన్‌కు ఆయన పేరు పెట్టారు. మూడు అడుగులు ఉంటే ఈ డ్రోన్.. జాబిల్లి ఉపరితలంపై మూడు కీలక పరీక్షలు నిర్వహించనుందట. ఇందులో హైడ్రోజన్ ఫ్యుయెల్డ్ థ్రస్టర్లను ఉపయోగించారు. దీంతో డ్రోన్ ఎగురుతుంది. నావిగేషన్ కోసం కెమెరా, లేజర్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ ఎగురుతుండగా దీనిలోని పరికరాలు జాబిల్లి ఉపరితలాన్ని అన్వేషిస్తాయి.

ఈ ల్యాండర్‌తోపాటు ఫాల్కన్ 9 రాకెట్‌లో లూనార్ ట్రయల్‌బ్లేజర్ స్పేస్‌క్రాఫ్ట్‌ను కూడా నాసా చంద్రుడిపైకి పంపించింది. ఇది చంద్రుడి కక్ష్యలో తిరుగుతూ జాబిల్లిపై నీడ జాడను అన్వేషిస్తుందని నాసా వెల్లడించింది.

# హిందీవల్లే ఉత్తరాదిలో 25 భాషల కనుమరుగు



## తమిళనాడు సిఎం స్టాలిన్ ధ్వజం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, తమిళనాడులోని అధికార పార్టీ డిఎంకెలమధ్య హిందీభాషపరంగా మాటల యుద్ధమే నడుస్తోంది. తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ మరో వివాదానికి తెరలేపారు. హిందీ కారణంగా 25 ఉత్తరభారతీయ భాషలు కనుమరుగైపోతున్నాయని విమర్శించారు. గురువారం ఆయన తన సోషల్ మీడియాలో పోస్టుపెడుతూ ఇతర రాష్ట్రాల సోదరసోదరీమణులారా హిందీ కారణంగా ఎన్ని భారతీయ భాషలు కనుమరుగయ్యాయో ఎప్పుడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. 100 ఏళ్లలో ఉత్తం భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పూరి మైథిలీ, బుందేలి గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢీ, సంథాలి, అంజికా ఇలా అనేక భాషలు మనుగడకోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు హిందీ రాష్ట్రాలు కావని, వాటి అసలుభాషలు గతంలో కలిసిపోయాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నామని జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారని స్టాలిన్ వెల్లడించారు. జాతీయ విద్యావిధానం ఎన్‌ఇపిలో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం వెల్లడించింది. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డిఎంకె ప్రభుత్వం స్పష్టంచేస్తోంది. తమిళభాషకు రాష్ట్రానికి ప్రజలకు నష్టంకలిగించే చర్యలను అనుమతించబోమని స్టాలిన్ అన్నారు. దీనిపై గత కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. మరోవైపు బిజెపి డిఎంకెలమధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ టివికె అధ్యక్షుడు నటుడు విజయ్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలో భారతీయ విద్యార్థిని

## అత్యవసర వీసా కోసం తండ్రి దరఖాస్తు

### అనుకూలంగా స్పందించిన అమెరికా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** కోమాలో ఉన్న భారతీయ విద్యార్థిని కుటుంబం అభ్యర్థనపై అమెరికా నుంచి స్పందన వచ్చింది. భారత ప్రభుత్వం సంప్రదింపుల నేపథ్యంలో వీసా ఇంటర్వ్యూకు యూఎస్ అవకాశం కల్పించింది. వీసా కోసం బాధితురాలి తండ్రి చేస్తోన్న ప్రయత్నాలు తమ దృష్టికి రావడంతో భారత విదేశాంగ శాఖ అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం సానుకూలంగా స్పందించింది. వీసా లేక అత్యవసర ప్రయాణానికి అనుమతి ఇవ్వాలంటూ భారత విదేశాంగశాఖకు చెందిన అమెరికా విభాగం అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించినట్లు సమాచారం. కాలిఫోర్నియా యూనివర్సిటీలో పిజీ చేస్తోన్న నీలమ్ శిండే ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. కారు ఢీకొనడంతో శిండే తల, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉంటున్న ఆమె కుటుంబానికి ఫిబ్రవరి 16న ఈ విషయం తెలిసింది. నీలమ్ తండ్రి వెంటనే వీసా కోసం దరఖాస్తు చేసుకున్నా అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఎన్‌సిపి ఎంపి సుప్రియాసూలె చేసిన పోస్టు ద్వారా ఆ కుటుంబం ఆవేదన అందరి దృష్టికి చేరింది. నీలమ్ శిండే అనే విద్యార్థి యుఎస్‌లో ప్రమాదానికి గురై అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా కుమార్తె వద్దకు వెళ్లేందుకు ఆమె తండ్రి ప్రయత్నిస్తున్నారు. ఆయన అత్యవసర వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు సహాయం చేయాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, భారత దౌత్య కార్యాలయాన్ని కోరుతున్నా అని ఎంపి సుప్రియా సూలె ఎక్స్ వేదికగా కోరారు.



# పారిశుధ్యకార్మికులతో సిఎం యోగి సహపంక్తి భోజనం



**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 27:** ప్రయాగరాజ్‌లో 45రోజులపాటుసాగిన మహాకుంభ్ మహాశివ రాత్రితో ముగిసింది. ఈ క్రమంలో గురువారం రాష్ట్రముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్రివేణి సంగమంలోని అరైల్‌ఘాట్‌వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోటులో ప్రయాణంచేసి గంగా హారతిలో పాల్గొన్నారు. యూపి కేబినెట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నది. డిప్యూటి సిఎం బ్రజేశ్‌పాఠక్, కెపి మౌర్యలతోపాటు మంత్రులు కూడా ఉన్నారు. ఆ తర్వాత పారిశుధ్య కార్మికులతో కలిసి సిఎం యోగి సహపంక్తిభోజనం చేసారు. లంచ్‌లో మంత్రులు పోలీసులు అధికారులు కూడా పాల్గొన్నారు. మహాకుంభ్‌లో పాల్గొన్న శానిటేషన్ హెల్త్‌వర్కర్లకు పదివేల బోనస్ ఇస్తున్నట్లు సిఎం యోగిప్రకటించారు. ఏప్రిల్ నెలనుంచి శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం 16వేలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాత్కాలిక హెల్త్‌వర్కర్లకు నేరుగా నగదును బ్యాంకు ఖాతాలకు బదిలీచేయనున్నట్లు చెప్పారు. ఆ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యబీమా వసతి కల్పిస్తామన్నారు.



# మెడల్స్ సాధించడమే సక్సెస్ కాదు జీవితంలోనూ ఉన్నతంగా ఎదగాలి

**- ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్, ఎంపి పిటి ఉష**

**మంగళగిరి,ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** అంతర్జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న ఏపి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్రీడల్లోను ప్రధమస్థానంలో నిలబడడం అభినందనీయమని ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్,రాజ్యసభ సభ్యురాలు పద్మశ్రీ పిటి ఉష పేర్కొన్నారు.క్రీడలకుఎంతో ప్రాధాన్యత నిస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులను అందిస్తున్న వర్సిటీ యాజ మాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. గురువారం సాయంత్రం ఏపిఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉద్గమ్ -25 .జాతీయ క్రీడోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన పి.టి.ఉష క్రీడాజ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అధ్యక్షతన జరిగినక్రీడల ప్రారంభ వేదికపై ఆమె ప్రసంగించారు.కృషి, పట్టుదల ఏకాగ్రతతో సాదిన చేస్తే క్రీడల్లో అత్యుత్తమంగా రాణించవచ్చున్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రశంసనీయమన్నారు.క్రీడల వల్ల విద్యార్థుల్లో సంఘటిత శక్తి పెరిగి తద్వారా విజయసోపానాలు అందుబాటులోనికి వస్తాయన్నారు.మనసు పెట్టి ఆడాలి..అప్పుడే మనలోని అసలైన క్రీడాశక్తి బయటకొస్తుందని విద్యార్థులకు సూచించారు.ఎన్నో సవాళ్ళను అధిగమించి క్రీడల్లో ప్రతిభ చూపడం వల్లనే,తాను అంతర్జాతీయస్థాయిలోగుర్తింపు తెచ్చుకున్నానని పేర్కొంటూ చదువుకున్న విశ్వవిద్యాలయానికి దేశానికి పేరు తెచ్చేందుకు విద్యార్థులు శ్రమించాలని కోరారు.వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ మాట్లాడుతూ కిందటేడాది కంటే ఈ ఏడాది క్రీడోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని అంతర్జాతీయంగా జరిగిన ఒలింపిక్స్‌లో వర్సిటీ విద్యార్థులు పతకాలు సాదించడం అభినందనీయ మన్నారు.క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అనూప్‌సింగ్,అసిట్ డైరెక్టర్ సునీతలు క్రీడల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

ఈ ఏడాది పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30యూనివర్సిటీలు,ఇంజనీరింగ్ కాలేజీల విద్యా ర్థులు 2వేల మందికి పైగా పాల్గొంటున్నరన్నారు. వాలీబాల్,క్రికెట్,ఫుట్‌బాల్ క్రీడలతోపాటు అథ్లెటిక్స్‌లోనూ పోటీలు కొనసాగుతున్నాయన్నారు.మార్చి 1న జరిగే ముగింపు వేడకుల్లో విజేతలకు రూ.10లక్షల విలువ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.అనంతరం జరిగిన క్రీడాకారుల గౌరవ వందనం ర్యాలీలో ఎస్ ఆర్ఎం,.అమృత,మోహన్‌బాబు యూనివర్సిటీ ఎకస్ విజ్ఞాన్ సిద్దార్థ తీయడం విష్ణు ఇంజనిరంగ్ కళాశాల విద్యార్థులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగ ముఖ్యఅతిధి పిటి ఉషనుఏ వైస్ చాన్స లర్ మనోజ్ అరోరా ఘనంగా సత్కరించి జ్ఞాపికను ప్రదానం చేశారు.

అనంతరం జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుంచి క్రీడల్లో రాణిస్తున్న జెస్సీరాజ్ (సేకటింగ్) బాల ప్రసాదరెడ్డి (రన్నింగ్) ఆకుల హైమలను వేదికపైకి ఆహ్వానించి సత్కరించారు,పిటి ఉష వీరిని అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రర్ డాక్టర్ ఆర్ ప్రేమ్‌కుమార్,డీన్ వినాయక్,సిఎఫ్ ఏవో సుమ రీసెర్చ్ డీన్ రంజిత్



చంద్రబాబు ద్వారా రూ.లక్షల ఆర్థిక సాయం పొందిన ఆర్.నాగమణి

## అంధ యువతికి సిఎం చంద్రబాబు రూ.5 లక్షల ఆర్థికసాయం

**విజయవాడ. ఫిబ్రవరి 27,ప్రభాతవార్తప్రతినిధి:** తన వివాహానికి సాయం కోరిన ఓ అంధ యువతికి సీఎం చంద్రబాబు రూ.5 లక్షల సాయం అందించారు. కుప్పం మండలం రాళ్లబుదుగూరుకు చెందిన ఆర్.నాగమణి దేవుడి చిన్నచూపుతో అంధురాలిగా జన్మించింది. అయినప్పటికీ ఆత్మస్థైర్యం, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎంఏ వరకూ చదువుకుంది. ఆమె అంధురాలు కావడం, కుటుంబం ఆర్థికంగా బాగా ఇబ్బందుల్లో ఉండటంతో వివాహమవ్వడం భారంగా మారింది. ఆ కుటుంబ ధీన పరిస్థితిని అర్థం చేసుకుని శాంతిపురం మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన భూపతి అనే యువకుడు నాగమణిని మనువాడేందుకు ముందుకొచ్చాడు.

## మహాత్మా బాపూజీ గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక పర్యవేక్షణ :మంత్రి సవిత

**విజయవాడ.ఫిబ్రవరి27,ప్రభాతవార్తప్రతినిధి:** బీసీ బిడ్డల చదువుపై సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బిసి సంక్షేమ శాఖా మంత్రి సవిత తెలిపారు..మహత్మా బాపూజీ గురుకుల విద్యాలయాలపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందని వివరించారు.గురువారం ఆ మేరకు తన కార్యాలయం నుంచి విడుదల చేసిన కీలక సమాచార పత్రాన్ని అనుసరించి నాణ్యమైన విద్య అందిచడమే కాకుండా ఆహార, వసతి భద్రత కల్పించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. వెనుకబడిన తరగతులను అన్ని రంగాలతో పాటు విద్యలోనూ ముందుకు తీసుకురావాలన్న లక్ష్యంతో అన్న ఎన్టీఆర్ బీసీ హాస్టళ్లకు, గురుకులాలకు శ్రీకారం చుట్టారు. పేదరికంతో బీసీ బిడ్డలు విద్యకు దూరం కాకుడదన్న సదుద్దేశంతో ఎన్టీఆర్ హాస్టళ్లను, గురుకులాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీ విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 108 ఎంజేపీ స్కూళ్లు ఉండగా, వాటిలో 106 టీడీపీ ప్రభుత్వాలే మంజూరు చేశాయి. బీసీ విద్యార్థుల విద్యోన్నతికి టీడీపీ ప్రభుత్వాలు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నాయో ఇట్టే అర్థమవుతుంది. కేవలం గురుకులాల స్థాపనతోనే సరిపెట్టకుండా నాణ్యమైన విద్య, భోజన, వసతితో పాటు నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకుంది. విద్యార్థులకు భద్రతకు భరోసా కల్పించేలా సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం గురుకులాల్లో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయిస్తోంది. పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా ఇప్పటికే పలు గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో స్టడీ అవర్లు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకుల పాఠశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తోంది. తొలి విడతగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25 గురుకులాల్లో కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేశారు. త్వరలో మిగిలిన పాఠశాలల్లోనూ ల్యాబ్ లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. బీసీ విద్యార్థులకు వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గురుకులాలపై నిరంతర పర్యవేక్షణ చేయిస్తోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో గురుకుల కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయం నుంచి పర్యవేక్షణ చేస్తున్నారు. గురుకులా నిర్వహణపై ప్రతి ఎంజేపీ స్కూల్ నుంచి ఏ రోజుకారోజు వాట్సాప్ ద్వారా ఫొటోలు తెప్పించుకుంటున్నారు. ఫొటోలు పరిశీలిస్తూ.. నిబంధనలు అతిక్రమిస్తే వెంటనే సరిదిద్దేలా సూచనలు చేస్తున్నారు. నిరంతరం పకడ్బందీ పర్యవేక్షణతో ఎంజేపీ స్కూళ్ల నిర్వహణపై ప్రశంసలు వెల్లువెత్తున్నాయి. రోజూ ఫొటోలు పంపాల్సిందే...బీసీ విద్యార్థుల భద్రతకు చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా గురుకులా నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒకవైపు జిల్లా అధికారులు తరుచూ విజిట్ చేస్తున్నా... స్వయంగా గురుకుల సిబ్బందే బాధ్యత వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మరుగుదొడ్లు, బాత్రూమ్ లు, పరిసరాల శుభ్రత, మెనూ అమలు, ఆహార్యం నాణ్యత, స్టడీ అవర్ల నిర్వహణ ఇలా



అన్నింటిపైనా వాట్సాప్ ద్వారా ఫొటోలను నేరుగా గురుకుల కార్యదర్శికి పంపేలా ఆదేశాలు జారీచేసింది. ప్రతి రోజూ శుభ్రపరిచిన మరుగుదొడ్లు, బాత్ రూమ్ ల ఫొటోలను గురుకులాల వార్డెన్లు అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం ఆహారం తయారు చేసి, సిబ్బంది వాటిని రుచి చూసిన తరవాత విద్యార్థులకు అందిస్తారు. ఈ ఫొటో కూడా పంపాల్సి ఉంటుంది. స్టడీ అవర్ల నిర్వహణతో విశ్రాంతి గదుల శుభ్రతపైనా కూడా ఫొటోలు అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫొటోలను మంత్రి సవిత, గురుకుల కార్యదర్శి మాధవీలత ఎప్పకప్పుడు పరిశీలిస్తూ, తగిన సలహాలు సూచనలు అందజేస్తుంటారు.గురుకుల సీట్లకు విపరీతమైన డిమాండ్‌కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా బీసీ బిడ్డలకు ఎంజేపీ స్కూళ్ల ద్వారా సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తోంది. నిష్ణాతులైన ఉపాధ్యాయుల బోధనతో ప్రతి ఏటా టెన్త్, ఇంటర్, డిగ్రీలో ఎంజేపీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు రాబడుతున్నాయి. ముఖ్యంగా టెన్త్ లో ఏటా వంద శాతం మేర ఫలితాలు వస్తున్నాయి.

## ఇంద్రకీలాద్రిలో స్వామి అమ్మవార్ల రథోత్సవం



స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవ దృశ్యం

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ఏటా శివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే కళ్యాణోత్సవం అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల నగర విహారోత్సవం, రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన బుధవారం రాత్రి లింగోద్భవ కాలంలో నిర్వహించిన అభిషేకం అనంతరం కళ్యాణోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ముచ్చటగా ముస్తాబు చేసిన కళ్యాణవేదికపై శ్రీ స్వామి అమ్మవార్లను వేంచేపు చేసి కళ్యాణ క్రతువును పూర్తి చేశారు. గురువారం ఉదయం శ్రీ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజాదికాలు, సదస్యం నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 4 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లను రథం సెంటర్‌కు ప్రత్యేక పల్లకీలో తీసుకొచ్చి సిద్ధం చేసిన రథంలో వేంచేపుచేశారు. అక్కడినుండి రథంపై విహరిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంత్రపఠనాలు, వాయిద్యాల ఘోష, భూత, ప్రేత, ఠక్కు, టమార, గోకర్ణ, గజకర్ణ విచిత్ర వేషధారణలతో శ్రీ స్వామి అమ్మవార్ల రథంకు ముందు భక్తులు ప్రదర్శనలు చేశారు. అడుగడుగునా శ్రీ స్వామి అమ్మవార్లకు టెంకాయలు, హారతులతో నగర వాసులు స్వాగతం పలికి భక్తితత్పరతతో ప్రణమిల్లారు. హరహర మహాదేవ్ నామస్మరణతో, జయదుర్గా, జయజయదుర్గా నామస్మరణలతో నగరమంతా మార్మోగింది. రథోత్సవం ముగిసిన పిదప శ్రీ స్వామి అమ్మవార్లను శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయంకు పల్లకీపై తీసుకెళ్ళి అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ కె రామచంద్రమోహన్, ఇతర అధికారులు, వేదపండితులు, అర్చకస్వాములు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యస్ హెచ్ జి, ఎఫ్ పి ఓ సభ్యుల ఉత్పత్తులకు అధిక ఆదాయం పొందే చర్యలు తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ సీఈవో కరుణ,

**విజయవాడ, ఫిబ్రవరి27,ప్రభాత వార్తప్రతినిధి:** స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాదులు, రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్ పి ఓల) సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడించి అదిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. గురువారం సచివాలయంలోని ఐదో బ్లాక్ లోని తన కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు, ఫాంవేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీస్, ఫ్లిప్ కార్ట్ కంపెనీలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల సభ్యులైన మహిళలు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, వాటికి విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. ఇందుకు అవసరమైన తగిన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులకు అత్యధిక ధర పొందేందుకు తగిన కార్యాచరణతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఫామ్ వేద, బులెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసెస్, ఫ్లిప్కార్ట్ ప్రతినిధులు రైతు ఉత్పత్తులకు విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందే మార్గాలపై సమావేశంలో వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తి సంస్థల సభ్యుల ఆలోచనలు కనుగుణంగా వారి ఉత్పత్తులకు అధిక విలువ జోడించి, అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఆయా సంస్థల ప్రతిపాదనలపై చర్చించారు. త్వరలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) తో ఆయా కంపెనీలు యం ఓ యు లు చేసేందుకు సమావేశంలో నిర్ణయించారు. మహిళలు ఉత్పత్తి చేసే ఉత్పత్తులకు అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వారు సూచించారు ఈ సమావేశంలో సెర్ప్ సీఈవో కరుణ, డైరెక్టర్ పద్మావతి, ఐఏఎం బెంగళూరు ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి, మిల్లెట్ బ్యాక్స్ సీఈవో విశాల, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసెస్ సీఈవో రజిని, డైరెక్టర్ హెచ్ యస్ విశ్వనాథ్, ఫ్లిప్కార్ట్ ప్రాజెక్ట్ హెడ్ దీపూజ్యోషి తదితరులు పాల్గొన్నారు.

# మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చారా?

**సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మమ్మల్ని అడిగి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారా? ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే అభివృద్ధి పనులు చేస్తానని చెప్పారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ప్రాజెక్టులకు రూపకల్పన కేంద్రా న్ని అడిగి చేశాడా? రాష్ట్రాలు ఇలా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. లేనిది ఉన్నట్టుగా చెప్పడం అలవాటైంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అనేక ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు వివిధ విభాగాలతో మాట్లాడి, ఉత్తరాలు రాస్తూ అభివృద్ధి పనులు జరిగేలా చూస్తు న్నాను. ఇవాళ బెదరింపు రాజకీయాలు చేస్తే ఎవరు భయపడేవారు లేరన్నారు. రేవంత్‌రెడ్డి మాటలను నమ్మేవారు ఎవరూలేరు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని నమ్మి ఇపుడు ఆయన ఎలాంటి గాలిమాటలు మాట్లా డుతారో ప్రజలు అర్థం చేసుకున్నారు. నేనేం ఆయన, కాంగ్రెస్ పార్టీ దయాదాక్షిణ్యాలతో పార్లమెంట్ లోకి రాలేదు.. నేను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారీని. రేవంత్ మాటలకు నేను జవాబుదారీని కాద న్నారు. ముఖ్యంగా ఒక్క విషయంలో అయినా ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేను ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించాలని సవాలు చేస్తున్నాను. చేతకాని ముఖ్యమంత్రి, దమ్ములేని ముఖ్యమంత్రి, మాటలు చెప్పి చేతులు దులుపు కొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తే ఎలాంటి ఆర్థిక ప్రణాళిక చేస్తారో కూడా ఓ కార్యాచరణ లేదు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎలాంటి అవగాహన లేకుండా దుందుడుకుగా మాట్లాడుతున్నారని ఇది ఎంత వరకు సమంజసమని కిషన్‌రెడ్డి అన్నారు.

# తిరుమల సమాచారం

## యాత్రికులకు మొదటిఘాట్‌లోనూ చలువపందిళ్లు

**- ఒఆర్ఎస్ ప్యాకెట్లు నిల్వఉంచాలి - టిటిడి అదనపు ఇఒ చౌదరి**



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న వేసవిలో తిరుమలకు యాత్రికుల సంఖ్య విపరీతంగా ఉండే అవకాశం ఉండవచ్చని, అందుకు తగ్గట్లు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో భక్తులు కాలినడకన తిరుమలకు వచ్చే మొదటిఘాట్‌లోని అక్కగార్లగుడి, శ్రీవారిసేవాసదన్, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో చలువపందిళ్ళు ఏర్పాటుచేయాలన్నారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలాన్నరు. తగినంత లడ్డూలు బఫర్‌స్టాక్ ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వఉంచాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. అవసరమైన మేరకు నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

## కన్నులపండువగా కపిలేశ్వర కామాక్షి అమ్మవారి కల్యాణం



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్త ప్రతి నిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని తిరుపతిలో ఉన్న ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం అంగరంగవైభవంగా కపిలేశ్వర స్వామి కామాక్షిఅమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు కల్యాణమండపంలో ప్రత్యేక వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. సాయంసంధ్యవేళ చల్లటిగాలులు వీస్తుండగా కపిలతీర్థం ప్రాంగణం పచ్చని తోరణాల నడుమ పెళ్ళిపందిరిగా ముస్తాబైంది. ఆలయ అర్చకులు ,వేద పండితులు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పుణ్యాహవచనం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్రధారణ మొదలైన ఘట్టాలతో శాస్త్రోక్తంగా కపిలేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు.మహాశివరాత్రి పర్వదినం మరుసటిరోజు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించడం పరిపాటి. ఈ సందర్భంగా గృహస్థభక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులందుకున్నారు. హరహరమహాదేవ శంభోశంకర, ఓం నమ:శ్శివాయ అంటూ భక్తులు నామస్మరణ చేశారు. టిటిడి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసింది. కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం స్వామివారు పురుషామృగవాహనంపై అధిరోహించి భక్తులకు అభయమిచ్చాడు. అర్ధరాత్రి 12గంటల నుండి కపిలతీర్థంలో లింగోద్భవ అభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం అభిషేకం చేసి స్వామివారిని విశేషంగా ఆభరణాలతో అలంకరించారు. ఉదయం వాహనసేవలో సోమస్కంధమూర్తి ఆలయ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. పురవీధుల్లో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టిటిడి అధికారులు, ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## వేసవిలో మాడవీధులు, ఆలయ పరిసరాల్లో కూల్‌పెయింట్

**- కుమారధారతీర్థముక్కోటిని సమన్వయంతో విజయవంతం చేద్దాం**



**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** వేసవికాలం మొదలవడానికి ముందుగానే భక్తుల తాకిడి ఎక్కువగా ఉందని, అందుకు అనుగుణంగా అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లుచేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు ఆదేశాలిచ్చారు. వేసవిలో భక్తులు ఆలయ మాఢవీధులు, పరిసరాల్లో నడిచేందుకు వీలుగా కూల్‌పెయింటింగ్స్ చేయాలని, తరచూ ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో నీటిని వదలి చల్లదనాన్ని చేకూర్చాలన్నారు. మార్చి 14వతేదీ శుక్రవారం కుమారధారతీర్థముక్కోటి వేడుకలు జరుపుకోనున్నామని, అందుకు భక్తులకు పటిష్ట భద్రత ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలన్నారు. కురామధారతీర్థముక్కోటి ఏర్పాట్లుపై గురువారం సాయంత్రం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, వసతికల్పనవిభాగం ఆర్1డిప్యూటీ ఇఒ భాస్కర్, రవాణా జిఎం శేషారెడ్డి, విఎస్‌ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర ,తిరుమల సిఐ విజయకుమార్‌తో కలసి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారధారతీర్థముక్కోటి మార్చి 14న ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు తీర్థానికి భక్తులను అనుమతిస్తామన్నారు .అధిక బరువు, ఆస్తమా, గుండె జబ్బుతో బాధపడేవారిని అనుమతించరని, వృద్ధుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అటవీమార్గంలో తీర్థానికి నడచివెళ్ళడానికి అనుమతించబోమన్నారు. పాపవినాశనం నుండి కుమారధారతీర్థం వరకు అక్కడక్కడ భద్రత సిబ్బంది భక్తులకు సేవలందించేలా చూడాలన్నారు. భక్తులకు పొంగళి, పెరుగన్నం, సాంబారన్నం అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## 9నుండి శ్రీవారి తెప్పోత్సవాలు - ఆర్జితసేవలు రద్దు

**తిరుమల,ఫిబ్రవరి 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9నుండి 13వతేదీ వరకు ఐదురోజులపాటు జరగనున్నాయి. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు మార్చి 9వతేదీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో తిరిగి భక్తులకు అభయమిస్తారు.

# కమీషన్ ఇవ్వనిదే ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదు

## ఇది ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదా?: ఎంపి ఈటల

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కమిషన్ ఇవ్వనిదే ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదని, ఇది మీకు సిగ్గు అనిపించడం లేదా అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బిజెఎల్‌పి నేతల ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మరో ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. అవినీతి పాలనపై సిఎం ఎందుకు దృష్టి సారించడం లేదన్నారు. రేవంత్ ది తుగ్లక్ పరిపాలన అంటూ మండిపడ్డారు. సోయి అవగాహన లేదన్నారు. పాడిందే పాడరా అన్నట్టు రేవంత్ రెడ్డి వెకిలి మాటలు బంద్ చెయ్యాలన్నారు. చిట్ చాట్‌ల పేరుతో లీకులు ఇవ్వడం మానెయ్యాలని, మోడిని విమర్శించడం అంటే సూర్యుని మీద ఉమ్మి వేయడమే అన్నారు. కెసిఆర్ కూడా ఇట్లనే విమర్శ చేసారు, పోస్టర్లు వేశారు, హోర్డింగులు పెట్టారు. ఏమయ్యింది? ఎవరి మొఖం ఎక్కడ ఉందో తెలుసుకదా. నీకు కూడా అదే గతి పడుతుందని అన్నారు. మోడికి కూతురు, కొడుకు, అల్లుడు లేరు.. దేశప్రజలే ఆయన కుటుంబసభ్యులు అన్నారు. మోడిని విమర్శిస్తే కీర్తి పెరగదని అన్నారు. రాజకీయంగా ఖతం అవుతారు, భస్మం అయిపోతారు జాగ్రత్త అన్నారు. మీ మాటలు చూసి ఇందుకేనా తెలంగాణ తెచ్చుకుందని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు.

**బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలి**

బిఎస్ఎన్ఎల్ పునరుద్ధరణ జరగాలని, దీనికి హైదరాబాద్ నాంది పలకాలని ఎంపి

ఈటల రాజేందర్ అన్నారు. బిఎస్ఎన్ఎల్ పునరుద్ధ రణకు మా ఎంపీలు అందరం మద్దతుగా ఉంటామని అన్నారు. గురువారం టెలికాం అడ్వైజరీ కమిటీ

సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ గొప్ప సంస్థగా ఎదగడానికి కావా ల్సిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

# గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నిర్లక్ష్యం

## సంస్థను కాపాడాలని గిరిజన నేతల డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** అటవీ ఉత్పత్తులను సొంతంగా తయారు చేసిన వస్తువుల విక్రయంపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఆదరణ కరువైందనే విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కాని కార్పొరేషన్‌కు ఛైర్మన్‌ను నియమించిన ప్రభుత్వం సంస్థ బలోపేతం దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.
అడవుల నుంచి సేకరించే ఉత్పత్తు లతో పాటు తాము స్వయంగా తయారు చేసిన వస్తువుల వర్కెటింగ్‌ను మాత్రం గిరిజన సంక్షేమ అధికారులు గాలికి వదిలేశారని గిరిజన బిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన కో ఆపరేటివ్ కాన్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వం 301 పైగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసింది. ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. కానీ ప్రస్తుత ప్రభుత్వం కార్పొరేషన్‌ను పట్టించుకోవడం లేదని లేదని సంస్థ ఉద్యోగులు వాపోతున్నారు.
కార్పొరేషన్‌కు నిధులు లేక పోవడంతో ఉద్యోగులు, సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.30 నుంచి 40 కోట్లు విడుదల చేస్తే కార్పొరేషన్ బలోపేతం సాధ్యమవుతుందని, లేకపోతే సంస్థను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ పరిధిలో జీసీసీ ఛైర్మన్‌తో పాటు పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 280 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వారి జీతాల కోసం ప్రభుత్వం ఏటా దాదాపు రూ.80 కోట్ల వరకు వెచ్చిస్తున్నది. కానీ కార్పొరేషన్ ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వం సహకరిస్తూ, సంస్థ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేయాలని, మార్కెటింగ్ పరంగా చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ నాయక్ డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేషను బలోపేతం చేసి అటవీ ఉత్పత్తులు ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గురువారం జరిగిన కరీంనగర్- నిజామాబాద్- ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రితోపాటు మంత్రి భార్య, కుమారుడు, కోడలు కూడా ఓటు వేశారు. ఓటింగ్ సందర్భంగా వేరు వేరు క్యూలైన్లలో నిలబడి మంత్రి దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంత్రి ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులపై కేంద్రంతో మాట్లాడారని మంత్రి తెలిపారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీ లు మమ్మల్ని సంప్రదించలేదు రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి, మంత్రులు ఎంపీలు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఫెడరల్ సిస్టంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృశ్య రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యులవుతారని ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందన్నారు.

# 10లోగా యుడైస్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి

## సమాచారంలో తప్పలుంటే మీరే బాధ్యత వహించాలి

## డిఇఓలకు ఆదేశాలిచ్చిన పాఠశాల విద్యాడైరక్టర్ నరసింహారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను మార్చి 10లోగా అప్‌డేట్ చేయాలని పాఠశాల విద్యా డైరక్టర్ ఇవి నరసింహారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారుల(డీఈవో)ను ఆదేశించారు. విద్య శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు మార్చి 10లోగా పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నందున .. ఆ లోపుగా యుడైస్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని డీఈవోలను ఆదేశించారు. స్కూల్స్ వివరాలు.. ఉపాధ్యాయుల వివరాలతో పాటు విద్యార్థుల వివరాలను 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన వివరాలను అప్ డేట్ చేయాలన్నారు. స్కూల్ ఇన్ఫర్మేషన్‌లో క్లాస్‌రూమ్‌లు ఎన్ని ఉన్నాయి, ఫర్నిచర్ ఎంత ఉంది, ఐసీటీ, డిజిటల్ ఇన్ఫర్మేషన్‌ను ఇవ్వాలని సూచించారు. వారు సమర్పించిన వివరాలపై థర్డ్ పార్టీ పరిశీలన చేయనున్నదని.. ఎవరైనా వివరాలను తప్పుగా అప్‌డేట్ చేసినట్టు పరిశీలనలో తేలితే వారిపై చర్యలు తప్పవని .. అందుకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పాఠశాల విద్య డైరక్టర్ ఉత్తర్వులో స్పష్టం చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉన్నందున డీఈవోలు.. ఎంఈవోలు, హెడ్మాష్టర్లకు చెప్పి పూర్తి వివరాలను తెప్పించుకొని యుడైస్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.

# కవిత... మీ కాకమ్మ కథలు బంద్ చేయండి

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోడి కలిసి ఏం మాట్లాడుకున్నారో ఏమో అక్కడైతే మూడో వ్యక్తి లేడు మరి ఎమ్మెల్సీ కవితకు ఎలా తెలిసిందో చెప్పాలని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ చర్చ నుండి బయటకు వచ్చాక అబాండాలు మోపుతున్నా రన్నారు. తెలంగాణ ప్రజలకు మీ వంతుగా అంటే రోజుకు ఒకరు మీ కుటుంబంలో నుండి మాట్లాడాలి కదా అన్నారు. ఈరోజు మీ వంతుగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారా అన్నారు. టిఆర్ఎస్ పార్టీ గురించి నెగెటివ్‌గా మాట్లాడు తున్నారని అంటున్నారు, బిఆర్ఎస్ పార్టీ అంటే తెలంగాణకు కట్టుబడి ఉంటుంది అని చెప్తున్నారు కానీ మీరు తెలంగాణకు కట్టుబడి ఉండలే పది సంవత్సరాలలో తెలంగాణను పెట్టుబడిగా పెట్టి ఏడు లక్షల కోట్లు రాష్ట్రంలో అప్పులు చేసి వేల కోట్లు దండుకొని విదేశాల్లో పెట్టుబడి పెట్టడమే మీరు తెలంగాణ కట్టుబడి ఉండడం అని తెలంగాణ ప్రజలకు మీ గురించి తెలిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్, బిజెపి కలిసి డ్రామాలు ఆడుతున్నాయి వాళ్ళిద్దరూ ఒకటే జట్టు అంటున్నారు కానీ ఎవరు ఎవరి జట్టు తెలంగాణ ప్రజలు చూశారన్నారు. 8 ఎంపి సీట్లు గెలవడానికి ఎవరికి ఎవరు ప్రోత్సహించిరు ఇప్పుడు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎలక్షన్లో క్యాండిడేట్స్‌ను నిలబెట్టకుండా ఇంటర్నల్‌గా ఎవరికి సపోర్ట్ చేశారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. చీమ చిటుక్కుమన్న మాట్లాడే మీరు, మీకు అత్యంత సన్నిహితుడు గతంలో మీ అన్నగారైనటువంటి కెటిఆర్‌కి అన్ని విధాలుగా ఉన్నటువంటి వ్యక్తి దుబాయిలో మరణించినప్పుడు దాని గురించి ఖచ్చితంగా చర్చ వస్తుందని, ఒక మనిషికి దగ్గరగా వ్యవహారాలు నడిపి దగ్గరగా పెట్టుబడులను చూసుకొని ఆ రోజుల్లో ఉన్నటువంటి ఐ లైఫ్ పబ్బు లాంటి మేజర్ కార్యక్రమాలను హైదరాబాదులో నడిపినటువంటి వ్యక్తి మీకు అత్యంత సన్నిహితుడు అని తెలంగాణ ప్రజలందరికీ తెలుసిన వ్యక్తి ఈరోజు దుబాయిలో చనిపోతే దాని గురించి విచారణ కావాలని, విచారణకు ఇస్తే బాగుంటుందని వాస్తవాలు తెలుసుకోవాలని లేదా అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడమే కాక మీరు ఢిల్లీకి వెళ్లి వ్యాపారం చేయాలనే పిచ్చి ఆలోచనతో అక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడం మీ వల్లనే జరిగిందన్నారు.

# మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలి

## రేపు మాదిగ అమరవీరుల దినోత్సవం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ జరిపి మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం గ్రామ మండల, జిల్లా, కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే మాదిగ అమరవీరుల త్యాగాల గుర్తుగా ఒక స్థూపాన్ని నిర్మించాలని హైదరాబాద్ సమీపంలో 5 ఎకరాలస్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలన్నారు. అలాగే షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలను సవరించాలని ఎస్సీలను ఏబిసిడిలుగా గుర్తించి అభివృద్ధి చెందని కులాలకు మొదటి ప్రాధాన్య ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 10తేదీలోపు ఎస్సీలను గ్రూపులుగా విభజించకుండా లోపాలను సవరించకుండా నిర్లక్ష్యం చేస్తే 11వ తేదీ నుంచి ఎమ్మార్పీఎస్, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాంని మందకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఇంజన్ వెంకటస్వామి, బోర్ర బిక్షపతి మాదిగ, మచ్చ దేవేందర్ మాదిగ, హోలియోదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జహం గీర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీవీ నరసింహా మాదిగ, దప్పు మల్లి కార్జున్ మాదిగ, మంథని సామెల్, దుప్పల్లి అనీల్, మునిరతి అరుణ్, కోద్రుపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.




గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

### ఏ రాజకీయ పార్టీలో చేరే ప్రసక్తి లేదు

**హైదరాబాద్ (సైఫాబాద్):** తాను ఏ రాజకీయ పార్టీలో చేరేది లేదని, మాదిగ కండువాను మార్చే ప్రసక్తి లేదని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. తాను కేవలం వర్గీకరణ కోసమే ప్రధాని నరేంద్రమోడీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి, ఎన్.చంద్రబాబునాయుడు, కెసిఆర్, రేవంత్‌రెడ్డిని కలిశానని తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో భారత్ మైనార్టిస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆవిర్భావ సభలో ఆయన ప్రసంగించారు. ముస్లింల సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రైవేట్ వర్సిటీల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డికి బిసి సంక్షేమ సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్, ఓయూ జెఏసి ఛైర్మన్ బండి నరేష్, మాల మహానాడు సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్‌ఛార్జ్ గోదా రవీందర్ పాల్గొన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధనార్జనే ధ్యేయంగా పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీడిస్తూ లక్షలకు లక్షల రూపాయలు బడుగు బలహీన వర్గాల విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్నారని.. కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రైవేట్ యూనివర్సిటీలు విఫలమయ్యాయని మండిపడ్డారు. కొన్ని యూనివర్సిటీలు ఏలాంటి అర్హతలు లేకుండా అక్రమార్గంలో దొంగ పత్రాలు సృష్టించి అధికారులను మచ్చిక చేసుకొని, ముడుపులు ఇచ్చి న్యాక్(ఎన్ఏఏసీ), ఎన్‌బీఏ అక్రిడేషన్ పొంది విద్యార్థుల దగ్గర లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని.. అటువంటివాటినీ గుర్తించి క్షుణంగా తనిఖీలు చేయాలనీ కోరారు. ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లను అమలు చేస్తే.. బడుగు, బలహీన వర్గాల వారు కూడా అక్కడ చదివే అవకాశం ఏర్పడుతుందన్నారు. అందుకే ప్రైవేటు యూనివర్సిటీల్లో రిజర్వేషన్లను అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

# రైతులకు అందుబాటులో 10.36 లక్షల టన్నుల యూరియా

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి 2024-25 సీజన్లో ఇప్పటి వరకు 10.36 లక్షల టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రైతులు 9.21 లక్షల టన్నుల యూరియా ఎరువులను కొనుగోలు చేసారని చెప్పారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు వరకు 1.08 లక్షల టన్నుల యూరియా నిల్వ వుందని వివరించారు. రాష్ట్రానికి కావలసిన ఎరువులను ఎప్పటికప్పుడు రైతులకు సరఫరా చేసేటందుకు కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 41 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని, అదికాకుండా, త్వరితగతిన మరో 30 వేల టన్నుల యూరియా సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎరువులు కొనుగోలు కేంద్రాలను తెరిచి రైతులకు అందుబాటులో వుండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొంటూ, పంటకాలము కంటే ముందే మార్క్ ఫెడ్ దగ్గర ప్రారంభ నిల్వలు ఉంచుకుందని వెల్లడించారు. అన్ని జిల్లాలకు వ్యవసాయ అధికారులకు సరిపడా యూరియాను ముందుగానే సరఫరా చేసి, పంపిణీలో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.




గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

# దుబాయ్‌లో కేదార్ మృతి.. రాష్ట్రంలో సంచలనం

## మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** దుబాయ్‌లో కేదార్ మృతి రాష్ట్రంలో సంచలనంగా మారిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేదార్ జూబ్లీహిల్స్‌లో గతంలో పబ్‌లను నడిపిన వ్యక్తి అన్నారు. గతంలో డ్రగ్స్ కేసులో దొరికాడని, ఆయనతో పాటు డ్రగ్స్‌లో ఉన్న వ్యక్తులు ఎవరో తెలియాల్సి ఉన్నారు. తెలంగాణలో సంపాదించిన అక్రమ సంపాద వేల కోట్లు దుబాయ్ తరలించబడ్డాయన్నారు. అక్రమ డబ్బులు ఎవరు దుబాయ్‌కి తరలించారో ప్రజలకు తెలియాలన్నారు. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఉన్న బినామీలు ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియాలన్నారు. వేలకోట్లు విదేశాలకు తరలిపోతుంటే రాష్ట్రంలో విచారణ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 14నెలలు అవుతున్నా విచారణ సంస్థలు ఇప్పటి వరకు ఒక్క హవాలా వ్యక్తి ని కూడా పట్టుకోలేదన్నారు. డ్రగ్స్ దందాలో సినీ ప్రముఖుల ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుందని, ఇప్పటికైనా హవాలా దందాపై యాక్షన్ తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సినీ ప్రముఖులు, బ్రాండ్ అంబాసిడర్ పేరుతో సంపాదించిన సొమ్ము విదేశాలలో పెట్టుబడులు పెడుతున్నారని, చీటర్స్ చేతిలో సూపర్ స్టార్స్ మోసపోతున్నారన్నారు. సంపాదించిన సొమ్ముతో కొంత తెలంగాణకు కేటాయించాలని, ప్రభుత్వం విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తుందని, మీ సంపాదనలో కొంత తెలంగాణ విద్యానిధికి కేటాయించాలన్నారు. తెలంగాణ పిల్లల భవిషత్తును అందంగా తీర్చి దిద్దాడానికి సహకరించాలన్నారు.

### మాజీమంత్రి కెటిఆర్ ఎందుకు స్పందించడం లేదు?

### పిసిసి మీడియా ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి

ట్విట్టర్‌లో ఏ అంశంపైనా అయినా స్పందించే మాజీమంత్రి కెటిఆర్ దుబాయ్ లో చనిపోయిన సినీనిర్మాత విషయంలో ఎందుకు మాట్లాడడం లేదని పిసిసి మీడియా ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కెటిఆర్ సిని నిర్మాత దుబాయ్‌లో చనిపోయినప్పుడు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నీ నమ్మిన బంటు అక్కడే ఉన్నాడట.. ఉన్నాడా లేడా?? అంటూ ప్రశ్నించారు. కేదార్ మీకు పరిచయమా కాదా, కేదార్ రాడిసన్ బ్లూ డ్రగ్స్ కేస్‌లో ఏ4గా ఉన్నారు. కేదార్‌కు మీ బావమరిది రాజ్ పాకాలకు దగ్గరి సంబంధం ఉన్నట్లు గతంలో ప్రచారం జరిగిందని, కేదార్ ఘటనపై విచారణ చేయాలని కెటిఆర్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

# ఇందిరమ్మ ఇంటి ఖర్చు తగ్గించుకునే యోచనలో అధికారులు

## నిర్మాణ బాధ్యత మేస్త్రీలకే.. వారికి న్యాక్‌లో శిక్షణ

## ఇప్పటికే 7 జిల్లాల్లో 82 మందికి పూర్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఇండ్లు లేని పేదల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 26న ఈ పథకం ప్రారంభం కాగా.. తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ పథకం కింద ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు నాలుగు విడతల్లో ఇవ్వనున్నారు. అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే అన్ని జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.
కాగా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ ఖర్చును సాధ్యమైనంత తగ్గించే దిశగా వారు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మేస్త్రీలకు శిక్షణ ఇవ్వాలని గృహ నిర్మాణ శాఖ డిసైడ్ అయింది. తొలి విడతలో మంజూరు చేసిన 72,045 ఇళ్లను సత్వరం నిర్మించి పూర్తి చేయడానికి ఇండ్ల నిర్మాణంలో గట్టితనం, నాణ్యత ఉండేలా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టడం, వ్యయాన్ని తగ్గించడం. ఇంటి నిర్మాణ సామగ్రి వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవడం, భద్రత తదితర అంశాలపై మేస్త్రీలకు శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణలోని 12,672 గ్రామాల నుంచి ఒక్కో మేస్త్రీని ఎంపిక చేసి వారికి ఇళ్ల నిర్మాణంపై ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రణాళికలు రెడీ చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో ప్రస్తుతం ఏడు జిల్లాల పరిధిలో 82 మంది మేస్త్రీలకు మొదటి బృందంలో ట్రైనింగ్ పూర్తిచేశారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే గ్రామాలకు ఈ మేస్త్రీలను ఎంపిక చేసి ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే పేదలపై భారం పడకుండా.. ఒక్కో ఇంటికి కావాల్సిన 8 ట్రాక్టర్ల ఇసుకను ఫ్రీగా ఇచ్చేందుకు ఇప్పటికే ప్రభుత్వం సిద్ధమైంది.
రాష్ట్రంలోని మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేలా ఇటుక తయారీ యూనిట్లు ఏర్పాటు చేసి సరఫరా చేయడానికి కూడా అధికారులు చర్యలు చేపట్టారు. 400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం మూడు నమూనాలను సర్కార్ విడుదల చేసింది. తాజాగా.. ఇండ్లు నిర్మించే మేస్త్రీలకు ట్రైనింగ్ ఇచ్చే అంశంపై గృహ నిర్మాణ శాఖ దృష్టిసారించింది.

# ప్రభాస్ సినిమా వివాదంలో నిర్మాత దిల్ రాజుపై చర్యలొద్దు

## సుప్రీంకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) ఛైర్మన్ దిల్ రాజుకు సుప్రీంకోర్టు ఊరట లభించింది. దిల్ రాజుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. దిల్ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. నిర్మాత దిల్ రాజు సహా మిగిలిన వారిపై కాపీరైట్ చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం విచారణ కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. రెండు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. మార్చి 18న సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. కాగా తాను రాసిన నా మనసు నిన్ను కోరే కథ ఆధారంగానే మిస్టర్ పర్ఫెక్ట్ సినిమాను చిత్రీకరించారని ఆరోపిస్తూ 2017లో దిల్ రాజుతో పాటు, మరి కొందరిపై రచయిత్రి ముమ్మిడి శ్యామల రాణి హైకోర్టును ఆశ్రయించారు. సమగ్ర విచారణ జరిపిన తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. కేసును కొట్టివేయాలని దిల్ రాజు సహా మరో నలుగురు 2019లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వాదనల తర్వాత గత ఏడాది డిసెంబర్ లో దిల్ రాజు, సహా మరికొందరిపై ఛార్జిషీట్ లో దాఖలైన సెక్షన్ 420 ను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 63 పై మాత్రం కింది న్యాయస్థానంలో యథావిధిగా విచారణ జరగాలని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును ఈ నెల 6న దిల్ రాజు సుప్రీంకోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సెక్షన్ 420 నుంచి విముక్తి కల్పించిందని, అలాగే సెక్షన్ 63 కేసును సైతం క్వాష్ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# మైనింగ్‌లో సంస్కరణలు

## గనుల శాఖలో నూతన పాలసీ

## కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో మైనింగ్ లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో గురువారం మైనింగ్ శాఖపై ఆయన మీడియాతో మాట్లాడారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామన్నారు. ఇదే సమయంలో 12 ఖనిజాలకు సంబంధించిన రాయల్టీని పెంచినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. అలాగే ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని వివరించారు. ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించామన్నారు. ప్రపంచంలోనే బొగ్గు ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. బొగ్గు నిల్వల్లో ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉండంటంతో పాటు, రెండో అతిపెద్ద బొగ్గు వినియోగదారుగా భారతదేశం నిలిచిందని అన్నారు. 2047 వికసిత భారతఖ లక్ష్యాల్లో బొగ్గు రంగం చాలా కీలక పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. దేశంలో బొగ్గు ద్వారానే 74 శాతం విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. రానున్న దశాబ్దాల్లోనూ బొగ్గు ఒక కీలకమైన ఇంధనంగా ప్రత్యేకతను సంతరించుకుంటుందపి వివరించారు. బొగ్గు రంగంలోనూ మోలికమార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు తెలిపారు. కోల్ బ్లాక్స్ వేలం విషయంలో పారదర్శకంగా వ్యవహరించామని అన్నారు. ఇప్పటివరకు 10 విడతల పాటు పారదర్శక వేలం పూర్తయి 184 బ్లాక్స్ వేల నిర్వహించినట్లు పేర్కొన్నారు. కమర్షియల్ కోల్ మైనింగ్, కోల్ గ్యాసిఫికేషన్, టెక్నాలజీ వంటి వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. భారత బొగ్గు ఉత్పత్తి సామర్థం పెరిగిందని తెలిపారు. 2023.24లో 998 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెబుతూ 2014లో ఇది కేవలం 609 కోట్ల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగిందని గుర్తు చేశారు. బొగ్గు రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరిగిన తర్వాత మరింత పోటీ పెరిగిందని స్పష్టం చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న వి.సంధ్య

# హైదరాబాద్‌లో ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటాం

## పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్య హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ వేదికగా అంగాంగ ప్రదర్శనగా సాగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జాతీయ నాయకురాలు వి.సంధ్య హెచ్చరించారు. ఒకవైపు నీటికరవుతో సాగునీరు, తాగునీరు లేక పంటలు, గొంతులు ఎండి పోయి ప్రజలు అల్లాడుతుంటే ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ వేదికగా మార్చడం ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న బాధ్యతారాహిత్యాన్ని తెలియ జేస్తున్నదని ఆమె ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి జి.ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అనసూయ, అందె మంగతో కలిసి సంధ్య మాట్లాడారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం, మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామనే నినాదంతో మార్చి 1వ తేదీ నుంచి 8 వరకు మహిళా శ్రామిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని విమర్శించారు.

# 325 హాస్టళ్ల అద్దె బకాయిలు చెల్లించాలి

## ముఖ్యమంత్రికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** 'రాష్ట్రంలోని 325 బిసి కాలేజీ హాస్టళ్లు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీరికి గత 36 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. విపరీత జాప్యం మూలంగా అద్దె భవనాల యజమానులు భవనాలు ఖాళీ చేయమని అధికారులపై వత్తిడి తెస్తున్నారు. ఒకవైపు పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అద్దె బకాయిలు చెల్లించాలి' అని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బకాయిలు చెల్లించకపోతే హాస్టళ్ళు మూసివేస్తామని బెదరిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాలేజీ హాస్టళ్లు 325 ఉన్నా ఇందులో 50వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, పిజి, డిగ్రీ, ఇంటర్ తదితర ప్రాముఖ్యత కోర్సులు చదువుచున్నారు. హాస్టళ్లకు స్వంత భవనాలు కట్టాలని ఆయన కోరారు. కూరగాయలు, మాంసం, గుడ్డు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత ఐదు నెలలుగా చెల్లించడం లేదని, హాస్టళ్లకు సరఫరా చేసే సరుకుల కాంట్రాక్టర్లు వ్యాపారస్తులు నిత్యావసర వస్తువులు సరఫరా నిలిపి వేస్తామని అంటున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. సింఎ వెంటనే జోక్యం చేసుకొని బడ్జెట్ విడుదల చేయాలని కోరారు.

# ‘ఆదిత్య 369’ గ్రాండ్ రీ-రిలీజ్

నటసింహం నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీ దేవి మూవీస్ సంస్థ నిర్మించిన తొలి భారతీయ సైన్స్ ఫిక్షన్ చిత్రం ఆదిత్య 369 నేటి సాంకేతికతలకి అనుగుణంగా డిజిటలైజ్ చేయబడి ఈ సమ్మర్‌లో గ్రాండ్ రీరిలీజ్‌కి సిద్ధం అవుతోంది. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నేపథ్యంలో వచ్చిన మొదటి సినిమాగా పేరొందిన ఈ చిత్రం శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాణంలో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందింది. శ్రీ కృష్ణదేవరాయలుగా నందమూరి బాలకృష్ణ నటన, సింగీతం దర్శక నైపుణ్యం, ఎస్. పి బాల సుబ్రహ్మణ్యం గాత్రం సమర్పణ, జంధ్యాల సంభాషణలు, ఇళయరాజా అద్భుత సంగీతం, శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణవిలువలు, ఇతర నటీనటుల ప్రతిభ, అబ్బురపరిచే సెట్స్, ఫైట్స్, దుస్తులు, నృత్యం ఇలా ప్రతీ ఒక్కరు చరిత్రలో నిలిచిపోయేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్ద డంలో ముఖ్య పాత్రలు పోషించారు. చలన చిత్ర పరిశ్రమలో ఎన్నోసినిమాలు ఉన్నా, కొన్ని ప్రజల హృదయాల్లో, కళాభిమానుల లైబ్రరీలలో ఉండి పోయేవి, వాళ్ల ఎప్పుడూ మాట్లాడుకునేవి ఉంటాయి. ఆ కోవకు చెందిన చిత్రమే ఆదిత్య 369. రీ రిలీజ్ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, “ఆదిత్య 369 మొదటిసారి విడుదల సమయంలో ఎంతఉత్సాహంగా, ఆసక్తిగా ఉన్నానో, ఇపుడు రీ రిలీజ్‌కి కూడా అలాగే ఉన్నాను. ఎన్ని సార్లు చూసినా కనువిందు చేసే ఈ ట్రెండ్ సెట్టింగ్ చిత్రాన్ని డిజిటల్ 4కెలో ఇంకా అద్భుతంగా తీర్చదిద్దాం. అన్ని వయసుల, వర్గాల ప్రేక్షకులని, నందమూరి అభిమానులను అలరించిన ఈ చిత్రాన్ని మళ్ళీ మీ ముందుకు తీసుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో మంచి చిత్రాలు తెరకెక్కించిన నాకు, మా నిర్మాణ సంస్థకి ఒక గొప్ప గుర్తింపు, అద్భుతమైన పునాది ఆదిత్య 369తోనే. ఈ సమ్మర్‌లో గ్రాండ్‌గా రీరిలీజ్ చేయడానికి పూర్తి సన్నాహాలు చేస్తున్నాం” అన్నారు.



# ‘చంద్రేశ్వర’ నుంచి శివుని సాంగ్

శివ బాలాజీ ఫిలింస్ పతాకంపై బేబీ అల సమర్పణలో సురేష్ రవి, ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఎమోషనల్ ఎంటర్‌టైనర్ చంద్రేశ్వర. ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్రేశ్వర సినిమాలోని శివుని పాటను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో నటుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ, మహా శివరాత్రి పర్వదినం రోజు చంద్రేశ్వర సినిమా నుంచి శివుని పాటను రిలీజ్ చేయడం గొప్ప సందర్భం. శివుని పాట చాలా బాగుంది. ఆ శివుడి దయ మీ మీద ఉండాలి. ఇలాంటి మంచి ప్రయత్నం చేసిన నిర్మాత రవీంద్రచారి, దర్శకుడు పెరుమాళ్ వర్ధన్‌కు అభినందనలు. సినిమా అంటే ప్యాషన్ మాత్రమే కాదు డబ్బు కూడా నిర్మాతకు రావాలని కోరుకుంటున్నా. అన్నారు. డైరెక్టర్ కమ్ ఆర్టిస్ట్ ఈశ్వర్ మాట్లాడుతూ, నిర్మాత రవీంద్రచారి చంద్రేశ్వర మూవీతో మన సనాతన ధర్మం, దేవాలయాల నేపథ్యంతో మంచి సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు అంతా మంచే జరగాలని గత వారం ప్రయాగరాజ్ వెళ్లి పూజ చేసి వచ్చారు. ఆయన మన హిందూధర్మం గురించి ఎప్పుడూ మాట్లాడుతుంటారు. అలా నాకు ఆయన కనెక్ట్ అయ్యారు. ఇటీవల ఛావా సినిమా బాలీవుడ్‌లో సూపర్ హిట్ అయ్యింది. అలాగే చంద్రేశ్వర సినిమా పెద్ద విజయం సాధించాలి. రవీంద్రచారి ఇలాంటి మరిన్ని మంచి మూవీస్ చేయాలన్నారు.

నటుడు గాలిపటాల సుధాకర్ మాట్లాడుతూ చంద్రేశ్వర వంటి మంచి మూవీ చేస్తున్న నిర్మాత రవీంద్రచారికి నా ప్రశంసలు అందిస్తున్నా. ఆయన ఇలాంటి మరెన్నో మంచి సినిమాలు చేయాలి. ప్రొడ్యూసర్స్ బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. మా లాంటి కొత్త వాళ్లకు అవకాశాలు వస్తాయి. శివుని పాట చాలా బాగుంది. అన్నారు. జబర్దస్త్ వినోదిని మాట్లాడుతూ, చంద్రేశ్వర పేరులో చంద్రుడు, ఈశ్వరుడు ఉన్నారు. అలాంటి మంచి టైటిల్‌తో ఈ సినిమా రావడం సంతోషంగా ఉంది. శివుని పాట చాలా బాగుంది అన్నారు. జబర్దస్త్ గడ్డం నవీన్ మాట్లాడుతూ, చంద్రేశ్వర సినిమా కంటెంట్ చూస్తుంటే సినిమా తప్పకుండా థియేటర్స్‌లో చూడాలి అనిపిస్తోంది. శివుని పాట చాలా బాగుంది. ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందాలని కోరుకుంటున్నా అన్నారు. నటి సంజనా చౌదరి మాట్లాడుతూ, చంద్రేశ్వర మూవీలోని శివుని పాట చూస్తుంటి శివరాత్రి పండుగ ఇక్కడే జరుగుతోంది అనిపిస్తోంది. ఈ మధ్య కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ రావడం లేదు.





# ‘ఛావా’ తెలుగు రిలీజ్‌కు రెడీ

ఛత్రపతి శంభాజీ మహారాజ్ వీరగాథని వివరించే చారిత్రక ఇతిహాసం, అపూర్వమైన ప్రశంసలు అందుకొని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతున్న బ్లాక్ బస్టర్ ఛావా తెలుగు రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. మొదట హిందీలో విడుదలైన ఈచిత్రం ప్రేక్షకుల డిమాండ్‌కు అనుగుణంగా ఇప్పుడు మార్చి 7, 2025న తెలుగులో డబ్ చేయబడి థియేటర్లలో విడుదల కానుంది. సౌత్ ఇండియన్ సినిమా పవర్‌హౌస్ అయిన ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా ఛావా తెలుగులో రిలీజ్ కానుంది. 300 కంటే ఎక్కువ బ్లాక్ బస్టర్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ చిత్రాలను రిలీజ్ చేసిన ట్రాక్ రికార్డ్ వున్న గీతా ఆర్ట్స్ ఛావా సినిమాప్రతి మూలకు చేరేలా చూసుకోవడానికి పర్ఫెక్ట్ పార్ట్నర్. దినేష్ విజన్ మాడ్డాక్ ఫిల్మ్స్ నిర్మించిన ఛావాలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించారు. రష్మిక మందన్న యేసుబాయి భోంస్లేగా, అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా, దయానా పెంటీ జినత్‌ఉన్‌నిస్సా బేగంగా, అశుతోష్ రాణా హంబిర్రావ్ మోహితేగా, దివ్య దత్తా సోయారాబాయిగా నటించారు. ఫిబ్రవరి 14న విడుదలైనప్పటి నుండి ఈ చిత్రం రికార్డు స్థాయిలో వసూళ్లు సాధించింది. అద్భుతమైన కథనం, పెర్ఫార్మెన్స్, ఛత్రపతి శంభాజీ మహారాజ్ వారసత్వానికి శక్తివంతమైన నివాళితో, ఛావా ప్రేక్షకుల హృదయాల్లో అత్యున్నత స్థానాన్ని సంపాదించుకుంది.

# ‘తల్వార్’ ఆడియో సూపర్

యంగ్ టాలెంటెడ్ హీరో ఆకాష్ జగన్నాథ్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ “తల్వార్“. ఈ సినిమాను వార్నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై భాస్కర్ ఇ.ఎల్.వి నిర్మిస్తున్నారు.యువ దర్శకుడు కాశీ పరశురామ్ రూపొందిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు అశ్వత్థామ, లక్ష్య సినిమాలకి రైటర్‌గా పని చేసి ‘రణస్థలి’ అనే సినిమా డైరెక్ట్ చేసారు. ఈచిత్రంలో పూరి జగన్నాథ్, ప్రకాష్ రాజ్, షిన్ టామ్ చాకో, అనసూయ భరద్వాజ్, అజయ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా “తల్వార్” సినిమా నుంచి పవర్ ఫుల్ ఆడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ‘తల్వార్’ ఆడియో గ్లింప్స్ ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. వాయిస్ ఓవర్‌లో ఆకాష్ జగన్నాథ్ తరతరాలుగా జరుగుతున్న యుద్ధం, రక్తపాతం గురించి పవర్ ఫుల్ డైలాగ్ చెప్పారు. యుద్ధం జరిగే తీరు మారినా..చివరకు రక్తపాతంతో ముగుస్తోందనే డైలాగ్ ఇంప్రెస్ చేయగా, అధర్మంతో అయినా ధర్మాన్ని గెలిపించేందుకు సిద్ధ మంటూ కథానాయకుడు చెప్పిన డైలాగ్ ఈ ఆడియో గ్లింప్స్‌కు హైలైట్‌గా నిలుస్తోంది. రీసెంట్‌గా షూట్ స్టార్ట్ అయిన “తల్వార్” సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. నటీనటులు: ఆకాష్ జగన్నాథ్, ప్రకాష్ రాజ్, పూరి జగన్నాథ్, షిన్ టామ్ చాకో, అనసూయ భరద్వాజ్, అజయ్, తదితరులు



# ‘యుఫోరియా’ మేకింగ్ గ్లింప్స్

గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద నీలిమ గుణ నిర్మాణంలో గుణ శేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం ‘యుఫోరియా’. నూతన నటీనటులు, సీనియర్ యాక్టర్స్ కాంబోలో గుణ శేఖర్ ఓ ట్రెండీ టాపిక్ మీద ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నేటి సమాజాన్ని ప్రతిబింబించేలా సాగే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ తాజాగా పూర్తయింది. ఈ మేరకు మేకర్లు అప్డేట్ ఇచ్చారు. యుఫోరియా షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. యుఫోరియా టైటిల్ గ్లింప్స్, కాన్సెప్ట్ తెలియజేసేలా వదిలిన వీడియో అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంతో విఘ్నేశ్ గవిరెడ్డి టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండగా సీనియర్ నటి భూమిక ఇందులో ముఖ్య పాత్రలో కనిపించబోతోన్నారు. సారా అర్జున్, నాజర్, రోహిత్, లిఖిత యలమంచలి, పృథ్వీరాజ్ అడ్డాల, కల్పలత, సాయి శ్రీనిక రెడ్డి వంటి వారు ఇతర పాత్రల్లో నటించారు. షూట్ పూర్తి అంటూ మహా శివరాత్రి సందర్భంగా మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను చిత్ర యూనిట్ ప్రారంభించింది. ఇక త్వరలోనే ఈ మూవీని ఆడియెన్స్ ముందుకు తీసుకు రాబోతోన్నారు. నటీనటులు: భూమిక చావ్లా, సారా అర్జున్, నాసర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్ప లత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాల కృష్ణ, రవిప్రకాష్, నవీనా రెడ్డి.





ఐశ్వర్య మీనన్ నయా లుక్


# ‘అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే’ టైటిల్ లాంచ్

తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే తొలి ప్రయత్నంగా, దేశముదురు హీరోయిన్ హన్సిక మోత్వాని లీడ్ రోల్‌గా “105 మినిట్స్” అనే సింగిల్ షాట్, సింగిల్ క్యారెక్టర్ మూవీతో ఒక వినూత్న ప్రయోగం చేసిన దర్శకుడు రాజా దుస్సా, ఇప్పుడు తన తదుపరి చిత్రంగా తెలంగాణ యాస భాష నేపథ్యంలో “అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే” అంటూ పూర్తి వినోదాత్మకమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాని “శ్రీ రామకృష్ణ సినిమా” బ్యానర్‌లో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. సహ నిర్మాతలుగా నాంపల్లి సోమాచారి, అలూరి రాజిరెడ్డి, రూప కిరణ్ గంజి వ్యవహరిస్తున్నారు. ఈ కథ విషయానికి వస్తే 1980లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం వరంగల్ జిల్లాలో జరిగిన ఒక యదార్థ సంఘటనను తీసుకొని ఈ చిత్రాన్నిపూర్తి వినోదాత్మకంగా రూపొందిస్తున్నామని దర్శకుడు రాజా దుస్సా వెల్లడించారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా వేణు మురళీధర్.వి, ఎక్జుక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కార్తికేయ శ్రీనివాస్ (వాసు) పని చేస్తున్నారు. నటినటుల్ని మిగతా సాంకేతిక వర్గాన్ని త్వరలోనే తెలియ జేస్తామని చిత్రం యూనిట్ తెలిపింది. రచన, దర్శకత్వం: రాజా దుస్సా నిర్మాతలు: గాలి కృష్ణ.



# ‘ది ఐ’తో హాలీవుడ్‌కు శృతిహాసన్

ప్రఖ్యాత భారతీయ నటి శ్రుతిహాసన్ డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన సైకలాజికల్ థ్రిల్లర్ ‘ది ఐ’తో గ్లోబల్ ఆడియెన్స్‌కు పరిచయం కాబోతోన్నారు. ఫిబ్రవరి 27 నుండి మార్చి 2, 2025 వరకు జరిగే హార్రర్, సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ చిత్రాలను 5వ వెంచ్ ఫిల్మ్ ఫెస్టివల్ గ్రాండ్‌గా జరగబోతోంది.ఈ ఈవెంట్ ప్రారంభ ఫీచర్‌గా ‘ది ఐ’ చిత్రం ఇండియా తరుపున ప్రీమియర్ కానుంది. దయానా (శృతి హాసన్) తన భర్త ఫెలిక్స్ (మార్క్ రౌలీ) కోసం చేసే ప్రయాణమే ఈ ‘ది ఐ’. చనిపోయిన తన భర్తను మళ్లీ తిరిగి తీసుకు వచ్చేందుకు వచ్చే ప్రయత్నాలు ఎంతో ఆసక్తిగా ఉండబోతోన్నాయని టీజర్ చూస్తేనే అర్థం అవుతోంది. తన భర్తను వెనక్కి తిరిగి తెచ్చుకునేందుకు భార్య చేసే త్యాగాలు ఏంటి? ప్రయత్నాలు ఏంటి? అన్నది ఆసక్తికరంగా మారింది. గ్రీస్, ఏథెన్స్, కోర్ఫులోని అందమ్కైన లొకేషన్‌లో చిత్రీకరించిన సీన్లు ఆడియెన్స్‌ను మెప్పించేలా ఉన్నాయి. 2023లో లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో, గ్రీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘ది ఐ’ని ప్రదర్శించిన తర్వాత ప్రాజెక్ట్‌పై అందరిలోనూ మరింతగా ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా శృతిహాసన్ మాట్లాడుతూ, సైకలాజికల్ థ్రిల్లర్‌లు ఎప్పుడూ నన్ను ఆకర్షిస్తూనే ఉంటాయి. మానవ భావోద్వేగాలు, దుఃఖం, అతీంద్రియ శక్తులు వంటి కాన్సెప్ట్‌లతో తీసే సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మొత్తం మహిళల నేతృత్వంలోని ప్రొడక్షన్ హౌస్‌లో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించడం విశేషం. చలనచిత్ర పరిశ్రమలో మహిళలకు మద్దతు ఇవ్వాలనే నా అభిరుచికి అనుగుణంగా ఈ ప్రాజెక్ట్ ఉంటుంది’ అని అన్నారు. డాఫ్నే ష్మోన్ మాట్లాడుతూ, ‘ది ఐ సినిమాలోని పాత్ర శృతి హాసన్‌కు అద్భుతంగా అనిపిస్తుంది. ఎమోషన్స్, సంఘర్షణ ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను చూపించే డయానా పాత్రలో శృతిహాసన్ చక్కగా నటించారు. శ్రుతిహాసన్ ఎంతో పొటెన్షియల్ ఉన్న నటి. ఈ పాత్రకు ఆమె న్యాయం చేశారు. ఆమె అద్భుతమ్కైన నటన ప్రేక్షకుల్కపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుంద’ని అన్నారు. పర్యా వరణానికి ఎలాంటి హాని కల్గించకుండా ఈ మూవీని షూట్ చేశారు. ప్రకృతిని హాని కల్గించకుండా సినిమాలుచేయడంలో భవిష్యత్ ప్రాజెక్ట్‌లకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుంది. వేలిముద్ర కంటెంట్ గురించి ఫింగర్ ప్రింట్ కంటెంట్ అనేది అద్భుతమైన కంటెంట్‌ను ఆడియెన్స్‌కు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తుంది. సామాజిక సమస్యలను తెర్కపెకి తీసుకు వచ్చి అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. చిత్రీకరించే విధానంలో మార్పును తీసుకురావడం, ప్రపంచంలోని అత్యంత ఉత్తేజకరమైన కథకులకు వారి లోతైన అభిరుచిని తీసుకురావడం, అసమానత, జాతి, లింగం బేధాలు లేకుండా అందరినీ అలరించేలా ప్రాజెక్ట్‌లు రూపొందించడమే లక్ష్యంగా వెళ్తోంది.




# ఎమోషనల్ హారర్ ఫిల్మ్ ‘శబ్ధం’

వైశాలితో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ ‘శబ్దం’ కోసం చేతులు కలిపారు. 7బి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్‌తో సినిమాపై క్యురియాసిటీ పెంచాయి. ఈ సినిమా ఫిబ్రవరి 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఆది పినిశెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. **‘శబ్ధం’ హారర్ సినిమాల్లో ఎంత డిఫరెంట్‌గా వుంటుంది?** శబ్ధం మంచి కథా బలం ఎమోషన్ వున్న హారర్ జోనర్ సినిమా. రెగ్యులర్ హారర్ సినిమాలకి చాలా భిన్నంగా వుంటుంది. ఆత్మలని ఒక సైంటిఫిక్ మెథడ్‌లో అన్వేషించే విధానం చాలా కొత్త అనుభూతిని ఇస్తుంది. స్క్రీన్ ప్లే చాలా ఇంట్రస్టింగ్‌గా వుంటుంది. ఇలాంటి సినిమాలు తీయడం కూడా కష్టమే. ఇలాంటి వరల్డ్‌ని ఇంతకు ముందు ఎవరూ చూపించలేదు. హారర్ సినిమాల్లో వైశాలి ఎంత డిఫరెంట్ సినిమానో శబ్ధం కూడా అంత డిఫరెంట్‌గా స్పెషల్‌గా వుంటుంది. టెక్నికల్‌గా సినిమా చాలా రిచ్‌గా వుంటుంది. **శబ్ధంలో సౌండ్ రోల్ ఏమిటి?** ఇందులో నాది పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్. తను ఆత్మలని సౌండ్‌తోనే పసిగడుతుంటాడు. సౌండ్ అనేది ప్రతి సీన్‌లో ఇంపార్టెన్స్ వుంటుంది. నిజానికి నేను ఆత్మలని నమ్మను. కానీ ఈ సినిమా కోసం మెటిరియల్ చదువుతున్నపుడు నిజంగా అలాంటి అదృశ్యశక్తులు ఉంటాయోమో అనిపించింది. **డైరెక్టర్ అరివళగన్ గురించి?** మా డైరెక్టర్ అరివళగన్‌కి థాంక్ యూ చెప్పాలి. వైశాలి ఇప్పుడు చూసిన రిలవెంట్‌గా వుంటుంది. కథలో వున్న నిజాయితీ అది. అదే నిజాయితీతో శబ్ధం తీశాం. వైశాలి సినిమా కూడా హారర్. అది నా కెరీర్ స్పెషల్ మూవీ. అలాగే శబ్ధం సినిమా కూడా స్పెషల్ మూవీ. మేము ఎప్పటినుంచో సినిమా చేయాలని అనుకున్నాం. వైశాలి లాంటి కొత్త కథ కాన్సెప్ట్ కుదరాలి. అలాంటి కథ శబ్ధంతో కుదిరింది. సినిమా థియేటర్స్ లో చూడాలనే ఆసక్తిని కలిగించేలా వుంటుంది. చాలా మంచి ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. **సిమ్రన్, లైలా పాత్రల గురించి?** సిమ్రన్, లైలా నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. వారి పాత్రలు సినిమాలో చాలా కీలకంగా వుంటాయి. క్యారెక్టర్స్ చాలా ఫ్రెష్‌గా అనిపిస్తాయి. **నాని సినిమా చూసి ఏమన్నారు?** తెలుగులో ఈ సినిమాని నానికే ఫస్ట్ చూపించాను. హారర్ జానర్ తనకి చాలా ఇష్టం. తనకి చాలా నచ్చింది. హార్ట్ ఫుల్‌గా బావుందని చెప్పారు. ఇలాంటి సినిమాలకి నాని లాంటి స్టార్ వర్డ్ చాలా ముఖ్యం. ఆయన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి రావడం మాకు చాలా హెల్ప్ అయ్యింది. **హారర్ సినిమాలు మీకు ఇష్టమా?** మంచి కథా బలం స్క్రీన్ ప్లే వున్న హారర్ సినిమాలని ఇష్టపడతాను. ఈ జోనర్‌లో సినిమాలు చేయడానికి ఇష్టపడతాను. **తమన్ మ్యూజిక్ గురించి?** ఇలాంటి సినిమాలకి మ్యూజిక్ చాలా ఇంపార్టెంట్. తమన్ మ్యూజిక్ మాకు చాలా ప్లస్ అయ్యింది. ఆయన పెద్ద సినిమాలు చేస్తూ కూడా మా సినిమాకి మ్యూజిక్ చేశారు. సినిమాకి ఎంతకావాలో అంతకంటే అద్భుతంగా చేశారు. సినిమా చూస్తున్నపుడు మ్యూజిక్‌ని చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాకి టెక్నికల్ టీం అద్భుతంగా పని చేసింది. సౌండ్ డిజైన్ చాలా అద్భుతంగా వుంది. కెమరామెన్ అరుణ్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. ఆర్ట్ వర్క్ కూడా మెస్మరైజింగా అనిపిస్తుంది. ప్రతి క్రాఫ్ట్ చాలా ప్రేమతో సినిమా చేశారు.



# లక్కీ భాస్కర్ టాప్ రికార్డ్

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం లక్కీ భాస్కర్. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అక్టోబర్ 31, 2024 న విడుదలైన థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందింది. బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించిన లక్కీ భాస్కర్, దుల్కర్ సల్మాన్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. తాజాగా ఈ చిత్రం మరో చరిత్ర సృష్టించింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో లక్కీ భాస్కర్ చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు బ్రహ్మరథం పడుతున్నారు. దాంతో నెట్‌ఫ్లిక్స్‌లో వరుసగా 13 వారాల పాటు ట్రెండ్ అయిన మొదటి దక్షిణ భారతీయ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. కట్టి పడేసే కథా కథనాలు, నటీనటుల అద్భుత నటన, సాంకేతిక నిపుణుల పనితీరు ఇలా అన్నీ తోడై లక్కీ భాస్కర్‌ను గొప్ప చిత్రంగా నిలిపాయి. అందుకే అప్పుడు థియేటర్లలో, ఇప్పుడు ఓటీటీలో ఈ స్థాయి స్పందన లభిస్తోంది. ఈ చిత్రం యొక్క వైవిద్యమైన కథాంశం, భాషతో సంబంధం లేకుండా అందరి మన్ననలు పొందుతోంది. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం కథకి ప్రాణం పోసింది. ఇక భాస్కర్ పాత్రలో ఒదిగిపోయిన దుల్కర్ సల్మాన్, తన అత్యుత్తమ నటనతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళారు. అలాగే చిత్రాన్ని ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయేలా చేశారు. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్‌ని ప్రదర్శించినప్పటి నుండి, లక్కీ భాస్కర్ చిత్రం స్ట్రీమింగ్ ట్రెండ్‌లలో ఆధిపత్యం చెలాయించింది. మిలియన్ల కొద్దీ వీక్షణలను పొందడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా ఎందరో ప్రేక్షకులకు అభిమాన చిత్రంగా మారింది. మొదటి వారంలో ఏకంగా 15 దేశాలలో నెట్‌ఫ్లిక్స్ యొక్క టాప్ 10లో మొదటి స్థానాన్ని పొందింది. అలాగే 17.8 బిలియన్ నిమిషాల వీక్షణలతో, రెండు వారాల పాటు ప్రపంచవ్యాప్తంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇక ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో వరుసగా 13 వారాల పాటు ట్రెండ్ అయిన తొలి సౌత్ ఇండియన్ సినిమాగా చరిత్ర సృష్టించింది. నెట్‌ఫ్లిక్స్‌లో లక్కీ భాస్కర్ చిత్రం సరికొత్త చరిత్ర సృష్టించడంతో చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. మీలో ఎవరైనా ఇంకా ఎవరైనా లక్కీ భాస్కర్ చిత్రాన్ని చూడనట్లయితే వెంటనే నెట్‌ఫ్లిక్స్‌లో వీక్షించి, భాస్కర్ ప్రయాణాన్ని ఆస్వాదించండి.



# మనసారా నవ్వేద్దాం !



నవ్వు నాలుగు విధాల మంచిది అని కొందరంటే, నవ్వు నాలుగు విధాల చేటు.. అని మరికొందరంటారు. మెడ.. ఎవరెలా అన్నా.. అందమైన చిరునవ్వు ముందు అన్నీ దిగదుడుపే అనడంలో సందేహం లేదు. ఎందుకంటే మనసారా నవ్వే ఓ చిరునవ్వు ఇచ్చే అనుభూతిని, ఆత్మవిశ్వాసాన్ని మారేది ఇవ్వలేదు. మరి, నవ్వుతో ఇంకా ఎలాంటి ప్రయోజనాలున్నాయో తెలుసుకుందామా?!

**ఆనందం... ఆత్మవిశ్వాసం...** మీరు నిజంగా ఆనందంగా ఉన్న విషయం మీ ముఖ కవళికల ద్వారా తెలిసిపోతుంది. నవ్వు "మనసుకి ప్రశాంతతని, ఆప్యాయతని కలిగిస్తుంది. మన ఇతరులు నవ్వుతూ పలకరిస్తే వారి. నుంచి జవాబు మరింత సానుకూలంగా వస్తుంది. మనలో ఆత్మవిశ్వాసం, ఆనందం రెట్టింపవుతాయి. మీ నవ్వు ద్వారానే మీలో ఉన్న సానుకూల గుణాలు బయటపడతాయి. దీనితో ఎదుటివారు కూడా మీకు నిజాయితీగా దగ్గరవుతారు. నవ్వు మన అందాన్ని ఇనుమడింపజేయడమే కాదు.. ఆరోగ్యం, పనిలో చురుకుదనాన్ని అందిస్తుంది. కళ ద్వారా ఎదుటివారి భావాలను ఎలా తెలుసుకోవచ్చో. అలాగే నవ్వుతో కూడా ఎదుటివారి భావాలు, ప్రవర్తనను ఇట్టే కనిపెట్టే యచ్చంటున్నారు నిపుణులు. అలాగే ఏదైనా చిన్న సమస్యల్లో ఉన్నప్పుడు ఓ చిరునవ్వు నవ్వితే చాలు.. మన సమస్యలన్నీ దూరమై మనసుకి ప్రశాంతత చేకూరుతుంది. ఇదే విధంగా ఇదేవిధంగా నవ్వుతో ఇతరుల సమస్యలను దూరం చేస్తూ వారిలో పాజిటివిటీని నింపచ్చు.



# ఆమె ధైర్యం ఎన్నో తరాలకు విజయం !

**ఒక మహిళ ధైర్యం చేసి ముందడుగు వేస్తే చాలు. తరవాత ఎన్నో తరాలు ఆమె బాటలో నిర్భయంగా సాగిపోతాయి. అందుకు సాంగ్వన్ కుటుంబమే ఉదాహరణ. ఒకటీ రెండూ కాదు. ఏకంగా నాలుగు తరాలు గెలుపు బాటపట్టాయి. ఊరికే స్ఫూర్తిగా నిలిచాయి. వాళ్ల కథేంటంటే..**



బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో కాక్‌పిట్‌లోకి ఆడుగుపెట్టింది 22 ఏళ్ల జెనిత్ గెహ్లోవత్, కూర్చున్న సీటుబెల్టు పెట్టుకుని, టేకాఫ్ అంతా సరిగా ఉందా అని సీరియస్‌గా చెక్ చేస్తోంది. పక్కనుంచి 'నిజంగా భయంగా లేదా అని అడుగుతున్నారు కోచ్. ' భయమెందుకు? చాలా ఉత్సాహంగా ప్రదర్శించా అని సమాధాన మిచ్చింది. తొలిసారి సోలోగా విమానం నడప బోతోందామె. అయినా భయం లేదు.(బామ్మ రాంచీకి 108 ఏళ్లు. పరుగులో ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టింది. జాతీయ అంతర్జాతీయ స్థాయుల్లో 300కుపైగా పతకాలు కొల్లగొట్టింది. అమ్మమ్మ సంతానం కూడా పరుగులో మేటే ప్రారంభించింది 2021లోనే అయినా పతకాలెన్నో గెలుచుకుంది. పచ్చని పొలాలు, ఇల్లే లోకంగా బతికిన వీళ్ల మలి వయసులో క్రీడాకారిణులయ్యారు. అందరి ధైర్యం.. షర్మిలా సాంగ్వన్. జెనిత్ వాళ్లమ్మ తను. వయసు 42 పన్నెండో తరగతి ఫలితాలు ఇంకా రానేలేదు... షర్మిలకి పెళ్లైంది. భర్త జైసింగ్ గెహ్లోవత్ బ్యాంకు ఉద్యోగి, జెనిత్‌కి అయిదేళ్లు, రెండోపాప జాస్మిన్ కడుపులో ఉండగా యాక్సిడెంట్‌లో ఆయన చనిపోయారు. ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దవాళ్లు తనపై ఆధారపడి ఉన్నారు. దీంతో బాధ దిగమింగుకుని భర్త ఉద్యోగంలో చేరారు షర్మిల పని కొత్త, దీనికితోడు వేధింపులు అయినా కుటుంబం కోసం తట్టుకుని నిలబడ్డాడు. నేర్చుకుంటూ ఉద్యోగంలో కొనసాగు తున్నారు. తన భర్తకి ఆమె ఏదైనా వాహనం నడిపితే చూడాలని కోరిక వ్యాపకంగా ఉంటుందని వాహనాలు నడపడం నేర్చుకున్నారు. ఆదామెకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఉద్యోగం చేస్తూనే భారీ వాహనాలు నడిపేవారు ఉద్యోగం ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో బస్‌గా చేరిన డ్రైవర్ షర్మిల బెస్ట్ డ్రైవర్ అవార్డు అందుకున్నారు. ఆత్మవిశ్వాసం తనవాళ్లకీ రావాలని తల్లినీ, బామ్మనీ ఆటల దిశగా ప్రోత్సహించారు. షర్మిల హరియాణ అనగానే అటలే గుర్తొస్తాయి కదా! కానీ వీళ్ల ఊరు జోజూ కాలాన్ మాత్రం వీటికి కాస్త దూరమే, దీంతో ఆటల పేరుతో రాంబీ, సంత్ర పరుగులు పెడుతోంటే ఊళ్లోవాళ్ళు అడ్డుకున్నారు. అయినవాళ్లు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. అయినా పర్మల వాటిని పట్టించుకోలేదు. అమ్మనీ, బామ్మనీ ట్రక్‌లో ఎక్కించుకుని మరీ వివిధ రాష్ట్రాల్లో పోటీలకే కాదు. అంతర్జాతీయ పోటీలకు తీసుకెళ్లారు రాంబీ ఇంటర్వ్యూ జాతీయ, అంతర్జాతీయ మీడియా పోటీపడ్డాడగానీ వాళ్లలో మార్పు రాలేదు. కూతుళలకు డ్రైవింగ్ నేర్పారు షర్మిల. చిన్న చిన్న కారు కాదు. టూరీ వాహనాలపై శిక్షణ ఇచ్చేవారు. అంత పెద్ద వాహనం తన ఆధీనంలో ఉందన్న ఆలోచనని ఇష్టపడవారమె జెనిత్‌కీ అదే అలవాటైంది. అయితే తన మరో అడుగు ముందుకేసి విమానాన్ని ఎంచుకుంది. తాజాగా ఆ శిక్షణలోనే ఉందామె ఇంకొన్ని నెలల్లో పైలట్ శిక్షణ పూర్తి చేసుకుంటుంది తను. అనారోగ్యం కారణంగా ప్రస్తుతం రాంచీ పోటీల్లో పాల్గొనలేదు కానీ ఈ నాలుగు తరాల సాంగ్వన్ కుటుంబం మాత్రం అప్పటిదాకా తెలియని ఆ ఊరుని ప్రపంచానికి పరిచయం చేసింది. ఒకప్పుడు పరువు తీస్తున్నారన్నవాళ్లే వాళ్లని పొగుడుతున్నారు. ఇంతటి పోరాటం చేసిన అమ్మ, ఘనత సాధించిన అమ్మమ్మ, బామ్మలు ఉన్నారు కాబట్టి, జెనిత్ అంత వైద్యం ఉద్యోగంలో చేరినప్పుడు, స్టీరింగ్ చేతిలో పట్టినప్పుడు మహిళవి... ఇవన్నీ నీకు కాయచేవారు. ఓవైపు ఒంటరినయ్యాననే బాధ అలాగని నాపై ఆధార పడిన కుటుంబాన్ని వదిలేయలేను. అందుకే ఎవరేమన్నా పట్టించుకోలేదు. ఎప్పుడైనా ఎవరైనా నిన్ను అడ్డుకుంటున్నప్పుడే మరింత ప్రయత్నించాలి. కాదన్న వారికి నిరూపించి చూపాలి. నేను నమ్మిన 'సూత్రమిది' అంటారు షర్మిల, కూతుళ్లకే ఇదే మారిపోయింది. కాబట్టి వాళ్లకే భయమన్నది తెలియదు. రెండో కూతురు జాస్మిన్ ఆటలతో పాటు కెరియర్ని ఎంచుకునే పనిలో ఉంది. అన్నట్లూ షర్మిల క్రీడాకారిణి కూడా. ఆమెకి కొత్తగా ఓ కోరిక. తనూ విమానం నడపాలని ఆదీ సాదుస్తారేమో.




# సైకిల్ సింకింగ్ ప్రయత్నించారా?

పీరియడ్..

**చాలామంది అమ్మాయిల మూడ్ స్వింగ్స్, పొత్తికడుపు నొప్పి, చిరాకు వంటి వాటితో ఇబ్బందిపడే సమయమిది. ఎంత బాధ చూస్తుంది 'ప్రతినెలా ఇది మామూలే కదా' అనుకుంటూ మౌనంగా భరిస్తూ ఉంటారు. కానీ, ఆ అవసరం లేదంటున్నారు. నిపుణులు. అందుకోసం "సైకిల్ సింకింగ్‌ను ప్రయత్నించమంటున్నారు. ఇంతకీ ఈ కొత్త ట్రెండేంటో తెలుసుకుందామా?**

సైకిల్ సింకింగ్ ప్రధాన ఉద్దేశం... నెలసరి శారీరకంగా, మానసికంగా మనల్ని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకుంటూ దానికి తగ్గట్లు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. అందుకోసం ముందుగా రుతు చక్రాన్ని అర్థం చేసు కోవాలి. సాధారణంగా మహిళల రుతుచక్ర కాలం సరాసరి 28రోజులు దీన్లో 4 దశలు ఉంటాయి. వాటి ప్రకారం ట్రెండ్ ఫాలో అయ్యే వాళ్లు ఏం చేస్తారంటే..



**ఫాలిక్యులర్ దశ...** ఈ సమయంలో విడుదలైన అండాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. ఈ దశ 14 రోజుల వరకూ అంటే పీరియడ్ మొదటిరోజు నుంచీ మొదలవుతుంది. ఈస్ట్రోజన్ స్థాయులు ఎక్కువగా ఉంటాయి ఈ దశలో మెటబాలిజం వేగంగా ఉండదు. కాబట్టి తేలికైన ఆహారాలు తింటారు. సలాడ్లు, కూరగాయలు, నాట్స్, ఆలివ్ ఆయిల్, కాఫీ, టీ వంటివాటికి ప్రాధాన్యమిస్తారు.

**ఒవ్యులేషన్ ..** అండాశయం నుంచి అండాలు విడుదలయ్యే దశ ఇది 14లేదా 16వ రోజు ఇది జరుగుతుంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్, టెస్టోస్టెరాన్‌లు ఎక్కువగా ఉత్పత్తవుతాయి. ఇప్పుడే మన శరీరంలో ఒక్కసారిగా శక్తిస్థాయులు పెరుగుతాయి. ఉల్లాసంగా ఉంటాం. ఈ సమయంలో కాస్త కష్టతరంగా ఉండే రన్నింగ్, సైక్లింగ్ వర్కవుట్లను ప్రయత్నించారు. ఈ దశలో ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తింటారు. తాజా ఆకుకూరలు, బ్రాకలీ, నట్స్, ఓట్స్ లాంటివాటిని డైట్‌లో చేర్చుకుంటారు.

**లూటియల్ దశ...** గర్భధారణ కోసం గర్భాశయాన్ని శరీరం సిద్ధం చేసే దశ ఇది 15-28 రోజులు ఉంటుంది. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టారాన్ హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి శరీరంలో శక్తి అంతా చివర్లో స్ట్రా వేసుకుని పీల్చేసినట్లు ఒక్కసారిగా అలసట ఆవహిస్తుంది. ఇక పీరియడ్ ప్రారంభమయ్యే కొద్దిరోజుల ముందు ఈస్ట్రోజన్, ప్రొజెస్టారాన్ స్థాయులు పడిపోయి... ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్(పీఎమ్ఎస్) లక్షణాలు మొదలవుతాయి. ఇందులో భాగంగా బరువు పెరగడం, భావోద్వేగాల్లో మార్పులు, నిద్రలేమి, తలనొప్పి లాంటివి కొందరిలో ఉంటాయి. ఫుడ్ క్రేవింగ్స్ అధికంగా ఉంటాయి కాబట్టి, తృణ ధాన్యాలతో చేసిన ఆహారం, బీన్స్‌లాటివి తింటూ, తేలికగా ఉండే వ్యాయా మాలను ఎంచుకుంటారు సైకిల్ సింకింగ్ వల్ల హార్మోన్ల సమతులవుతాయి. యాకే. పీరియడ్ సమయంలో వచ్చే నొప్పి తగ్గుతుంది.

**మెన్‌స్టువేషన్ :** పీరియడ్ సమయం.. ఈ ఐదు రోజులు హార్మోన్ల స్థాయులు తక్కువగా ఉంటాయి. బ్లీడింగ్ కాళ్లు లాగడం.. వంటివి ఉంటాయి. వీటినుంచి ఉపశమనం పొందడానికి ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఐరన్, విటమిన్ సి, కె అధికంగా ఉన్న ఆహారాలు ఎక్కువగా తింటారు. తేలికైన వ్యాయామాలు యోగా3, పిటాటీస్ వంటివి చేస్తారు. నీళ్లు అధికంగా తాగుతారు.

# యాపిల్ షీరా

**కావలసినవి:**

ఊదలు లేదా మరేవైనా మిల్లెట్లు ముప్పావు కప్పు, యాపిల్‌పండ్లు 2, చిక్కటి పాలు ఒకటిన్నర కప్పు, బెల్లం పొడి అర కప్పు, నెయ్యి పావు కప్పు, యాలకుల పొడి ఆ చెంచా, కుంకుమపువ్వు కొద్దిగా, డ్రైఫ్రూట్స్ పలుకులు 2 టేబుల్ స్పూన్లు

**తయారీ:** కడిగి ఎండబెట్టిన మిల్లెట్లను దొరగా వేయించి, బరకగా గ్రైండ్ చేయాలి. యాపిల్స్ చెక్కు గింజలు తీసి గుజ్జు చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నెయ్యి వేడి చేయాలి. అందులో యాపిల్ గుజ్జు, మిల్లెట్ల రవ్వ, బెల్లం పొడి, కుంకుమపువ్వు, యాలకుల పొడి వేసి కలియతిప్పుతూ సన్న సెగ మీద ఉడికించాలి. చివర్లో డ్రైఫ్రూట్స్ పలుకులు జోడించి సెగ తీయాలి.



# వారిపై ఒత్తిడి చేయొద్దు..

పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు ఆశలు ఉండటం మామూలే. అందుకే, వారు సరిగా చదవడం లేదని తెలిసినా, మార్కులు రాకపోయినా.. మనం ఆందోళన చెందుతుంటాం. వాళ్లపైనా ఒత్తిడి పెడు తుంటాం. దీనివల్ల కోరుకున్న ఫలితం రాకపోగా అనర్థాలే ఎక్కువంటున్నారు మానసిక నిపుణులు. చిన్నప్పుడు తాము అనుకున్న కలలు నెరవేరక వాటిని బిడ్డల ద్వారా నెరవేర్చుకోవాలనుకుంటారు చాలా మంది. అందుకే, నువ్వు డాక్టర్‌వి కావాలి, ఇంజినీర్‌వి అవ్వాలి అంటూ లక్ష్యాలు పెడతారు. అవి వాళ్లకి నచ్చితే సరి. లేక పోతే... ఎలా? మీలా వాళ్లూ వాళ్ల పిల్లల ద్వారా తీర్చుకోవాలా? కాదు. ముందు పిల్లల సామర్థ్యం, తర్వాత వారి అభిరుచి అర్థం చేసుకున్నాకే... కెరియర్ని నిర్ణయిం చండి. అప్పుడే ఉన్నతంగా ఎదగగలరు.



◆ అభిరుచులు ఉండటం, ఆసక్తి చూపించడం, ప్రతిభ కనబరచడం... వంటి వాటితోనే ఆయా రంగాల్లో సులువుగా రాణించొచ్చు అనుకుంటారు పిల్లలు. కానీ, ఏది అంత సులువుగా పట్టు చిక్కదనే విషయం వాళ్లకి అర్థమయ్యేలా వివరించాలి. వివిధ రంగాల్లోని విజేతల కృషి అర్థమయ్యేలా చెప్పాలి. సంబంధిత వీడియోలు చూపించాలి. అప్పుడే అపజయాలు ఎదురైనా తడబడరు. కష్టమని వెనుదిరగరు. అయితే, ఈ కోరిక వాళ్ల చిన్న చిన్న విజయాలను కూడా మీరు గుర్తించి ప్రోత్సహించాలి. అప్పుడే ఉత్సాహంగా ముందుకెళ్తారు.

◆ చిన్నప్పటి నుంచీ చూడు 'బంటీ రోజూ పొద్దున్నే లేచి చదువుతాడు... నువ్వు ఎప్పుడూ ఆటలే', 'చూడు నీతోటిది అక్షరం... తనెప్పుడూ మంచి మార్కులు తెచ్చుకుంటుంది'.... అంటూ పిల్లల్ని తోటివాళ్లతో పోల్చి చూపించే తల్లిదండ్రులు చాలామందే. అయితే, ఇలా ప్రతి విషయాన్నీ పోల్చి చూపడం వారిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది అంటున్నాయి పలు అధ్యయనాలు. బదులుగా ఎవరికి వాళ్ళు తమని తాము తెలుసుకునేలా చేయండి. వారు ముందుకెళ్లడానికి అడ్డుపడుతోన్న కారణాలను అధిగమించడానికి సాయపడండి. ఈ క్రమంలో ఎప్పుడైనా వెనకబడినా, ఓడిపోయినా... పోయేదేం లేదు. ప్రయత్నలోపం లేకుండా చూసుకోవడమే ముఖ్యమని వారికి అర్థమైతే చాలు. లోపాల్ని సరిదిద్దుకుని ముందడుగు వేయగలరు.

# ఉంగరాల జుట్టు సంరక్షణ ఇలా !



జుట్టు సిల్కీగా ఉన్న వారికి కర్లీగా ఉంటే బాగుంటుందనిపిస్తుంది.. అదే కర్లీ హెయిర్ ఉన్న వాళ్లేమో 'ఈ నిండిన జుట్టు నా వల్ల కాదు బాబోయ్ ' అంటూ సిల్కీ జుట్టును కోరుకుంటారు. నిజానికి ఎవరి జుట్టు తత్వం వారికి నచ్చదు. అయితే ఉంగరాల జుట్టు సాధారణంగానే పొడిగా ఉంటుంది. దాంతో నిర్జీవంగా కనిపిస్తుంది.. మెయింటెయిన్ చేయడం కూడా కొందరికి కష్టంగా అనిపిస్తుంది. ఇలాంటప్పుడు కొన్ని సింపుల్ చిట్కాలు పాటిస్తే కర్లీ హెయిర్ అందంగా కనిపించేలా చేయచ్చంటున్నారు నిపుణులు.

✦. కొంతమందికి రోజు తలస్నానం చేసే అలవాటు, కర్లీ హెయిర్ ఉన్న వారు కొందరు ఇలాగే ఉంటారు. దీనివల్ల జుట్టు మరింత పొడిబారుతుందంటున్నారు నిపుణులు. అది కూడా గాఢత తక్కువగా షాంపూని నీళ్లలో కలుపుకోసి చేయడం మంచిదని చెబుతున్నారు.

✦ తలస్నానం తర్వాత నాణ్యమైన కుడిషనర్‌ను రాయడం మర్చిపోవద్దు. ఇది కేశాలంకరణ పొడిబారిపోకండా చేస్తుంది. అలాగే తలస్నానానికి వేడి నీళ్లు కాకుండా గోరువెచ్చటి లేదంటే చల్లటి నీళ్లు ఉపయోగించడం మంచిది.



✦ కర్లీ హెయిర్ సంరక్షణ కోసం వారానికి మూడుసార్లు నూనె పెట్టుకోమంటున్నారు. నిపుణులు. ఈ కొబ్బరి నూనెను కుదుళ్ల, వెంట్రుకలకు అప్లై చేసి కాసేపు మర్దన చేయాలి ఇలా రాత్రిళ్లు నూనె పెట్టుకొని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేస్తే జిడ్డుగా కూడా అనిపించదు.

✦ ఒకవేళ ఇలా నూనె పెట్టుకున్న మరుసటి రోజు తలస్నానం చేయకపోతే.. జెల్ ఆధారిత కండిషనడిని కొద్దిగా తీసుకొని జుట్టుకు పట్టించాలి. ఇలా చేయడం ద్వారా నూనె వల్ల జుట్టు కప్పుగా అనిపించకుండా జాగ్రత్తపడచ్చు.

✦ తడిగా ఉన్న జుట్టును దువ్వడం. టవల్ గట్టిగా రుద్దుతూ తుడవడం, డ్రయర్‌తో అరబెట్టడం వంటివి అస్సలు చేయకూడదు. ఎందుకంటే ఇవి జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. మెత్తటి కాటన్ క్లాత్‌తో జుట్టును పొడిగా తుడుచుకొని ఆరిన తర్వాత చెక్క దువ్వెనతో చిక్కు తీసుకోవడం మంచిది.



✦ తడిగా ఉన్న కర్లీ హెయిర్‌ను బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే ముడేయడం.. వంటివి చేసేనత జుట్టు చివర్లు చిట్లిపోయే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు కాబట్టి జుట్టును ముడేసే ముందు సహజసిద్ధంగా ఆరనివ్వడం ఉత్తమం.

✦. షియా బటర్, నువ్వులనూనె వంటివి కర్లీ హెయిర్ సంరక్షణకు చక్కగా ఉపయోగపడతాయి.

✦ మనం రోజూ తాగే టీ/కాఫీ మన శరీరాన్నే కాదు.. జుట్టునూ పొడిబారిపోయేలా చేస్తుంది. కాబట్టి వీటికి బదులుగా, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నీటి శాతం ఎక్కువగా ఉండే కీరా, పుచ్చకాయ వంటి పండ్లు, కాయగూరలు తీసుకోవడం మంచిది.



✦ ఉంగరాల జుట్టు పొడిబారకుండా సహజసిద్ధంగా తయారుచేసుకున్న హెయిర్ స్ప్రే కూడా చక్కగా పనిచేస్తుంది. ఈ విధంగా ఒక స్ప్రే బాటిల్లో డిస్టిల్డ్ వాటర్ నింపి అందులో కొన్ని చుక్కల చొప్పున వెజిటబుల్ ఆయిల్, రోజ్ మేరీ ఆయిల్, లావెండర్ నూనె, వేసి ఒకసారి షేక్ చేసి పెట్టుకోవాలి. దీన్ని జుట్టుపై అప్పుడప్పుడూ స్ప్రే చేస్తుండడం వల్ల జుట్టు పొడిబారకుండా పట్టులా కనిపిస్తుంది.. ప్రకాశవంతంగా మెరిసిపోతుంది కూడా!

# నైవేద్యం

మొదటగా దైవానికిచ్చే సమర్పణ నైవేద్యం. ఇది సంస్కృత పదం. ఏదైనా తాము స్వీకరించుట కంటే ముందు భగవంతునికి నివేదించడమే నైవేద్యంగా చెప్పబడింది. అది కేవలం ఆహార పదార్థమో, వస్తువో మాత్రమే కానవసరం లేదు. మనస్ఫూర్తిగా దేవునికి అర్పించాలని భావించే విషయం ఏదైనా కావచ్చును. దానికి తాహతు, పరిమితులంటూ ఏమీ లేవు.పూజ కూడా నివేదనే. శ్రద్ధాసక్తులతో మమేకమై అర్చించే ఫలం, పుష్పం, తోయం, శుచిగా వండిన పదార్థములు మాత్రమే కాదు, శక్తి, భక్తి, అనురక్తితో అలౌకిక తాదాత్మ్యంతో దేన్నైనా భగవదర్పణం చేయవచ్చు.గోదాదేవి పాశురాలను, అన్నమయ్య పద సంకీర్తనలను అర్పిస్తే, కుబ్జ పూలను, కుచేలుడు అటుకులను ప్రీతితో సమర్పించారు. గోపికలు నవనీతాన్ని సమర్పించుకున్నారు. ఎవరు దేన్నయితే అత్యంత అనురక్తితో నివేదిస్తారో అదే వాళ్ళకు ప్రాప్తమోతుంది. ద్రౌపది ఎంతో స్నేహంతో గాయపడిన శ్రీకృష్ణుని వేలికి తన వస్త్రం చింపి చుట్టింది. అందుకే వస్త్రాపహారణం నుంచీ సురక్షితంగా కాపాడబడింది. కుచేలుడు సంపదను, కుబ్జ అందాన్ని, అన్నమయ్య మోక్షాన్ని, గోపికలు నవనీతమంటి భగవంతుని మనసును పొందగలిగారు.అలాగే కవులు కావ్య కన్యకలను, నర్తకులు నాట్యాన్ని, గానగాంధర్వులు గాత్రాన్ని, హరికథలు, నామస్మరణ వంటి అనేక మార్గాలలో దేవ దేవుని ప్రసన్నం చేసుకోవచ్చు. ఎంచుకునే రీతులేవైనా ఏకాగ్రతతో కూడిన అశేష భక్తితత్పరత ముఖ్యం. నృసిహ్మావతారంలో బాలుడ్ని అనుగ్రహించి, రామావతారంలో ఎంగిలి పళ్ళు రుచిచూసి, వేంకటేశ్వరుడై మట్టి తులసి దళాలకే ముక్తినొసగి తన అపార కరుణా కటాక్షాలను భక్తులపై కురిపించాడు భగవంతుడు. భగవంతుడంటేనే విశ్వవ్యాప్తమైన స్వరూపం. అలాగే అనంత కరుణా సాగరుడు. తలచిన చాలు, పిలచిన చాలు ఏదో ఒక రూపంలో ఆదుకోను ఆఘమేఘాలపై వస్తాడు. చేతుల్లో శంఖ చక్రాలు లేకున్నా, ఆదిశేషునికైనా అనుమానం రానివ్వక, ఆది లక్ష్మికైనా తెలియజేయక గజేంద్రమోక్షమిచ్చిన కరివరదుడు భక్తకోటి మానసములనే కైమోడ్చి ప్రణమిల్లి నివేదింపగా అందుకోను తప్పక వస్తాడు. ఆపదమ్రొక్కులు తీర్చు ఆనందనిలయుడై ఆదరిస్తాడు. ఇక్కడ భగవంతుడు అంటే మానవుడే మాధవుడైనపుడు దేహమే కదా దేవాలయం. ఆదుకోగల శక్తి వుండి ఆర్తులు ఎదురైతే చేతనైన సాయం ఏ రూపంలో చేసినా అదీ నైవేద్యమే. దానివల్ల కలిగే ఆత్మ సంతృప్తినే మనం పొందే వరం కావచ్చు. అది అందరిలో మనల్ని మంచితనంగా పరిచయం చేసి ఎన్నో ప్రయోజనాలను కలిగించవచ్చు. అది భగవత్సహాయం అని ఎందుకనుకోకూడదు? అప్పుడు సర్వం జగన్నాథమే. సమస్తం కృష్ణార్పణమే.

**- డేగల అనితాసూరి.**



ఆధ్యాత్మికం

# నూనె చిలకరిద్దామా !



సదుపాయాలూ సౌఖ్యాన్నిచ్చే పరికరాలు ఉంటే వంట చాలా సులువవుతుంది. అందుకోసం మార్కెట్లో ఎప్పటికప్పుడు కొత్త గాడ్జెట్స్ వస్తున్నాయి. అలాంటిదే ఆయిల్ స్ప్రేయర్ బాటిల్. కూరగాయ ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రైస్, దోశలు మొదలైన వాటి మీద నూనెను గరిటెతో వేయడం కాకుండా చిలకరించినట్లు వేయాల్సి వస్తుంది. అలాంట ప్పుడు ఆయిల్ స్ప్రేయర్ గనుక ఉందంటే చాలా సౌకర్యంగా ఉంటుంది. తక్కువ నూనెతో వంట పూర్తయిపోతుంది.



## రచనలకు ఆహ్వానం

మార్చినెల అనగానే **'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'** అని మనకందరికీ తెలిసిందే. మహిళలు అన్నిరంగాల్లో శరవేగంగా ముందుకు దూసుకెళ్తున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, శాస్త్ర, సాంకేతిక, సైన్యం తదితర రంగాల్లో స్త్రీలు సాధిస్తున్న విజయాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై రచనలు రాసి మాకు పంపండి. సొంతంగా రాసిన రచనలుగా ఉండాలి, కాపీ కొట్టినవిగా ఉండకూడదు. ఆసక్తిగల వారు వెంటనే పంపగలరు.

మా చిరునామా: 'చెలి', వార్త, ఎడిటర్, 396, లోయర్‌ట్యాంక్‌బండ్, హైదరాబాద్, తెలంగాణ. ఈ మెయిల్ :cheli@vaartha.com

టి20 సిరీస్:




# విజేత జింబాబ్వే

## వర్షంతో ఐర్లాండ్ చివరి మ్యాచ్ రద్దు

**న్యూఢిల్లీ:** సొంత గడ్డపై ఐర్లాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌పే జింబాబ్వే కైవసం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి పోరు వర్షం కారణంగా రద్దు కాగా, జింబాబ్వే 1-0తో సిరీస్ చేజిక్కించుకుంది. తొలి మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయింది. రెండో టి20లో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక చివరి టి20లో మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 18 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (27 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), టోనీ (26), తషింగా (26 నాటౌట్) రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో క్రెయిగ్ యంగ్, గారెత్ డెలానీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఐర్లాండ్ జట్టు లక్ష్యఛేదనకు దిగకముందే భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్ సాధ్యపడలేదు. ఫలితంగా జింబాబ్వేకు సిరీస్ దక్కింది. ఈ పర్యటనలో భాగంగా తొలుత జరిగిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ జట్టు విజయం సాధించగా, అనంతరం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జింబాబ్వే 2-1తో గెలుపొందింది.



# టెన్నిస్ ఛాలెంజర్స్ టోర్నీ: క్వార్టర్ ఫైనల్లోకి భారత్ జోడీ

**న్యూఢిల్లీ:** బెంగళూరు ఓపెన్ ఏటీపీ-125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత్ జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. వరుస సెట్లలో గెలిచిన భారత జోడీ మైనేని సాకేత్-రామ్‌మార్ రామనాథన్ అనూహ్యంగా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాకేత్-రామ్ ద్వయం 6-3, 7-6 (7/4)తో ఇటలీకి చెందిన జాకోపో బెరెటిని-ఎన్రికో డల్లా వాలె జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్ జోడీ తొమ్మిది ఏస్లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్, భారత్ స్టార్ అనిరుధ్ చంద్రశేఖర్- చైనీస్ తైపీకి చెందిన రేహో 6-4, 6-4తో భారత్ ప్లేయర్ గంటా సాయి కార్తీక్‌రెడ్డి-ఉజ్బెకిస్తాన్‌కు చెందిన సుల్తానోవ్‌లపై, భారత్‌కు చెందిన సిద్ధాంత్-పరీక్షిత్ సొమాని 6-4, 6-3తో భారత్ ప్లేయర్ నికీకలియంద పునాచా-జింబాబ్వేకు చెందిన జాన్ లాక్‌లపై, ప్రజ్వల్ దేవ్-ఆర్యన్ షా (భారత్) 4-6, 6-3, 10-6తో ఎంజో కుకాడో (ఫ్రాన్స్)-మైకేల్ గీర్ట్స్ (బెల్జియం)లపై, ఆదిల్ కల్యాణ్‌పూర్-కరణ్ సింగ్ (భారత్) 1-6, 6-2, 10-4తో నితిన్ కుమార్ సిన్హా-మనీశ్ సురేశ్‌మార్ (భారత్)లపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

# పాక్ చెత్త రికార్డు

## వర్షంతో బంగ్లాతో మ్యాచ్ రద్దు

### ఛాంపియన్స్ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా గెలవని దాయాది

**న్యూఢిల్లీ:** ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ-2025లో ఒక్క మ్యాచ్ అయినా గెలవకుండా చెత్త రికార్డు సాధించింది. కనీసం ఒక్క మ్యాచ్ అయినా గెలవాలన్న పాకిస్తాన్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. రావల్పిండిలో ఎడతెగని చినుకుల కారణంగా టాస్ పడకుండానే పాక్ బంగ్లా మ్యాచ్ ముగిసిపోయింది. దీంతో పాక్ బంగ్లాదేశ్ మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ రద్దయింది. ఫలితంగా ఇరు జట్లకు చెరో పాయింట్ వచ్చింది. ఈ క్రమంలో డిఫెండింగ్ చాంపియన్‌గా ఈ వన్డే టోర్నమెంట్ బరిలో దిగిన పాకిస్తాన్



పేరిట ఓ చెత్త రికార్డు నమోదైంది. కాగా 2017 తర్వాత చాంపియన్స్ ట్రోఫీ టోర్నీ జరగటం ఇదే తొలిసారి. నాడు టైటిల్ గెలిచిన పాకిస్తాన్ ఈ సారి ఈ మెగా ఈవెంట్ ఆతిథ్య హక్కులను సంపాదించింది. వన్డే వరల్డ్ కప్-2023లో చెత్త ప్రదర్శన కనబరిచినా, ఆతిథ్య జట్టు హోదాలో ఛాంపియన్స్ ట్రోఫీకి నేరుగా అర్హత సాధించింది. ఇక ఎ గ్రూప్‌లో తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ న్యూజిలాండ్ తలపడ్డాయి. ఇందులో కివీస్ జట్టు గెలిచింది. అనంతరం పాకిస్తాన్ దాయాది టీమిండియాతో పోరులోనూ ఓడిపోయింది. ఈ క్రమంలో సెమీస్ చేరే అవకాశాన్ని పోగొట్టుకున్న రిజ్వాన్ బృందం, కనీసం గురువారం జరిగే ఆఖరి మ్యాచ్‌లో నైనా గెలిచి పరువు నిలుపు కోవాలని భావించింది. లీగ్ దశలో చివరగా బంగ్లాదేశ్తో గురువారం మ్యాచ్ ఆడేందుకు సిద్ధంకాగా వర్షం రూపంలో చేదు అనుభవం ఎదురైంది. ఈ క్రమంలో నిబంధనల ప్రకా ప్రరం ఇరుజట్లకు చెరో పాయింట్ వచ్చింది. దీంతో గ్రూప్ ఎ పాయింట్ల పట్టికలో అట్టడుగున నాలుగో స్థానంతో టోర్నీని ముగించింది. ఈ నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో గ్రూప్ దశ (2002 నుంచి) ప్రవే ప్రశపెట్టిన తర్వాత ఒక్క విజయం కూడా సాధించకుండా, అదేవిధంగా పాయింట్ల పట్టికలో ఆఖరున నిలిచిన తొలి జట్టుగా పాకిస్తాన్ చెత్త రికార్డు మూటగట్టుకుంది.







# సెమీస్‌కు చేరేదెవరు?

## ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ బిలో ఇంకా మిస్టరీ

### మూడు జట్ల మధ్య ఉత్కంఠ

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో సెమీ ఫైనల్ సినారియో ఇంట్రెస్టింగ్‌గా మారింది. గ్రూప్‌ఏ నుంచి ఇండియా, న్యూజిలాండ్ జట్లు ఇప్పటికే సెమీస్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఇదే గ్రూప్‌లోని పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక గ్రూప్ బీ నుంచి మాత్రం ఇంకా ఒక్క టీమ్ కూడా సెమీ ఫైనల్‌కు చేరలేదు. కానీ, ఆ గ్రూప్ నుంచి ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే ఎలిమినేట్ అయింది. ఇక రెండు సెమీస్ బెర్త్‌ల కోసం ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ పోటీ పడుతున్నాయి. ఈ నెల 26న ఇంగ్లండ్‌ను ఓడించిన ఆఫ్ఘాన్ సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ఒక వేళ ఆఫ్ఘాన్ సెమీస్ చేరాలంటే ఈ నెల 28న ఆస్ట్రేలియాపై గెలిచి తీరాలి. ఒక వేళ ఓడితే మాత్రం ఆఫ్ఘాన్ ఇంటికి, ఆసీస్ సెమీస్‌కు చేరుతాయి. ఆసీస్‌తో పాటు సౌతాఫ్రికా కూడా సెమీస్‌కు వెళ్తుంది. ఇక ఇప్పటి వరకు ఉన్న పాయింట్ల పట్టికను చూస్తే ఆసీస్, సౌతాఫ్రికా మూడేసి పాయింట్లతో ఒకటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆఫ్ఘాన్ రెండు పాయింట్లతో మూడో ప్లేస్‌లో ఉంది. ఈ నేపథ్యంలో సెమీ ఫైనల్‌లో టీమిండియాకు ఎవరు పోటీకి వస్తారనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఆఫ్ఘానిస్థాన్‌పై ఆస్ట్రేలియా గెలిస్తే 5 పాయింట్లతో సెమీస్ చేరుతుంది. ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే ఆ జట్టు కూడా ఐదు పాయింట్ల సెమీస్ చేరుతుంది. అయితే రన్‌రేట్ ఆధారంగా గ్రూప్ బీ టాపర్ ఎవరనేది తేలుతుంది. ఒక వేళ ఆస్ట్రేలియాపై ఆఫ్ఘాన్ గెలిచి, ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే. సౌతాఫ్రికా ఫస్ట్ ప్లేస్‌లో, ఆఫ్ఘాన్ సెకండ్ ప్లేస్‌లో సెమీస్‌కు చేరుతాయి. మరోవైపు గ్రూప్‌ఏలో ఇండియాన్యూజిలాండ్ మధ్య ఒక మ్యాచ్ మిగిలి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్‌ఏ టాపర్‌గా, ఓడిన జట్టు సెకండ్ ప్లేస్‌లో సెమీస్‌కు చేరుతాయి. గ్రూప్‌ఏ టాపర్, గ్రూప్ బీ సెకండ్ ప్లేస్‌లో ఉన్న టీమ్ మధ్య తొలి సెమీస్ ఫైనల్ జరుగుతుంది. అలాగే గ్రూప్ బీ టాపర్, గ్రూప్ ఏ సెకండ్ ప్లేస్‌లో నిలిచిన జట్ల మధ్య రెండో సెమీ ఫైనల్ జరుగుతుంది. సో టీమిండియా మార్చి 2న న్యూజిలాండ్‌పై గెలిస్తే సెమీస్‌లో ఆస్ట్రేలియా లేదా సౌతాఫ్రికాతో తలపడాల్సి ఉంటుంది. ఆఫ్ఘాన్‌తో కూడా తలపడే అవకాశం ఉంది కానీ, దానికి చాలా సమీకరణాలు కలిసి రావాలి. ఆఫ్గాన్ చేతిలో ఆస్ట్రేలియా ఓడిపోయి, ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా గెలిస్తే. గ్రూప్ బీ నుంచి ఫస్ట్ ప్లేస్‌లో సౌతాఫ్రికా, రెండో ప్లేస్‌లో ఆఫ్ఘాన్ సెమీస్‌కు వస్తాయి. అప్పుడు ఇండియా వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య తొలి సెమీ ఫైనల్ జరుగుతుంది. అలా కాకుండా న్యూజిలాండ్ చేతిలో టీమిండియా ఓడిపోతే. గ్రూప్ ఏ నుంచి రెండో ప్లేస్‌లో ఇండియా సెమీస్‌కు చేరుతుంది. అప్పుడు కూడా ఆఫ్ఘాన్‌తో సెమీస్ ఆడాలంటే, ఆసీస్‌పై ఆఫ్ఘాన్ గెలవాలి, ఇంగ్లండ్ చేతిలో సౌతాఫ్రికా ఓడిపోవాలి. అప్పుడు ఆఫ్ఘాన్ గ్రూప్ బీ నుంచి ఫస్ట్ ప్లేస్‌లో, ఆసీస్, సౌతాఫ్రికా జట్లు మూడేసి పాయింట్లతో ఉంటాయి కాబట్టి వాటిలో మెరుగైన రన్‌రేట్ ఉన్న టీమ్ రెండో ప్లేస్‌లో సెమీస్ చేరుతుంది. అప్పుడు. గ్రూప్‌బీ టాపర్‌గా ఆఫ్ఘాన్, గ్రూప్‌ఏ సెకండ్ ప్లేస్‌లో ఉన్న టీమిండియా మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఇలా అనేక ఈక్వేషన్ల మధ్య టీమిండియాకు సెమీస్‌లో ఆసీస్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ ఇలా ఎవరైనా రావొచ్చు.

# ముంబయి ఇండియన్స్ హ్యాట్రిక్

## మహిళల ప్రీమియర్ లీగ్‌లో యుపి వారియర్స్‌పై గెలుపు


**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. బెంగళూరులో జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబైఇండియన్స్ జట్టు 8వికెట్లతో యూపీవారియర్స్‌పై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో నాట్ సివర్ బ్రంట్ (75 నాటౌట్; 3 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ముంబై ఇండియన్స్ విజయంలో కీలకపాత్ర పోషించింది. గత మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)పై సూపర్ ఓవర్లో నెగ్గిన యూపీ వారియర్స్, అదే జోరు కొనసాగించలేకపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులకు పరిమితమైంది. గ్రేస్ హ్యారిస్ (26 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్సులు), దినేశ్ వృందా (30 బంతుల్లో 33; 5 ఫోర్లు) ధాటిగా ఆడారు. కెప్టెన్ దీప్తి శర్మ (4), కిరణ్ నవగిరె (1), తాలియా మెక్గ్రాత్ (1), షినెల్ హెన్రీ (7) విఫలమయ్యారు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో సివర్ బ్రంట్ 3 వికెట్లు, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 17 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. సివర్ బ్రంట్ (44 బంతుల్లో 75 నాటౌట్; 13 ఫోర్లు), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 59; 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకాలతోఅదరగొట్టారు. యూపిబౌలర్లు సైమా, షినెల్ హెన్రీ, సోఫీ ఎకిల్‌స్టోన్ ఓవర్లలో సివర్ మూడు బౌండరీల చొప్పున కొట్టింది. రెండో వికెట్‌కు హేలీ, సీవర్ 133 పరుగులు జోడించి ముంబై జట్టుకు అలవోక విజయాన్ని అందించారు. సివర్ బ్రంట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.



# గూగుల్‌లోనూ ఉద్యోగులు ఇంటికే..

**ముంబై, ఫిబ్రవరి 27:** కష్టమర్ల అవసరాలు అండ్ కొత్త అవకాశాలను తీర్చడానికి గూగుల్ నిరంతరం మార్పులు చేస్తోందని గూగుల్ ప్రతినిధి బ్లూమ్‌బెర్గ్‌తో అన్నారు. మరోవైపు ఈ నెల ప్రారంభంలో గూగుల్ క్లౌడ్ వ్యాపారం ఆదాయం విశ్లేషకుల అంచనాల కంటే తక్కువగా ఉంది. అదే సమయంలో అయితే తొలగించిన ఉద్యోగులమొత్తం సంఖ్య వెల్లడి కాలేదు. అయితే గూగుల్ ఉద్యోగులను తొలగించడం ఇదేం మొదటి సారి కాదు. గూగుల్ ఇంతకు ముందు చిన్న తరహా తొలగింపులు చేసింది. ఫలితంగా, ఇప్పుడు మరోసారి తొలగింపు జరిగింది. క్లౌడ్ డివిజన్ తొలగింపులకు ముందు గూగుల్ జనవరి 2024లో తన "ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైసెస్" విభాగం నుండి స్వచ్ఛంద తొలగింపుల ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రకటన ప్రధానంగా ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోన్ అండ్ నెస్ట్ వంటి గూగుల్ చెందిన ప్రసిద్ధ

2025లో కంపెనీ ఖర్చులు ఊహించిన దానికంటే ఎక్కువగా పెరిగాయి. ఈ తొలగింపులు కూడా దీని కారణంగానే జరిగి ఉండవచ్చని చెబుతున్నారు. గూగుల్ క్లౌడ్ విభాగం కంపెనీ వృద్ధికి ఎంతో దోహదపడే ముఖ్యమైన విభాగం. అందువల్ల, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కంపెనీ ఆర్థిక వ్యవస్థను సర్దుబాటు చేయడానికి గూగుల్ కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. ఫలితంగా, కొంత మంది ఉద్యోగులను ఇప్పుడు తొలగించారు.




ఉత్పత్తులలో పనిచేసే ఉద్యోగుల కోసం చేసింది. ఈ ప్లాన్ కింద ఉద్యోగులు తమంతట తాముగా కంపెనీని విడిచిపెట్టాలనుకుంటే వారికి పరిహార మొత్తాన్ని చెల్లిస్తారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ కార్యక్రమం ఉద్దేశ్యం కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించే ఉద్దేశ్యంతో తీసుకుంది. గతంలో చూస్తే సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్ 2022లో ఖర్చు తగ్గింపులను ప్రారంభించింది, ఈ తరుణంలోనే సుందర్ పిచాయ్ కంపెనీని 20 శాతం మరింత సమర్థవంతంగా చేయాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఈ పునర్నిర్మాణం భారీ తొలగింపులకు దారితీసింది, దీంతో జనవరి 2023లో 12 వేల మంది ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు.

# 3వ త్రైమాసికంలో భారత్ వృద్ధి 6.2% : డాయిష్ బ్యాంకు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** భారత ఆర్థిక వ్యవస్థకు గడ్డుకాలం ముగిసినట్టేనని జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంకు అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో జీడిపి 5.4శాతానికి పడిపోవడం తెలిసిందే. దీంతో దేశ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు నెలకొన్నాయి. ఈ తరుణంలో డిసెంబరు త్రైమాసికంలో జీడిపి 6.2శాతానికి మెరుగు పడుతుందని బ్యాంకు అంచనా వేసింది. అయినప్పటికీ, 2025-26లో జీడిపి వృద్ధి 7శాతం లోపే ఉంటుందని పేర్కొంది. మూడవ త్రైమాసికం జీడిపి గణాంకాలు విడుదల కావడానికి ముందు బ్యాంకు ఈ నివేదిక విడుదల చేయడం విశేషం. కీలక సూచికలు కూడా వృద్ధిరేటు 6.2శాతానికి పెరుగుతుందని సూచిస్తున్నట్లు తెలిపింది. వృద్ధికి మద్దతుగా ఏప్రిల్ మానిటరీ పాలసీ సమీక్షలోనూ ఆర్‌బిఐ మరో 25 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించొచ్చని అంచనా వేసింది. అనంతరం 0.50 శాతం రేటు బదిలీ దిశగా లిక్విడిటీ




చర్యలపై ఆర్‌బిఐ దృష్టిసారించొచ్చని తెలిపింది. ప్రస్తుతం సైకిల్‌లో మరిన్ని రేట్ల కోతలు ఉండక పోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేసింది. లిక్విడిటీ అవసరాల పట్ల ఆర్‌బిఐ ఇప్పటికే దృష్టిపెట్టిందంటూ, ఇటీవల 10 బిలియన్ డాలర్ల స్వాప్ ప్రకటన ప్రోత్సాహకరంగా ఉన్నట్లు పేర్కొంది. భారత్ 6.5-7 శాతం మేర జీడిపి వృద్ధిని నమోదు చేయాలంటే, పన్నుల పరిధిని 1.2-1.5 శాతం స్థాయిలో కొనసాగించాలని ఈవై సూచించింది. ఆదాయ వసూళ్లను బలోపేతం చేసుకోవాలంటూ, జీడిపిలో పన్నుల నిష్పత్తిని 2025-26లో 12శాతం అంచనా స్థాయి నుంచి 2023-31 నాటికి 14 నాటికి 14 శాతానికి పెంచుకోవాలని పేర్కొంది. ద్రవ్య నిర్వహణ, నిర్మాణాత్మకసంస్కరణలు, పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించాలని సూచించింది. 2025-26లో భారత జీడిపి 6.3-6.8శాతం మధ్య వృద్ధిని నమోదు చేయవచ్చని అంచనా వేసింది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ సూచీలు

**ముంబై, ఫిబ్రవరి 27:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రకటనలు ఇప్పటికే ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ క్రమంలో మార్కెట్ గమనంపై అనిశ్చితి నెలకొనడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు రోజంతా ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించగా, స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీల్లో మాత్రం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. చివరికి సెన్సెక్స్ 10.31 పాయింట్లు లాభంతో 74,559.86 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 2.50 పాయింట్లు నష్టపోయి 22,545.05 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.87.21గా ఉంది. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, జొమాటో, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అల్ట్రాటెక్‌సిమెంట్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, టెక్ మహీంద్రా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.




# పెన్నీ స్టాక్స్‌తో ఎల్ఐసికి కనకవర్షం

**ముంబై, ఫిబ్రవరి 27:** ప్రస్తుతం మార్కెట్లో దేశీయ అతిపెద్ద బీమా కంపెనీ ఎల్ఐసీ పెట్టుబడుల పోర్ట్ ఫోలియోపై ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతోంది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసీ దాదాపు 330 కంపెనీల్లో ఒక శాతం వాటాను కలిగి ఉంది. ఈ క్రమంలో బీమా దిగ్గజం 14.72 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడుల విలువను కలిగి ఉన్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్ల కరెక్షన్ కొనసాగుతున్న వేళ ఫిబ్రవరి 2025లో దీని విలువ రూ.13.87లక్షల కోట్లకు తగ్గింది. ఈ క్రమంలో మల్టీబ్యాగర్ రాబడులను అందించిన మూడు పెన్నీ స్టాక్స్‌పై రిటైల్ ఇన్వెస్టర్ల దృష్టి కొనసాగుతోంది. వాస్తవానికి పెన్నీ స్టాక్స్ అనేవి తక్కువ ధర వద్ద భవిష్యత్తులో మంచి పెరుగుదలకు అవకాశం ఉన్నవిగా చెప్పుకోవచ్చు. కంపెనీలో వ్యాపారం మంచి భవిష్యత్తును కలిగి ఉండి ప్రస్తుతం తక్కువ ధర వద్ద అందుబాటులో మార్కెట్లో చాలా మంది గుర్తించని కంపెనీలను మల్టీబ్యాగర్ స్టాక్స్ అని పిలుస్తారు. తక్కువ కాలంలో ఎక్కువ రాబడిని అందించటం వల్ల ఇవి ఎక్కువగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. ఎల్ఐసి వంటి ప్రముఖ సంస్థాగత పెట్టుబడి దారులు కూడా తమ పోర్ట్‌ఫోలియోలో కొన్ని పెన్నీ స్టాక్లను హోస్ట్ చేస్తున్నాయి. ఇవి దీర్ఘకాలంలో లక్ష పెట్టుబడిని ఏకంగా రూ.15 లక్షలుగా మార్చేశాయి. ఎల్ఐసీ హోల్డ్ చేస్తూ మంచి రాబడిని అందించిన మల్టీబ్యాగర్ పెన్నీస్టాక్స్ కేటగిరీలో ముందు వరుసలో ఎటివి ప్రాజెక్ట్స్ ఇండియా కంపెనీ షేర్లు నిలిచారు. 5ఏళ్ల కాలంలో ఎల్ఐసీకి 778 శాతం భారీ రాబడిని ఈ స్టాక్ అందించింది. గడచిన ఏడాది కాలంలో స్టాక్ ధర 65 శాతం మేర పెరుగుదలను చూసింది. వాస్తవానికి కంపెనీ చక్కెర పరిశ్రమకు అవసరమైన పరికరాల తయారీలో ఉంది. కంపెనీ ఉత్పత్తులు ప్రధానంగా రసాయనాల తయారీ, పెట్రోకెమికల్స్, ఎరువులు, విద్యుత్ వంటి పరిశ్రమల్లో ఉపయోగిస్తుంటారు. ఇక ఎల్ఐసీకి మంచిరాబడులను తెచ్చిపెట్టిన రెండవ పెన్నీ స్టాక్‌గా ఓరియంట్ గ్రీన్ పవర్ నిలిచింది. రెన్యూ వబుల్ ఎనర్జీ రంగానికి చెందిన కంపెనీ తన పెట్టుబడిదారులకు దీర్ఘ కాలంలో మంచిరాబడులను తెచ్చిపెట్టింది. గడచిన 5 ఏళ్ల కాలంలో 645 శాతం మేర భారీ రాబడిని ఈ స్టాక్ ఎల్ఐసీకి అందించి తన సత్తా చాటుకుంది. గత ఏడాది కాలంలో 45 శాతం మేర పెరుగుదలతో ఉత్తమ పనితీరును కనబరిచింది. కంపెనీ ఇండిపెండెంట్ రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిదారు.




# ఎఐ స్టార్టప్‌తో పేటిఎం టైఅప్

**ముంబై, ఫిబ్రవరి 27:** ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం మాతృసంస్థ 'వన్97 కమ్యూనికేషన్స్' ఎఐ స్టార్టప్ పర్‌ప్లెక్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తన యాప్ ఎఐ ఆధారిత సెర్చింగ్ సేవల్ని అందించేందుకు స్టార్టప్‌తో జట్టు కట్టినట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొంది. ఈ సౌలభ్యంతో యూజర్లు స్థానిక భాషల్లో ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకోవచ్చని పేర్కొంది. పర్‌ప్లెక్సిటీతో భాగస్వామ్యంపై పేటిఎం వ్యవస్థాపకుడు, సిఇఒ విజయ్ శేఖర్‌శర్మ మాట్లాడుతూ, త్వరితగతిన సమాచారాన్ని పొందడం, నిర్ణయాలు తీసుకొనే విధానాన్ని కృత్రిమ మేధ సాంకేతికత మారుస్తోంది. పర్‌ప్లెక్సిటీతో మేము లక్షలాది యూజర్లకు ఎఐ శక్తిని అందిస్తున్నాం. దీంతో ఆర్థిక సేవల్ని మరింత సులభంగా యాక్సెస్ చేయొచ్చు అని విజయ్ అన్నారు. పేటిఎం భాగస్వామ్యంపై పర్‌ప్లెక్సిటీ సిఇఒ, సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ ఆనందం వ్యక్తం చేశారు. మెరుగైన ఆర్థిక నిర్ణయాలు తీసుకొనేందుకు ఈ ఎఐ సేవలు సాయపడతాయని తెలిపారు.




# వాణిజ్యం

## వైర్ షేర్లకు 'అల్ట్రా' ఝలక్.. 20% మేర పతనం!

**ముంబై, ఫిబ్రవరి 27:** ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్, వైర్లు, కేబుళ్ల విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించడంతో ఆ రంగంలో ఉన్న కంపెనీల షేర్లు గురువారం కుదుపునకు లోనయ్యాయి. మార్కెట్‌లో ఇప్పటికే ప్రధాన ప్లేయర్లుగా ఉన్న పాలిక్యాబ్ ఇండియా లిమిటెడ్, కెఐఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆర్‌ఆర్ కేబుల్ లిమిటెడ్, హావెల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. బిర్లా ఓపస్ బ్రాండు ద్వారా గతేడాది డెకరేటివ్ పెయింట్ల విభాగంలోకి ఆదిత్య బిర్లా గ్రూపు అడుగుపెట్టిన విషయం విదితమే. వాణిజ్య, స్థిరాస్తి, మౌలికం, పారిశ్రామిక రంగం సహా వివిధ రంగాల్లో వైర్లు, కేబుళ్లకు పెరుగుతున్న గిరాకీ అవకాశాలను అందిపుచ్చుకునే లక్ష్యంతోనే ఆ విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా ప్రకటించింది. ఇందుకోసం గుజరాత్‌లో ప్లాంటు ఏర్పాటు చేసే నిమిత్తం




రాబోయే రెండేళ్లలో రూ.1800 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ నేపథ్యంలో కెఐఐ ఇండస్ట్రీస్ అత్యధికంగా 20శాతానికిపైగా పతనమైంది. ఎన్ఎస్ఇలో రూ.3,010 వద్ద ట్రేడవుతోంది. పాలిక్యాబ్ 13శాతం, హావెల్స్ 9శాతం, ఆర్ఆర్ కేబుల్ 15శాతం చొప్పున నష్టపోయాయి. అల్ట్రాటెక్ ఎంట్రీ వల్ల పోటీ వాతావరణం నెలకొంటుందన్న భయాలు అమ్మకాలకు కారణమయ్యాయని అనలిస్టులు చెబుతున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ షేర్లు కూడా 6శాతం మేర పతనమై రూ.10,330 వద్ద ట్రేడయ్యాయి. అయితే కొత్త వ్యాపారంలోకి అడుగుపెడుతుండడంతో రిస్క్ ఉండొచ్చన్న అంచనాలు ఇన్వెస్టర్లలో భయాందోళనలకు కారణమయ్యాయి. ప్రస్తుతంసిమెంట్ రంగంలో అగ్రగామిగా ఉన్న అల్ట్రాటెక్ ప్రధాన వ్యాపారంపై తాజా నిర్ణయం ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.